# ఆంధ్రమహిళ

సాంఘికాభ్యుదయ మాస పత్రిక




ANDHRA MAHILA

విషయ సూచిక :



---

## వ్యాసకర్తలకు విన్నపము

1. వ్యాసాలు కాగితాని కొక్కప్రక్కే వ్రాసిపంపాలి.
2. అక్షరాలు తెలిసేట్టు విడివిడిగా వ్రాయాలి.
3. పంపిన వ్యాసాలు రచయితలకు తిరిగి పంపబడవు.
4. వ్యాసకర్తల అభిప్రాయాలకు—సంపాదకులు ఎంతమాత్రం పూచీ వహింపజాలరు.

మేనేజరు,
"ఆంధ్ర మహిళ"

# ఆంధ్రమహిళ

వ్యవస్థాపకురాలు : దుర్గాబాయి దేశ్‌ముఖ్

సంపుటి 18 :: ఫిబ్రవరి, 1961 :: సంచిక 2

## అఖిల భారత మహిళాసభ తీర్మానాలు

అఖిల భారతమహిళా వార్షిక మహాసభ యీసంవత్సరం సూరత్తునగరంలో డిసెంబరు 27– వ తారీఖునించి, 29– వ తారీఖువరకు శ్రీమతి మితన్‌లామ్‌గారి అధ్యక్షతక్రింద జయప్రదంగా జరిగింది. ఆమెగారు ఆసభలో ఇలా చెప్పారు :—"నానాటికి అభ్యుదయాన్ని పొందుతూండే మన దేశంలో, మనకై ప్రత్యేకింపబడ్డ అవకాశాల నన్నిటిని వినియోగించుకోగలిగే టట్లు, మనబాలికలు ఉన్నతవిద్యలను నేర్చుకోవటానికి దృఢంగా ప్రయత్నం చేయాలి. అట్టి విద్యాసౌకర్యాలకోసం మనం నిరంతరం ఆందోళన చేస్తూ, ఉన్నతపాఠశాలలలోనూ కళాశాల లలోను చదివే బాలబాలికల సంఖ్యలలో ఎచ్చుతగ్గులుండకుండా, సమానస్థాయిలో ఇరుతెగల వారు విద్యాభ్యాసం చేసేటట్లు ప్రయత్నించాలి. ప్రకృతం, విద్యావిషయంలో గల అవకాశాలు బాలుర కెక్కువగా ఇవ్వబడినాయి; కాని బాలికలకు అట్టివి లేవు. ఇరుతరగతులకు అట్టి హక్కులు సమానంగా చెల్లించగలిగేటట్లు ప్రభుత్వంమీద ఒత్తిడి తేవాలి. అభివృద్ధిపథకాలను అనుసరించి, మిత వ్యయాన్ని గూర్చి ప్రభుత్వం ఆలోచించేటప్పుడు, తక్కిన శాఖల్లో ఖర్చులను ఒకపరిమితికి తేవా ల్ననే చింతలేకుండా, తొలుదొల్తటిదిగా, స్త్రీల– బాలికల విద్యావిషయాల్లో ఎంతవరకు అట్టి వ్యయాలను తగ్గించవచ్చునో, అంతవరకూ తగ్గించటానికి ప్రయత్నిస్తుంది. కనుకనే బాలికల విద్యా విషయాల్లో కొంతవరకు ప్రభుత్వంకూడా అలక్ష్యం చేస్తున్నదనే నిందకు పాత్రం కాకతప్పదు."–

శ్రీమతి మితన్‌లాంగారి పై వాక్యాలు నూటికి నూరుపాళ్ళు కాకున్నా, ఎత్తొంభై పాళ్ళే యథార్థం అని స్వానుభవం కలిగిన విద్యావంతులందరూ దృఢంగా చెప్పగలరు. పోతే, కేవలం ప్రభుత్వాన్నే యిందుకు కారణమని చెప్పటం యుక్తమనిపించదు. ప్రభుత్వంకూడా స్త్రీల విద్యావిషయంలో అంతగా పట్టించుకోకపోవటం నిజమే అయినా, దానిమీద ఒత్తిడి తేవలసిన బాధ్యత ప్రజలకు పూర్తిగా ఉంది. ప్రజానీకం అట్టిహక్కు కలిగిఉన్నప్పుడు ఎంతఆందోళన అయినా చేసి కేంద్రరాష్ట్రాల ప్రభుత్వ దృష్టులను మరల్చి, స్త్రీ విద్యకు తగిన దోహదం కలిగించ వచ్చు. అట్లు చేస్తున్నారా ప్రజలు?– అంటే బాత్తిగా లేదనే చెప్పాలి. దీన్నిబట్టి మనం ఒకముఖ్యవిషయాన్ని గమనించాలి. తలిదండ్రులకు మగపిల్లల చదువుమీద గలశ్రద్ధ ఆడుపిల్లల

చదువుపై లేదనే చెప్పొచ్చు. ఏదో కొంచెం సంస్కృతిగల గొప్ప కుటుంబాలలో మాత్రం స్త్రీ విద్యావిషయంలో శ్రద్ధాసక్తులు ఉండవచ్చు. తమ పిల్లలను విద్యారంగంలో ప్రవీణులను చేయ వచ్చు. కాని అలాటివాళ్ళ సంఖ్య చాలా స్వల్పమనక తప్పదు. మధ్యతరగతివారిలోను, వెనుకబడ్డ తరగతులవారిలోను, చాలామంది బాలికలు విద్యావిహీనులై ఉండటానికి కారణాలు లేకపోలేదు:-

(1) ఆర్థికోపపత్తులు చాలినంత లేకపోవటం, (2) ఇంకా పాతకాలపు అభిరుచులే సంఘంలో నిలనాటుకొని ఉండటం. (3) ఛాందసులైన బామ్మలు, బామ్మలు తమ కాలాచారాలే కుటుంబాల్లో కొండవిస్తూ ఉండాల్నని ఒత్తిడి తేవటం, (4) సంఘనిందకు వెరిచి పెద్దలయినవారు చదివేయీడులోనే బాలికల పెండ్లిండ్లకు ఆరాటపడటం, (5) కన్నెల యిష్టానిష్టాలతో పనిలేకుండా వాళ్ల విద్యావివాహాదిక నిర్ణయాలు చేసే హక్కు తమవే, అని తలిదండ్రులు భావించటం, (6)— లోకం పోకడను, ప్రగతిమార్గాన్ని గుర్తించి ఆలోచించకుండా తమవట్టే నెగ్గాల్నని కన్నవారు భావించటం— బాలికల భావిజీవితానికి అడ్డంకులై కూచుంటాయి.

ఇలాంటివి, శాస్త్రమర్యాదలనండి; — విధ్యుక్త కులాచారమనండి;— సంఘ ధర్మములనండి;— మరేమయినా అనండి:— బాలికల స్వాతంత్ర్యానికి, చిత్తవికాసానికి, ఉత్సాహానికి- అన్నిటికంటే మించిన భావి గార్హస్థ్య జీవితానికి గొడ్డలిపేటులు, విద్యావతులైనా, కాకున్నా- నారీమణులుకూడా మానవులే, జాతిబొమ్మలు కారు. వారికీహృదయం, యుక్తాయుక్త విచక్షణ, భావిసుఖజీవనాసక్తి, ఆత్మాభిమానం- మొదలయిన సహజ మానవ గుణాలున్నాయి. అలాటప్పుడు- విద్యార్థినీ దశలోనే, తద్భంగకరాలయిన- గృహిణీత్వం— మాతృత్వం- వాళ్ళకి అంటగట్టజూచే పెద్దలు మానవులుకారు. మరి దానవులనటంలో సందేహంలేదు. “స్త్రీలకు స్వేచ్ఛ ఇవ్వాలి. అలా ఇచ్చినప్పుడే— వాళ్ళలో దాగివుండే మహచ్ఛక్తులు సంఘాభ్యుదయానికి ఉపకరిస్తుంది”— అనే- నేటియువకులలో ఎంతమంది పెండ్లి కాగానే, భార్యలకు చదువుతో ఇక పడలేదని వాదించటంలేదు? ఎక్కువచదువులు చదివితే, బానిసలవలె తమకు గులాంగిరీ చేయరనీ, యంత్రవత్తుగా. తాము చెప్పినట్లల్లా నడుచుకోరని ఎందరు నాగరికులు దురభిప్రాయపడటం లేదు. ఒకకన్య తనభార్య అయినంత మాత్రాన- ఆమెకున్న హక్కు— స్వేచ్ఛ, స్వాతంత్ర్యం— తానే భుక్తంచేసుకునే యీనాటి భారతీయయువకుడు సంఘానికి కేలాంటి మేలు చేయగలడు? ప్రాచీనాచారాలలో అనేకం పరిశీలించేవారికి పురుషుడు ఆదిమండి— వాళ్ళని పైకిరానీక ఏలా త్రొక్కిపట్టుకొన్నాడో విశదం కాగలదు.

పైవిషయాలనుబట్టి పర్యాలోచిస్తే, శాసనాలు చట్టాలవల్లగాక, సంఘంలోనే సంస్కృతి యేర్పడాలని తెలుస్తుంది. ఇలాంటి సందర్భాల్లో పడమటిదేశాల వనితలు తమ హక్కులకోసం సంఘంతోనూ ప్రభుత్వంతోనూ పోరాడటంలో వెనుదీయకపోవటం ప్రత్యక్షానుభవం. అమెరికా, రష్యా, బ్రిటను మున్నగుదేశాల్లో స్త్రీల అభ్యుదయాన్ని ఆకాంక్షించే ప్రభుత్వాలు వారికి ఈయతగినంతటి స్వాతంత్ర్యాన్ని ఇవ్వటంవల్లనే వాళ్లు సర్వతోముఖాభివృద్ధి చెందటానికి అవకాశాలు ఏర్పడ్డాయి. సంఘంలో స్త్రీలని పురుషులని విభేదాలు ఎంచకుండా, పాటుపడటంవల్లనే— ఆదేశాలు సంపద్వంతంగా సమస్తరంగాలలో ప్రకాశిస్తూ, ఇతరదేశాల కాదర్శాలవుతున్నాయి.

ఈ వార్షికసభలో మహిళాభ్యుదయానికి సంబంధించిన తీర్మానాలు ఎన్నో చేయబడ్డాయి. అందులో. రాజ్యాంగచట్టాన్ని అనుసరించి ఇరుదేగలవారికి ఈబడినహక్కులకు భంగకరంగాను, వ్యతిరేకంగాను ఎట్టిశాసనాలుగాని చేయకూడదని, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రప్రభుత్వాల నన్నిటినీ శాసించాల్నని తీవ్రంగా కోరుతూ తీర్మానించటం ప్రశంసాపాత్రం. ఈతీర్మానాన్ని తెచ్చిన వారు శ్రీమతి సీతాపరమానంద్. యం. పి. ఇందుకు కారణం లేకపోలేదు. 1956 సం॥రపు- భారతీయ కుటుంబాలలోని ఆస్తుల ఉత్తరాధికారులుగా పుత్రులతోబాటు పుత్రికలు గూడా సమానహక్కులు గలవారనే చట్టానికి భిన్నంగా, రెండవశ్రేణికి వచ్చే హక్కుదారులుగా ఆప్రభుత్వం నిర్ణయిస్తూ భారతరాజ్యాంగచట్టాలని ఉల్లంఘించటం అక్రమమని సభలో నిరూపించబడింది. —అయితే హైందవసంఘ వ్యవస్థలో ఇట్టిచట్టం ఎంతవరకు అములుకు వస్తుందనేది మాత్రం విచారణీయం. బాల్యవివాహాలు, వరశుల్కాలు, లంచాలు, మద్యనిషేధాలు— మొదలయినవాటిని రూపుమాపటానికి చట్టాలు చేయటానికేమో చేశాయిగాని, ప్రభుత్వం. —అలాంటివి జయప్రదంగా సాగించటానికి క్రియారూపంగా ఏమిచేసినట్లు! ఇక స్త్రీపురుషుల కన్ని విషయాల్లో సమానహక్కులు శాసనరూపంగా కాగితాల్లో పైవాటిమోస్తరే నిలిచిపోతాయి గాని, క్రియారూపేణ అబలలహక్కులకు బలంచేకూరుస్తుందనుకోవటం, కేవలం భ్రమ. అట్టివి సంఘశక్తిమీదే ఏకోన్ముఖంగా ఆధారపడి తద్వారా జాతిలో నూతనచైతన్యం కలగించాలి. మళ్ళా-రామమోహనులు. విద్యాసాగరులు, వీరేశలింగంపంతుళ్ళ లాంటివాళ్ళు నాయకత్వం వహించాలి; అట్టిసుదినం కొఱకు వేచిచూదాం.

---

# వెలుగు చుక్కలు

"ఉష"

"ఒక జాతి సంస్కృతికీ, వున్నతికీ, స్త్రీలలో కలిగే చైతన్యం గీటురాయి" అన్నాడు బాపుజీ, మన దేశంలో నేడు వైద్య, విద్యా, ఉపాధ్యాయ, న్యాయ రంగాలలో పనిచేసే స్త్రీలు అసంఖ్యాకం, అంతేకాదు; మునుపెన్నడూ ఊహించని, ఈనాటికీ కొందర్ని ఆశ్చర్య చకితుల్ని చేసే రంగాలలో స్త్రీలు ప్రవేశిస్తున్నారు. ప్రత్యేక ప్రతిభ కనబరుస్తున్నారు. మన జాతికీ, సంస్కృతికీ గౌరవం తెచ్చి పెడుతున్నారు. వీరు ఈరంగాలలో ఎలా ప్రవేశించారు? ఎలాటి పరిస్థితుల్ని ఎదుర్కొన్నారు? విజయపు శిఖరాలని ఎలా అందుకున్నారు? వీరికన్నీళ్లు, బాధలు, విజయం....జీవితంలోని ఒక్కొక్కఘట్టం ఒక్కొక్క మణిపూసలాటి సత్యాన్ని నిరూపిస్తుంది. భారతదేశంలోని వివిధప్రాంతాల వున్న వీరినిగురించి, ఉత్సాహవంతులు విద్యావంతులు అయిన యువతులు ఎంతయినా తెలుసుకోవలసివుంది. ఈక్రింద నేను పరిచయంచేసే యిద్దరు స్త్రీలు, రెండు విభిన్నరంగాలలో అద్వితీయ ప్రతిభ కనబరిచారు.

• • • •

అది 1951 వ సం॥రం. కలకత్తా, బరక్‌పూర్ విమానాశ్రయంలో జనం కిటకిటలాడుతున్నారు. విమానం క్రిందికి వస్తూనే, కరతాళధ్వనులు చేశారు. విమానంలోంచి దిగిన యువతికి కరచాలనం చేసేందుకు చేతులు చాచి ముందుకి వచ్చారు.

ఆమెకి ఇరవయ్యేళ్లుంటాయి. సిగ్గుతో, భయంతో, ముఖం ఎర్రపడివుంది. పోటీలో తాను గెలిచానన్న ఆనందం ఒకపక్క సంభ్రమాశ్చర్యాలు ఒకపక్క, ముఖాన్ని ఆవరించాయి. ఆపోటీలో పాల్గొనాలని ఆమె ఒక్కనాడూ అనుకోలేదు. ముందుగా ఎటువంటి తర్ఫీదు పొందలేదు. అప్పటికి అయిదు రోజులు ముందుగానే

ఈసాహసకార్యం తలపెట్టింది. అంతర్జాతీయ వైమానికుల పోటీలో ప్రథమంగా వచ్చినందుకు ఆ నాడు ఆమె మూడుబహుమతులు, రు. 3000 రొఖ్ఖం అందుకున్నది. వైమానికి శిక్షణపొందిన ప్రథమ భారతయువతి కుమారి ప్రేమ్ మాథుర్, గౌరవ కుటుంబంలో పుట్టిన ఒక సామాన్య భారత యువతి. పురుషులుసైతం వెరచే ఇటువంటి శిక్షణ పొందేముందు, ఎదుర్కొన్న సమస్యలు చిక్కులు అనేకం. వాటిని విపులీకరిస్తూ ఆమె ఇలా చెప్పుకుపోయింది.

"అవి నేను అలహాబాదులో బి. ఏ. చదువుతున్న రోజులు. మా కుటుంబ స్నేహితులు ఒకాయనతో విమానంఎక్క, మొదటిసారిగా దాన్ని నడిపేందుకు ప్రయత్నించాను. అప్పటికి మాకుటుంబంలో చాలా మంది విమానదళంలో పనిచేస్తున్నారు. మాపినతండ్రి ఢిల్లీ ఫ్లయింగ్ క్లబ్బులో ముఖ్యఅధ్యాపకులుగా వున్నారు. కానీ నాకు విమానం నడిపేసరదా వుందనేసరికి ప్రోత్సాహించలేదు సరికదా, ఒద్దని తీవ్రంగా వాదించబోయారు. అదీకాక, అలహాబాదులో అప్పటికి ఫ్లయింగ్ క్లబ్బంటూ లేదు.

నాఆశలన్నీ నిరాశలయాయి. అవకాశంకొరకు కాచుకునుండటం తప్ప నేను చేయగలిగింది ఏమీలేకపోయింది. బి. ఏ. పూర్తిచేసి ఎం. ఏ. లో చేరాను. తత్వశాస్త్రం ముఖ్యసబ్జక్టుగా తీసుకున్నాను. 1948 వ సం॥లో అలహాబాదులో ఫ్లయింగ్‌క్లబ్బు స్థాపించారు. ఇంట్లో వాళ్లూ స్నేహితులూ, ఎంతవారించినా, వాదించినా వినక ఆక్లబ్బులో చేరాను. ఈ వృత్తిని మన దేశంలో యింతవరకూ స్త్రీలు స్వీకరించకపోవటం వల్ల, నాకు ఎటువైపు చూసినా, నిరుత్సాహము, విమర్శ ఎదురయాయి. నా సమర్థత, సాహసము, ఆత్మవిశ్వాసము నిరూపించేందుకు కొంతకాలం వేచివుండవలసివచ్చింది." అంటూ నవ్వింది మాథురి.

1951 వ సం॥లో ఈమె కమర్షియల్ "బి" లైసెన్సును పొందింది. ప్రపంచం మొత్తంమీద ఈ గౌరవం పొందిన ప్రథమ స్త్రీ ఈమె. స్త్రీలు సహజంగా అధైర్యస్థులు. ఆపత్సమయాలలో ధైర్యము, చతురత లోపిస్తాయి. వారిలో. విమానప్రమాదాలు సంభవిస్తాయి—అనే వాదనని తీవ్రంగా ఖండిస్తుంది మాథురి.

ఉత్తరప్రదేశ్‌లోని ఒకగౌరవకుటుంబానికి చెందినది ఈమె. నల్లని కనుపాపలుగల విశాలనేత్రాలు మంచి పొడవు మృదువైన కంఠము—నిండైన విగ్రహం ఈమెది. ధైర్యవిశ్వాసాలతోబాటు నమ్రత తొణికిసలాడుతూంది ఈమెలో. యువతులు ముందంజవేసి వైమానికశిక్షణ పొందాలనీ ఈవృత్తిలో ఎందరోస్త్రీలని తను చూడకోరుతున్నాననీ అన్నది.

• • • •

కళ అంటే ఏమిటి? ఒకవ్యక్తి భావాలకీ, ఉద్రేకాలకీ, ప్రతిబింబం.... ఒకవ్యక్తి ఊహాప్రపంచం.,.స్వప్నసీమ. .. కానీ కళాకారుడు సాధనవల్లనే కళని అభ్యసించగలడు, పత్రికా రచయితకి భాషాజ్ఞానం ఎలా అవసరమో కళాకారుడికి కళాస్వరూపం, పద్ధతి తెలియటం అంత అవసరం. ఇతరరంగాలలోకి మల్లె, కళారంగంలో ఒకవ్యక్తిని మరో వ్యక్తితో పోల్చలేము. కళ ఒక వ్యక్తి మానసిక అంతరంగిక పరిమితికి గీటురాయివంటిది. విలువకట్టలేని ఒకమధురానుభూతి! సరససంగీతము!

చిత్ర కళనిగూర్చి ఈవిధంగా పలికింది ప్రఖ్యాత చిత్రకారిణి, శిల్పి అయిన శ్రీమతి ప్రమోదచౌధురి. సగం చెక్కిన సుందర విగ్రహాలు, గోడకి వేళ్లాడుతున్న రంగులచిత్రపటాలు, కుంచె, రంగులు, అక్కడక్కడ చెక్కుతున్న రాళ్లు...ఢిల్లీలోని ఆమె స్టూడియో అది. గది నలుమూలలా ఔత్సుక్యంతో చూస్తున్ననాకు టీ అందించి, తన జీవితకథని చెప్పనారంభించింది ఆమె.

కలకత్తాలోని ఒకసనాతన బెంగాలీకుటుంబంలో పుట్టింది ఈమె. తండ్రి విశాలహృదయుడు, అభ్యుదయవాది. కొడుకులతోబాటు కూతుళ్లనీ చదివించాడు ఆయన ప్రోత్సాహంతోనే ప్రమోద విద్యాభ్యాసంకొరకు విదేశాలు వెళ్లింది. అక్కడ, మేధావులు, పండితులు, కళాకారులు అయిన అనేకులతో పరిచయం ఏర్పడింది ఈమెకి. లండన్ కింగ్సు కళాశాలలో నాలుగుసంవత్సరాలు చదివింది. వీలుచిక్కినప్పుడల్లా, పారిస్‌లోని కళాప్రదర్శనాలకి వెళ్లేది. క్రమంగా ఇది ఆమెకి ఒక వ్యసనమయిపోయింది.

చిత్రలేఖనంపట్ల ప్రత్యేకఅభిమానం ఏర్పడి, కాయితం, కలం చేతబట్టింది. అనేకచిత్రాలని గీసింది. సాయంకాలాలు పాలీటెక్నిక్ కోర్సు క్లాసులకి వెళ్ల నారంభించింది. అప్పట్లో దాదాపు 40,000 మంది చిత్రకారులు పారిస్‌లో చిత్రలేఖనం నేర్చుకుంటున్నారు. అంతా ప్రపంచంలోని నలుమూలలనుంచీ వచ్చినవారు. వారిని కలుసుకుని,

(21-వ పుట చూడండి)

# వీరపత్ని

## శ్రీ యం. టి. రామిరెడ్డి

శ్రీరాముడు రాజ్యపాలనమునకు రాగా అయోధ్యాపట్టణము మిగుల వైభవ ప్రాభవముల గాంచెను. అతని రాజ్యమున ప్రజలెవ్వరెట్టి లోపములు లేకుండ సకలైశ్వర్యము లనుభవించుచుండిరి. మఱియు నారాముడు చతుర్దశ విద్యా ప్రవీణుండై చతుర్దశ రాజ దోషములకు లోనుగాకుండ చతుర్దశ భువనములందు తనకీర్తి చిరస్థాయిగా నుండునటుల ప్రవర్తించు చుండెను.

అంతట ఒకనాడు కౌండిన్య, మైత్రేయ, మార్కండేయాది మౌనివరులు శ్రీరామునొద్ద కరుదెంచి శతకంఠుని దుండగములు తెలిపి "కరుణాతిరేకమున మా కభయమిచ్చి బ్రోవవే!" యని వేడిన, రాఘవుడందులకు నేనా దుష్టాత్ముని పంచభూతముల సాక్షిగా బరిమార్చి మీకు సంతోష మొనగూర్చెదనని యభయ మొసంగెను.

రాముడు విభీషణ సుగ్రీవాదుల వలన సైన్యము లాయత్తపఱచుకొని సమర ప్రయాణ ప్రయత్నమున నుండ, నా సమయమున సీతాదేవి తన జీవితేశ్వరుండగు రఘునాయకునకు మృదుమధుర వచనంబుల మెల్లన నిట్లనియె.

"ప్రాణనాథా ! మున్ను దశకంధరునితో పోరునప్పటి మీ యుద్ధనైపుణ్యము చెప్పగా విని, మఱియొక రాక్షస వీరునితో పోరు సంభవించినప్పుడు భవదీయ సంగర కౌశల్యము చూడ కుతూహలపడుచున్నదాన, నేటికి నా కోరిక ఫలింప కాలం బాసన్నమయ్యె. కాన నన్ను మీవెంట యుద్ధరంగమునకు గొని పొండని వేడెను.

అందులకు డారాము శ్చర్య మానసుండై సీతాదేవి కిట్లనియె.

"సీ॥ చిలుక పల్కుల విని యులుకు కోమలివి, దు
ర్విమతార్భటంబులు వినఁగఁగలవె?
ఎదురెవ్వరాడిన మదిఁ గుందు సుగుణవు,
ప్రత్యర్థి భాషలు పడఁగఁగలవె?
వెన్నెలకాఁకకు వెఱచెడి యబల, వ
త్యుగ్ర బాణాగ్నికి నోర్వఁగలవె?
స్ఫటికంపు సోపానపంక్తుల నొంటిమై
నిలువవు, రథముపై నిలువఁగలవె?

గీ॥ ఏల యడిగితి? వీబుద్ధి యెట్లుపుట్టెఁ?
గలహగతులేడ? నీవేడ? గమనమేడ?
శతముఖునిఁ జంపి వానిదేశమునఁ గలుగు
వస్తువులు నీకుఁ గొనితెత్తు వలవదుడుగు"

అనిన ప్రాణేశు నుద్దేశించి జానకీదేవి యిట్లనియె:

"చ. అనవరతంబు శోభనగృ
హంబునకున్, మఖమాచరించు తా
వునకును, సద్వ్రతంబులను
బొందుగ సల్పెడి సీమకున్, క్రతుల్
వినఁజనుచోటికిన్ సకల
విశ్వభయప్రద యుద్ధభూమికిన్
వనితలతోడఁగూడి చనవచ్చుటెఱుంగవె?
ప్రాణనాయకా"

అనుటయు, రాఘవుడిందులకు తెఱంగెయ్యదియో సెలవిమ్మని వసిష్ఠు ప్రార్థింప వసిష్ఠుడు నిజతపోమహిమను భూతభవిష్యద్వర్తమాన ప్రవర్తనముల తెఱంగెఱింగి, "రామా ! సీతాదేవి కోర్కెను మన్నించి నీ వెంట యుద్ధరంగమునకు గొనిపొమ్ము. శతకంఠుడు తనకు పురుషులచే చావులేకుండ బ్రహ్మవలన వరము బడసి తరుణుల తృణీకరించుచున్నాడు. కాన నభేద్యుండగు నా శతకంఠుడు జానకిచే తప్పక చావగలఁడు. నీకు జయము చేకూరును" అని ప్రబోధింప రామచంద్రుఁడు సీతాసతీ ప్రయాణమునకు సమ్మతించెను.

శ్రీరాముఁడు సకలదేశాధిపచమూసముదయంబులతోడ సీతాసమేతుండై శతకంఠునిపైకి యుద్ధమునకు వెడలి హనుమంతుని నా యసురకడకు రాయబారమంపెను. అది విఫలము కాగా, దండంబున నాదుండగిని దండధరుని లోకమున కనుప కృతనిశ్చయుండై సేనలం బురికొల్పిన, వారలు దైత్యుల గదిసి పెక్కు చందముల నుక్కుమెఱసి పోరసాగుటయు కొందఱు దానవులు చావుకుదప్పి శతకంఠుని యొద్దకు జని తమ్ము రాముని బారినుండి రక్షింపుమని వేడుకొనిరి.

అంత శతకంఠుఁడగ్నివలె మండిపడుచు, ఉన్నుఁబు కరముల నస్త్రశస్త్రముల ధరియించి, రాముని బరిమార్చెదనని యార్చుచు గదలిరాగా, రాఘవుడది గాంచి యనలాస్త్రములు వఱపిన శతకంఠు డవి యెల్ల ద్రుంచి తిరిగి యాతనిపై నైంద్రాస్త్రము వైచి యట్టహాసము చేయుచు నవక్ర పరాక్రమమున పోరాడు నా దానవవీరుని బరిమార్చు విధంబెఱుంగక చింతాకులస్వాంతుఁడయ్యెను.

ఆ సమయమున సీతాదేవి మగనివగపు గనుఁగొని ప్రాణనాయకునకిట్లనియె. "ప్రాణేశ్వరా ! మీరుశ్రమదీర్చుకొనుదనుక భవదీయ మహిమాతిశయమున నేనొక్కింత సేపు మీ చేతి విల్లమ్ములు దాల్చి రిపునితో బోరొనరించెద. అడుదాననని యనాదరము సేయక నావిన్నపమాలింప వేడెద." అనిన అందులకు రాఘవుడు ప్రాణనాయిక

ప్రార్థనను మన్నించి బాణాసనబాణతూణీరము లాశీర్వాద పూర్వకంబుగా. భూపుత్రి కొసంగెను,

అంత సీతాదేవి యమోఘబాణ పరంపరల విగిడించి శతముఖులందఱను వాయువ్యాస్త్రముల నొక్కదిక్కునకు ద్రోయుచు, మహోద్దండ ప్రచండ ఖండనము గావించిన. నాశతాననుఁడు భయాకులుఁడై " యిదినాపాలిటి మృత్యువు గాని యాఁడుది మాత్రముగా"దని విభ్రాంతపడి దిక్కులు చూడసాగెను.

అంత.

"చ. వెఱచినయట్టివేళ, మఱివింతగఁ గైదువు చక్కఁ బూనగా
మఱచినయట్టివేళ, బలుమాఱు నరాతికి వెన్నుచూపుచుం
బఱచినయట్టివేళ నగుబాటు ఘటింపగ జేరి పూరినిం
గఱచిన వేళలందు నెడగల్గి రథంబు మరల్చుటొప్పగున్.

అను నీతి ననుసరించి శతకంఠుని సారథి రథమును రణరంగమునుండి అవలకు గొనిపోయెను.

ఈ కథలో పద్యములు శ్రీ దాసరి లక్ష్మణస్వామి ప్రణీతంబైన సీతా విజయమునుండి గ్రహింపఁబడినవి.

"ధనమిచ్చి పుచ్చుకొన్నను
మనవచ్చుగాక భువిని, మగఁ డింతులకున్
మనమిచ్చి పుచ్చుకొన్నను
మనవచ్చునె? యింక నేటి మాటలు చెప్పుమా?" (నంది తిమ్మన)

# వాగ్దేవి

**శ్రీమతి ధవళ రుక్మిణిదేవి**

నమో నమో జయ శర్వాణీ
నమో నమో జయ గీర్వాణీ
నమో నమో జగదేకపావనీ ॥న॥

విజయ విలాసిని వీణాపాణి
పద్మ వదన సుధ కవితారాణి
ధవళకాంతి విస్ఫారితనేత్రి
విమలప్రసారిత అమరసుగాత్రి ॥న॥

అరుణోదయపు కాంతిజాడలా
నవరసభరిత నవ్యబాటలా
వినీల వికాస మధురవాక్కులా
వరాలస్వరాల స్వర్ణపేటికలో
నిలచియున్న నీ యాకృతి ప్రతిభ
వలచెను పిలిచెను నన్నుతిశోభ ॥న॥

హంపి అమరావతీ సింహపురీ మధుర
శిల్పనైపుణీ చాతురీ శోభిత వెలుగులోన
వజ్రవైడూర్య మాణిక్యరతనాల గద్దెపై
అలరు ప్రభాసిత దివ్యతేజస్సు జననీ ॥న॥

కరుణానిధివై కళాప్రౌఢివై
మధురమైన నీ కృతులశృతులతో
వరప్రదాయిగ చిరస్థాయిగ
కావుము జననీ కళామతల్లి
బ్రోవుము జననీ ఓంకారరూపిణి. ॥న॥

---

# సంక్రాంతి

**శ్రీ-రంగశ్రీ**

జియ్యరుదా సేతెంచి
హరికీర్తనలు వినిపించి
వేకువనే మేలుకొలిపి
ఆశీస్సులిచ్చె యెదనిలిపి

గృహప్రాంగణము శుద్ధిజేసి
రంగవల్లులు తీర్చిదిద్దినారు.
గోమయంతో గొబ్బిలు చేసి
తారకలభాతి నిలిపినారు.

ఇంటింటికి అరుదెంచి
గంగిరెద్దు తలపంకించి
సంతసమ్మున ఆడింది
సంక్రమణగీతి పాడింది.

ఏడాది కష్టమ్ము పండి
సిరులతో గేహమ్ము నిండి
రైతులాందములో తేలి
రంజిల్లుచున్నారులే సోలి.

ముక్కోటి గళాలను మీటుతూ
నూతన వత్సరానికి దాటుతూ
అరుదెంచె నహో సిరి సంక్రాంతి
అగుపించె నహో నవప్రశాంతి.

---

పూర్వం నా జీవితకాలాన సగమువఱకు నేనేలా దేదీప్యమానమయిన వెలుగులో గడపితినా, అని ఆలోచిస్తున్నాను. ప్రకృతం గాఢాంధకారబంధురం అయిన యీ విశాలప్రపంచంలో నా శక్తిసామర్థ్యాలను మృత్యుదేవత దాచివేసి నన్నొక నిష్ప్రయోజకునిగా చేసింది. కాని నా ఆత్మ, ఆ శక్తి సామర్థ్యాలవంకకే మొగ్గు చూపుతోంది.

(జాన్ మిల్టన్)

# విధి నిర్వహణ

## శ్రీ "సాయినాథ శాస్త్రి"

ప్రకాశాని కాసంగతి తెలిసేటప్పటికి అతగాడికృలిగిన ఆవేదనంతా యింతా కాదు. గబగబా మేనేజరుగారింటికి వెళ్ళాడు రిక్షాలో. అప్పుడే మేనేజరుగారు ఎక్కడికో బయల్దేరబోతున్న వారల్లా ఆగి "రా! రావోయ్! ప్రకాశం! ఏమిటి విశేషాలు?" అని ఎంతో ఆదరంగా ఆహ్వానించారు. వారి ఆదరాభిమానాల్ని చూసేసరికి కళ్ళల్లో నీరు తిరిగినై. కండ్లుతుడుచుకొని గొంతుసవరించుకుని "సార్! మా నాన్నగారికి వొంట్లో బాగా లేదటండీ! ఓ వారం రోజులు శెలవు కావాలిసార్! చెప్పెళ్దామనొచ్చానండీ!" అన్నాడు ప్రకాశం వినయంగా.

"దానికింత దూరం రావాల్టోయ్! ఆఫీసులో చెప్తే సరిపోయేదిగా! తప్పకుండా వెళ్ళిరా! ఇదుగో! తరువాత చూసుకోవచ్చుగానీ, యీ వంద దగ్గరుంచుకో!" అని ప్రకాశం వొద్దంటున్నా వినకుండా డబ్బిచ్చి పంపించారు. ప్రకాశం మంచితనాన్ని గుర్తించిన మేనేజరుగారు ప్రకాశాన్ని గౌరవించకుండా వుండలేకపోయారు. అందుకనే ఎవ్వరికీ నయాపైసాగూడా అప్పివ్వనాయన ప్రకాశం అడక్కుండానే వందరూపాయలిచ్చి మరీ పంపారు. మేనేజరుగార్కి కృతజ్ఞత తెల్పి గబగబా యింటికి బయల్దేరాడు. మేనేజరుగార్ని చూస్తే తన తండ్రి గుర్తొచ్చాడు.

రామయ్యగారికీ సీతమ్మగారికీ పెళ్ళయి పదేళ్ళయినా, పిల్లా జెల్లా లేరు. సీతమ్మగారికన్నా పిల్లల్లేరనే బాధ రామయ్యగారి కెక్కువగా వుండేది. పిల్లల్ని ఎత్తుకుని లాలించటమంటే చాలా ముచ్చట. పిల్ల లేడుస్తుంటే ఎత్తుకుని ఆడించి వాళ్ళకేమన్నా కొనిపెట్టి ఏడుపు మానిపి మరీ పంపేవాడు. ఎవరన్నా పిల్లల్నెత్తుకుని షికారెడుతూంటే, తనకా అదృష్టం లేదుకదా అని మనస్సులోనే బాధపడి దిగులుపడేవాడు. ముప్పైఎకరాల భూమైతేవుంది కానీ, తన తరవాత తనక్కాసిని నీళ్ళొదిలే దిక్కులేదని బాధపడేవాడు. ఆ బాధే క్రమ క్రమంగా మనోవ్యాధిగా తయారౌతూండే సరికి చుట్టాలూ, స్నేహితులూ అంతా కూడా క్షేత్రాలకి పోయిరమ్మన్నారు. సీతమ్మగారుకూడా క్షేత్రాలు తిరిగొద్దామని మహా పోరు పెట్టింది.

చివరికో మంచిరోజున రామయ్యగారు భార్యతోసహా బయల్దేరారు. వరసాగ్గా ప్రతి క్షేత్రం దర్శించుకుంటూ తిరిగొస్తుండగా, దోవలో వొకసంబరంలో మూడేళ్ళకుఱ్ఱాడొకడు రామయ్యగారి కాళ్ళకు చుట్టుకుని, "నాన్నా నాన్నా!" అనివొహాశే యేడుస్తున్నాడు, రామయ్యగారానందంతో ఆ కుఱ్ఱాణ్ణెత్తుకుని, వాళ్ళ అమ్మా, నాన్నా ఎక్కడన్నా కనిపిస్తారేమో నని కలియదిరిగారు. ఎవ్వరూ కనిపించనేలేదు. ఆ మర్నాడే పిల్లడితోపాటుగా స్వగ్రామం తిరిగి చేరుకున్నారు. దేవుడే తమ జీవితానికి వెలుగునిచ్చాడనుకుని ఆ పిల్లాడికి "ప్రకాశం" అని పేరు పెట్టుకుని ముద్దుగా పెంచుకోటం మొదలెట్టారు. సీతమ్మగారు కూడా పిల్లలులేకపోవటం మూలాన ప్రకాశాన్నే అల్లారు ముద్దుగా పెంచుతోంది. రామయ్యగారు సరేసరి! ఒక్క క్షణంకూడావొదలరు. ఎక్కడికెళ్ళినా చంకలో అబ్బాయి వుండాల్సిందే!

మరో మూడేళ్ళు గడచినై. ప్రకాశాన్ని బళ్ళోవేశారు. చదువుతో ప్రకాశం తెలివితేటలు మరింత పెరుగుతున్నై. ఇదిట్లా వుండగానే సీతమ్మగారికి నెలతప్పింది. ప్రకాశం ఏక్షణాన రామయ్యగారికి దొరిగాడోగానీ, ఆ క్షణంనుంచీ ఇంట్లోను, వొంట్లోనూకూడా ఏవో కొత్త కళాకాంతులు పుట్టుకొచ్చినై. సీతమ్మగారు గర్భవతి కావటంకూడా ప్రకాశం దొరికిన వేళావిశేషమేనని ఆయన నమ్మకం. అందుకనే ప్రకాశాన్ని మరింత ముద్దుగా చూసుకుంటున్నారు.

ఆ తరవాత సీతమ్మగారికి వరసగా యిద్దరు కొడుకులు పుట్టారు. వాళ్ళపేర్లు. చంద్రం, జగన్నాధం. సీతమ్మగారు పిల్లలు పుట్టికూడా ప్రకాశాన్ని విడిగాచూళ్ళేదు. ముగ్గుర్నీ సమానంగానే పెంచేది. రామయ్యగారు మాత్రం ప్రకాశాన్నే ఎక్కువగా చూసుకునేవారు. ప్రకాశం ప్రతిక్లాసూ తప్పకుండా నెగ్గుతూనే వొచ్చేవాడు. చంద్రం, ప్రతిక్లాసూ కనీసం ఒక్కసారన్నా తప్పకుండా వుండేవాడు కాడు. జగన్నాధాని కసలు చదువంటేనే మంట. చదువులేకపోతే మానె. పొలంపనులంటే యిష్టమా అంటే? అదీ లేదు. చిన్నప్పట్నుంచీ రౌడీ మూకలలో తిరిగేవాడు. రామయ్యగారికి జగన్నాథం, తనపేరూ, తమ వంశంపేరూ ఎక్కడ చెడగొట్టాడోనని భయంగా వుండేది. అందుకే సాధ్యమైనంతవరకూ అదుపులోపెట్టడానికి ప్రయత్నించేవాడు. జగన్నాధం తండ్రి వున్నంతసేపూ. చెప్పినంతసేపూ తండ్రిమాటల్ని 'వూఁ!' కొట్టేవాడు. తండ్రటు తిరగటంతో మళ్ళీ యధాప్రకారం తన రౌడీస్నేహితులూ, తనూ తయారు. ప్రకాశంకూడా తమ్ముణ్ణప్పుడప్పుడూ మందలించేవాడు. ఎదురు తిరిగితే, రెండు తగల్నిచ్చేవాడుకూడాను. ప్రకాశం స్వతః వీళ్ళిద్దరికన్నా బలంగా

వుండటంచేత ఏంచెయ్యాలేక మెదలకుండా వూరుకునేవారు. ప్రకాశం స్కూలుఫైనలు ప్యాసు కావటంతో రామయ్యగారు పట్నంలో పై చదువులకని ప్రవేశపెట్టారు.

ప్రకాశం పట్నం వెళ్ళటంతో జగన్నాధానికి కావాల్సినంత వీలు చిక్కింది. చంద్రం స్కూలుఫైనలు ప్యాసవటం తనకీ జన్మలో చేతకానిపనని నిశ్చయించుకుని ఫోర్తుఫారంతో చేరకుండానే మానేశాడు. రామయ్యగారిందు కెక్కువగా బాధపళ్ళేదు గానీ, జగన్నాధం పరిస్థితికే ఆందోళన పడేవారు. అప్పటికాయనకు నలభై అయిదేళ్ళు. వారం వారం పట్నంవెళ్ళి ప్రకాశాన్ని చూసి సౌకర్యాలన్నీ చూసొచ్చేవారు.

శలవలకి వచ్చినప్పుడు ప్రకాశం తండ్రితో పాటు పొలం పనులన్నీ చూసేవాడు. రామయ్యగారికూడా కొడుకుని వెంటబెట్టుకుని ఎక్కడికన్నా పోవటమంటే ముచ్చటగా వుండేది. చంద్రానికిదేం పట్టేది కాదు. ఎప్పుడూ ఏవో పార్టీలూ, రాజకీయాలూను. జగన్నాధం, సరేసరిగదా! పాలేరు నాగన్నకూడా ప్రకాశం అంటే మంటగానే వుండేది. ప్రకాశం లేకపోతే అడపాదడపా ఏమన్నా చాటుగా దాటేశేవాడు. రామయ్యగారిది చూసీ చూడనట్టూరుకునేవారు. ప్రకాశం మాత్రం వూరుకునే వాడుకాదు.

రామయ్యగారావూళ్ళో కఱ్ఱ తిప్పడంలో అఖండులు. ఎంతో మంది నేర్చుకునేందు కాయనదగ్గిర కొచ్చేవారు. ప్రకాశం శలవల కొచ్చినప్పు డెవ్వరికీ తెలియకుండా రామయ్యగారు వెంటబెట్టుకుని వూరు చివరున్న కొబ్బరి తోటకు తీసికెళ్ళి గరిడీ నేర్పేవారు. పట్నంలో నాలుగేళ్ళు చదివి బి. ఏ. ఫస్టుగా ప్యాసయి యింటి కొచ్చాడు. రామయ్యగారెంతో సంతోషించారు.

ఇంటికొచ్చిన దగ్గర్నుంచీ తమ్ముళ్ళ ప్రవర్తన గమనిస్తూనే వున్నాడు. చంద్రం, జగన్నాధాలిద్దరూ ఎదురు తిరిగి ప్రవర్తించటం పసికట్టాడు. ఓరోజు విద్దర్నీ కూచో పెట్టేవేవో చెబుతున్నాడు ప్రకాశం. జగన్నాధం వున్నట్టుండి—

"తేరగా వస్తేసరి; ఎన్నన్నా చెప్పొచ్చు" అన్నాడు.

"ఎవరికిరా తేరగా వొచ్చింది?" అనడిగాడు ప్రకాశం.

"నీకే! ఏదో సంబరంలో దొరికావుట. దిక్కూ మొక్కూ లేనివాడివని పెంచి పెద్దజేశారు. అందుకని నువ్వే యీ యింటి పెద్దకొడుకు వనుకుంటున్నావల్లె వుంది. నాన్నంటే ఎంతో ప్రేమున్నట్లు కనబడితే ఆస్తిలో నీకూడా వాటా వొస్తుందిగదా అని నీ ఎత్తు. ఎవరికి తెలయదనుకుంటున్నావు?" అన్నాడు జగన్నాధం.

ప్రకాశానికీ సంగతి తెలియక పోవటం మూలాన నిశ్చేష్టుడైపోయాడు.

చంద్రం తమ్ముణ్ణిచూసి, ఎవరు చెప్పార్రా నీకిది?" అనడిగాడు ఎంతో ఆశ్చర్యంతో.

"ఎవరేమిటి? మనకి తప్ప అందరికీ తెలుసీ సంగతి. మనకీ సంగతి తెలిసి పోయిందే అని పాపం విచారిస్తున్నాడల్లె వుంది!" అని హేళనగా అన్నాడు జగన్నాధం.

"అయితే యిప్పుడే అమ్మని కనుక్కొస్తా నాగు" అని "అమ్మా! అమ్మా!" అని పిలుస్తూ లోపలికి పోబో తున్నాడు. సరిగ్గా అదే సమయానికి రామయ్యగారు లోపలికొస్తూ "ఏమిట్రా అది చంద్రం?" అనడిగారు.

"ఏమిటా? నీకుతెలియదూ? ప్రకాశం మాకు అన్నయ్య కాడటగా? నిజంచెప్పండి అవునాకాదా?" అనడిగాడు చంద్రం. ఇది వినీ వింటంతోనే ఆశ్చర్యపోయి రామయ్యగారు "ఇప్పుడీ విషయమెందుకు; యింతకీ నీకీ సంగతెవరు చెప్పార్రా చంద్రం?" అనడిగాడు.

"నేనే! నాకెట్టా తెలిసిందనుకుంటున్నావా? ఇటువంటి విషయాలు దాద్దామనుకున్నా దాగవు; ఎవర్నడిగినా చెబుతారు. మీరు దిక్కులేనివాణ్ణి తెచ్చిపెంచారని!" అన్నాడు జగన్నాధం.

ఆమాటలు పూర్తయ్యీ అవ్వకముందే "వెధవా! ఏమన్నావ్! ప్రకాశం దిక్కులేనివాడా? యీ సారీ మాటన్నావంటే నిన్నేంచేస్తానో చూడు!" అన్నాడు.

"ఆఁ! ఏంఅంటే! వున్నమాటంటే వులుకెక్కువట! దిక్కులేకపోతే పోవచ్చుగానీ అంటే తప్పొచ్చిందా? ముమ్మాటికీ ప్రకాశం దిక్కులేని వెధవే!" అన్నాడు ధీమాగా జగన్నాధం. రామయ్యగారు కోపంతో వూగిపోతూ "ఒరేయ్! జగ్గాయ్, చచ్చావురా యివాళ!" అంటూ చేతికఱ్ఱ పైకెత్తి విసిరేశారు.

ఇదంతా చూస్తున్న ప్రకాశం ఒక్కసారిగా 'నాన్నా!' అంటూ జగన్నాధాని కడ్డంగా వొచ్చాడు. వెంటనే కఱ్ఱ తలకొట్టుకుని తల చిట్లి రక్తంకారుతూ పడిపోయాడు. రామయ్యగారు పెద్దగా ఏడుస్తూ "ప్రకాశం! ఎంతపని చేశావురా నాయనా!" అంటూ ప్రకాశాన్ని కావిలించుకున్నారు. ఇంతలో మంచి నీళ్ళకెళ్ళిన సీతమ్మగారు

మంచినీళ్ళ బిందెత్తుకునివొచ్చి, యీ దృశ్యమంతా చూసి బిందెను దింపి ప్రకాశాన్ని వొళ్ళో పడుకో బెట్టుకుని విసురుతోంది. చంద్రం తనకేం సంబంధించనట్టు వెళ్ళి పోయాడు.

"ఇదో ఎత్తు! అక్కడికేదో పెద్దదెబ్బ తగిల్నట్టు మంచిశాస్తి జరిగింది!" అని యింకా ఏదో అనబో తున్నాడు జగన్నాధం. "ఒరేయ్! జగన్నాధం! ముందు నాకళ్ళక్కనిపించకుండా యీ యింట్లోంచి బైటికి ఫో!" అన్నారు రామయ్యగారు.

"నేనెందుకూ పోవటం? దిక్కూ మొక్కూ లేనివాళ్ళే పోవాలిగాని. నాకేం ఖర్మం! ఎవరెళ్తారో చూద్దువుగాని. మర్యాదగా బైటికి పోతావా సరేసరి! లేకపోతే అప్పుడే చూపిస్తా మన తడాఖా!" అంటూ జగన్నాధం వీధిలోకి పోయాడు.

రామయ్యగారికక్కలిగిన వేదన అంతాయింతా కాదు. రెండు రోజుల్తరవాతగానీ ప్రకాశం లేవలేక పోయాడు. ఆ రెండు రోజులూ రామయ్యగారు పచ్చి మంచి నీళ్ళ యినా గొంతులో పోసుకోలేదు. దెబ్బ నెమ్మదించింతర వాతోరోజున ప్రకాశం తన బట్టలు రెండుమూడు జతలు తీసి సూట్ కేసులో సర్దటం మొదలెట్టాడు. సీతమ్మగారది చూసి రామయ్యగారితో చెప్పింది. గబగబా వొచ్చారది విని. "ప్రకాశం! ఏమిటిది?" అన్నారాదుర్దాగా.

"బట్టలు సర్దుకుంటున్నాను నాన్నా!" అన్నాడు ప్రకాశం తలొంచుకుని, రామయ్యగారి కళ్ళల్లో నీళ్ళుతిరిగినై.

"అయితే! జగన్నాధం మాటలకి పట్టించుకుని మమ్మల్ని వొదిలిపోతావా!" అన్నారు దీనంగా.

"నాన్నా!" అని ఏడుస్తూ రామయ్యగార్ని కావలించు కున్నాడు. రామయ్యగారు కూడా ఏడుస్తూ ప్రకాశాన్ని దగ్గిరకి తీసుకున్నారు.

"నువ్వు దొరికింతరవాతే మా యిల్లు కళకళ్లాడింది. వాళ్ళిద్దరి పద్ధతీ నీకు తెలియందికాదు. నువ్వే మాకీ ముసలితనంలో ఆధారమనుకున్నాం. నువ్వే పోతానంటే మాగతేమౌతుంది!" అన్నారు రామయ్యగారు కన్నీళ్ళు తుడుచుకుంటూ.

"కాదులే నాన్నా! నా చదువుకూడా పూర్తైందిగదా! ఏదన్నా వుద్యోగం చూసుకుంటాను. ఎన్ని జన్మలెత్తినా మీఋణం తీర్చుకోగలనా? అమ్మా, నువ్వూ సంతోషంగా పంపిస్తే వెళ్ళొస్తాను. కాదనకండి" అన్నాడు ప్రకాశం.

రామయ్యగారు నిరాశా, నిస్పృహల్తో తలొంచుకుని వూరుకున్నారు. అందరితోనూ చెప్పి ప్రకాశం అనాడే పట్నం చేరాడు. అక్కడే ఏదో కంపెనీలో గుమస్తాగా చేరాడు.

తరువాతప్పుడప్పుడూ రామయ్యగారు పట్నం వొచ్చి చూసి పోయేవారు. తరవాత కొన్నాళ్ళకి పట్నంలోనే పెళ్ళి చేశారు. చంద్రానిక్కూడా పెళ్ళైంది. జగన్నాధం నడత చూసి ఎవ్వరూ పిల్లనిస్తామని రాలేదు.

అటువంటి, అంతలాటి ప్రేమగల నాన్నకి వొంట్లో బాగాలేదనేప్పటికి కెంతోబాధగావుంది. ప్రకాశం. ఇంటికి చేరుకుని, లోపలి కడుగుపెడుతూనే 'సరోజా! సరోజా!' అని ఆదుర్దాగా పిలిచాడు. వంటప్రయత్నం మీదున్న సరోజ గబగబా వొచ్చింది. "సంగతంతా చెప్పి. మధ్యాహ్నం ఖాళీటైములో కాఫీకని హోటలుకి పోతూండగా మా వూళ్ళో మాయింటి పక్కనే వున్న రామచంద్రయ్యగారు కనిపించి చెప్పారు. సుమారొక నెల రోజుల్నుంచీ లేవటం లేదుట. వైద్యం చేయించటం లేదుట. మరీ మూణ్రోజుల్నుంచీ స్పృహేలేదుట. మా స్నేహితుడు మూర్తిని తీసుకొస్తాను. డాక్టరుంటే ఎందుకైనామంచిది. నువ్వు తయారుగా వుండు"అని గబగబా మూర్తికోసం వెళ్ళాడు.

ఆ రాత్రే డాక్టరు మూర్తి, ప్రకాశం, అతగాడిభార్యా రైలెక్కారు. తెల్లారేప్పటి కావూరు చేరుకున్నారు. సరాసరి యింటికే బయల్దేరారు. దోవలో రామచంద్రయ్యగారు కనిపించి రామయ్యగారికి స్పృహలేకుండానే దస్తావేజులు రాయించుకున్నారనీ, రామయ్యగారిని బయటి పాకలో పెట్టారనీ, సీతమ్మగారి అతీగతీ చూసేవాళ్ళే లేరనీ చెప్పారు. చూట్టానికెవరన్నా వెళ్ళి "ప్రకాశానికీసంగతి రాశారా?" అనంటే చంద్రం, అతని పెళ్ళాం 'రాశాం! అయినా ఎందుకొస్తాడూ మనపిచ్చేగాని! చిన్నప్పట్నుంచీ పెంచి, పెద్దజేశాడు. జరంగా వుందంటే కనీసం చూట్టానికన్నా రాకపోయాడు. అనంటున్నారనికూడా చెప్పారు.

ఇంటికెళుతూ వెళ్తూ ఎందుకైనా మంచిదని రెండు గుర్రబ్బళ్ళుకూడా కట్టించుకెళ్ళారు. ఇంటిముందు సీతమ్మగారు వూడుస్తోంది. చిక్కి శల్యమైపోయింది. అవిడ్ణి చూట్టంతోనే ప్రకాశానికి దుఃఖం ఆగలేదు. 'అమ్మా!' అంటూ పరుగెత్తాడు. సీతమ్మగారుకూడా చేతులోవున్న చీపురొదిలేసి యిటు తిరిగి 'ప్రకాశం!' అంటూ చేతులు చాచింది. ప్రకాశం ఆ చేతులలో వాలిపోయాడు. ప్రకా

శాన్ని చూట్టంతోనే ఆనందం దుఃఖం కలిగి నోట మాట రాక ఏడుస్తోంది. సరోజా, మూర్తీకూడావచ్చారు. సరోజ కూడా అత్తగార్ని కావలించుకుని ఏడుస్తోంది. మూర్తి వోదార్చి రామయ్యగారి దగ్గరికి తీసికెళ్ళాడు.

రామయ్యగార్ని చూట్టంతోనే ప్రకాశం చంటిపిల్లాడి కన్నా యిదిగా యేడవటం, మొదలెట్టాడు. మూర్తి మందలించి రామయ్యగార్ని పరీక్షచేసి, సీతమ్మగార్ని వ్యాధి వివరాలడిగాడు. చేతి సంచిలోంచి మందులూ అవీ తీసి రెండుఇంజక్షన్లిచ్చాడు. ఇచ్చిప్రకాశంవేపుతిరిగి 'ప్రకాశం! పరిస్థితేంబాగాలేదు. పట్నం తీసికెళ్దాం! రోడ్డుదాకా గుఱ్ఱబ్బండిలో తీసికెళ్ళి అక్కణ్ణుంచీ ఏదన్నా చిన్నకారులో తీసికెళ్ళచ్చు' అన్నాడు.

ఇంతలో చంద్రం లోపల్నుంచొస్తూ వీళ్ళందరినీచూసి గతుక్కుమన్నాడు. "ఓహో! ప్రకాశమా! ఎప్పుడ్రావటం" అంటూ కుశల ప్రశ్నలు వేశాడు.

'నాన్నకి వొంట్లో బాగుళ్ళేదని కనీసం వుత్తరం ముక్కైనా రాయలేదేం చంద్రం!' అనడిగాడు ప్రకాశం.

'ఏం? చిన్నప్పట్నుంచీ తిన్నది చాలకనా? ఇప్పుడొచ్చావుగా! ముసలాయన పోయేంతవరకూ వుండి, ఆపది రోజులూ చక్కగా తినిపోవచ్చుగదా అని గామన్లు వొచ్చావ్! అవేం సాగవ్ ఇప్పుడీఆస్థంతామాది అన్నాడు చంద్రం.

'నేనందుకోసం రాలేదు చంద్రం! నాన్నని, అమ్మని పట్నం తీసికెళ్దామనొచ్చాను' అన్నాడు ప్రకాశం.

'ముసలాయన నింకో రెండు మూడు రోజులకన్నా ఎక్కువ బతకడు. ఇక్కణ్ణుంచీ తీసికెళ్తావని ఆయాస పెడ్తే అక్కడికెళ్ళేలోపలే గుటుక్కుమంటాడు. అయినా సరే తీసికెళ్తానంటే_తీసుకెళ్ళు. అమ్మంటావా_నీయిష్టం, ఆవిడిష్టం ఇక్కడుండొద్దని నేనటంలేదు. అయినా జగన్నాధాన్నికూడ రానీ, ఏమంటాడో వాడు!' అని జగన్నాధం వొచ్చేంతవరకూ వుంచుదామనుకున్నాడు.

"కామలే చంద్రం! నాన్నని తొందరగా తీసికెళ్ళాలి. అమ్మకూడావొస్తుంది. జగన్నాధంతో చెప్పివెళ్దామని" అని మూర్తి, తను, సాయంపట్టి రామయ్యగార్ని జాగ్రత్తగా బండిలో పడుకోబెట్టారు. సీతమ్మగారు కూడా ఆ బండిలోనే ఎక్కింది. సరోజా, మూర్తి రెండోబండిలో ఎక్కారు. రామయ్యగారి నిలువెత్తు చేతికఱ్ఱకూడా రామయ్యగారి బండిలోనే పెట్టారు. ప్రకాశం మొదట బండీ వెనకాలే నడవటం, మొదలెట్టాడు. బళ్ళు నడవసాగినై.

సందు మలుపు తిరగటంతోనే, చంద్రం గబగబా పాలేరు నాగన్నని పిలిచి. 'ఎటాగైనాసరే! ముసలాళ్ళని తీసికెళ్ళకుండా చెయ్యమను. ముసలాడే కొంపతీసి బతికితే పాతవీలునామా మార్చేస్తాడని చెప్పు ఎందుకైనా మంచిది. నువ్వుగూడాపో. నలుగురైదుగురు రౌడీల్ని గూడా తీసుకుపొండి. డబ్బుపారేద్దాం. తొందరగా పో! ఊం!" అనిచెప్పి, పంపించాడు. నాగన్న గబగబా వెళ్ళిపోయాడు. జగన్నాధం కోసం!

బళ్ళు రోడ్డు చేరుకుంటున్నై, నాగన్నముఠా, నాగన్న సైకిళ్ళమీద కఱ్ఱలోసహా గబగబా వొచ్చి, బళ్లదాటిపోయి సైకిళ్ళుదిగి, కఱ్ఱలుపుచ్చుకున్నారు ప్రకాశం యిది చూసి రామయ్యగారి బండీలోంచీ గరిడీ కఱ్ఱ తీసి చేత్తో పుచ్చుకున్నాడు. ఆడవాళ్ళు కంగారు పడుతున్నారేమౌతుందోనని ప్రకాశం బళ్ళముందు నడవటం మొదలెట్టాడు కళ్ళలో కోపం, పట్టుదలా వ్యక్తమౌతున్నై

జగన్నాధం బండిదగ్గరికి రావటంతోనే బండీ వెనక్కి తిప్పమన్నాడు ఘట్టిగా.

'ముందుకెళ్ళే బళ్ళు వెనక్కుతిరగ"వని సమాధానం చెప్పాడు ప్రకాశం నిశ్చలంగా. 'తిరక్కపోతే తిప్పుతాం అన్నాడు జగన్నాధం.

"మీరు, యింత మందున్నాంగదా" అనే ధీమాతో పున్నారలే వుంది. ఇంతమందిగాదింకా యింతమందొచ్చినా సరే! బళ్ళ కడ్డంరాకండి! ఇవాళ దేముడొచ్చి వీల్లేదన్నా సరే ప్రయాణం సాగితీరుతుంది" అన్నాడు ప్రకాశం.

అయినా అవేం లెక్క చెయ్యకుండా జగన్నాధం కఱ్ఱ పట్టుకొని ముందు కొస్తున్నాడు

"ఒరేయ్! జగన్నాధం! ఆరోజు నాన్న కఱ్ఱ విసిరేసినప్పుడు నేనడ్డంవొచ్చా! ఇవాళ నేనే కఱ్ఱవిసుర్తున్నా! నీ కడ్డం ఎవ్వవ్వూరారు! మర్యాదగా చెబుతున్నా వెనక్కు తిరుగు. అనవసరంగా కొట్లాటకి రాకు. నిన్ను అవసరమైతే చంపైనాసరే బళ్ళనిముందుకు తీసికెళ్తాను" అన్నాడు ప్రకాశం. ప్రకాశం మీదికి జగన్నాధం దురుసుగా కఱ్ఱ విలిరాడు, ప్రకాశం అడ్డుకుని జగన్నాధాన్ని కొడదామని కఱ్ఱ పైకెత్తాడు. నాగన్న అడ్డం వొచ్చాడు. నాగన్న లావుగా చిన్నసైజు ఏనుగులా వుంటాడు. కోపంతో వుగ్రుడై పోయిన ప్రకాశం బలం అంతా వుపయోగించి నాగన్నతలమీద కొట్టాడు నాగన్నతల ఫెళ్లున పగిలి, 'అమ్మా!' అంటూ మూలుగుతూ పడిపోయాడు. ప్రకాశం

నిజంగా అంత బలవంతుడనుకోని జగన్నాధం ప్రభృతులు కాళ్ళకు బుద్ధిచెప్పారు. బళ్ళు రోడ్డెక్కినై. మూర్తి ఆనందంతో ప్రకాశాన్ని పొగిడి, కావలించుకున్నాడు

ఇంతలో ఏదో చిన్నకారొస్తుంటే దాంట్లో పట్నంచేరుకున్నారు రామయ్యగారి పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైంది ఆరాత్రి గడిస్తే ఫరవాలేదన్నాడు డాక్టరు మూర్తి. ఆరాత్రల్లా ఎవ్వరూ నిద్రేపోలేదు. గంట గంటకీ యింజక్షన్లు నాలుగయ్యేటప్పటికి మూర్తి పరీక్షచేసి, యిహ ఫరవాలేదన్నాడు. ప్రకాశం ఆనందంతో సీతమ్మగారివద్దిగిర కెళ్ళి 'అమ్మా! నాన్న బతుకుతాట్టే అమ్మా!" అంటూ తల్లని కౌగలించు కున్నాడు అంతా సంతోషించి కొంచెం కళ్ళు మూశారు ప్రకాశం అట్లాగే కూర్చున్నాడు తెల్లారుతోంది ఇంతలో తలుపుచప్పుడైంది ప్రకాశం తలుపు తెరిచాడు ఎదురుగా పోలీసులు ఎస్, ఐ, ! ప్రకాశం ఎవరండీ?" అనడిగాడు 'నేనే' నన్నాడు ప్రకాశం "నాగన్నని కొట్టినందుకు మిమ్మల్ని అరెస్టు చేస్తున్నా" నన్నాడు ఎస్. ఐ. ప్రకాశం చప్పుడు చెయ్యకుండా తన విధిని తాను నిర్వహించాననే ఆనందంతో పోలీసులతో నడిచాడు.

---

# జాతికి వ్యాఘాత మీసినిమా ప్రదర్శనలు

(వినోబా)

ఇండోరులో నేనొకఅనుభవఘట్టాన్ని చేరుకున్నాను. ఇది నాకొక నూతన కావ్యక్షేత్రానికి కవాటాలు తెరచింది. ఇలా జరుగకపోతే అజ్ఞానంలోను, మరీ అంధకారంలోను ఉండిఉండే వాణ్ణి. ఇక్కడ ప్రతిచోట నీచమైన సినిమాపోష్టర్లను కళ్ళ చూచాను. ఈ పోష్టర్లు పిల్లలకు (Free and compulsory education in sensuclity) విషయవ్యసనం ప్రబోధించే నిర్బంధ ఉచితవిద్యకు సాధనాలుగా కనబడ్డాయి. ఇందులో వేరే ఉద్దేశ్యమే లేదు. పిల్లలతో మనం పెద్దపెద్దఅక్షరాలను చదివిస్తూఉంటారు. "గ" అంటే "గాడిద" అని; అక్కడే చిత్రంకూడ ఉంటుంది. పుస్తకాలలో ఎంత పెద్దఅక్షరాలుంటాయో అంతకంటె పెద్దఅక్షరాలు ఈపోష్టర్లమీద ఉంటాయి. ఇలా బహిరంగములో నిర్బంధమైన ఉచిత ప్రాథమిక విద్యను పిల్లలకు గరవుతూన్నప్పుడు, బాలల అక్షర బ్రహ్మవిద్యలో ప్రథమంగా ప్రకాశించే వేళ ఇలాంటి సన్నివేశం సమకూర్చి పెడుతున్నామంటే హృదయం చెప్పర్థాని వ్యధాభరంతో నిలువునా కుంగిపోతుంది. ఇలాంటి అపచారం జరిగేచోట ప్రాణత్యాగమైన చేయవచ్చనే పరితాపం నా హృదయంలో పరవళ్ళు త్రొక్కినట్లయింది.

ఇలాంటప్పుడు బేసిక్ విద్యకు అర్థమే లేదాయెను. ఇది చూస్తూ మన ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా ఉందంటే ఎంతో ఆశ్చర్యమవుతూంది. ఎంత అయోమయ పరిపాలన, ఎంత అజ్ఞాన పారవశ్యము. ఇలాంటి ప్రభుత్వపుటునికి మాత్రమే సంఘానికి ఘోరభయంకరము. ఇలాంటివి ఉండినంత వరకు నైతిక వాతావరణం పలుచనై దేశం తిరిగి బానిసత్వంలో పడిపోయే ప్రమాదముంది.

ఇంతటి దారిద్ర్యమున్నచోట, విద్యావ్యవస్థ లేనిచోట వైద్యవసతులు కలుగనిచోట, శాస్త్రజ్ఞానం స్వల్పమైనకడ, పౌష్టికఆహారం ప్రాప్తించనిచో పిల్లల కీవిద్య వంటబట్టితే తుదకీసంఘం నిర్వీర్యమై పోతుంది. అప్పుడు హింసావిధానంలా యుద్ధం చేయజాలము, అహింసావిధానంలో అంతకూ చేయజాలము. అందుచేత నా హృదయంలో ఆరాటం బయలుదేరింది. దీనితో నాకొక నూతనమైన కార్యక్షేత్రం కానవచ్చింది.

హనుమనా (సి.పి.)

---

తన దురంతచింతనైనా లక్ష్యపెట్టకుండా పరుడి అవసరానికి ఎవడు తోడ్పడటానికి ఉత్సాహం చూపుతాడో, వానికి ఈశ్వరుడు సంపదలను ఘనతను చేకూర్చు వరాలను అనుగ్రహిస్తాడు.

(మేరీడాఖ్సన్)

# కూచిపూడి నాట్యమండలి

## శ్రీ రజనీకాంతరావుగారు

(గతసంచిక తరువాయి)

కూచిపూడివారి నాటకాల్లో ఏదరువయినా, అరుదుగా విలంబకాలంలో పాడుతారు. చాలవరకు వారిదరువులన్నీ మధ్యమకాల, ద్రుతకాలాల్లోనే ఉంటాయి. మేళత్తూరువారి సంగీతనాటకాల్లో దరువులు విలంబకాలంలోగాని, మధ్యమకాలంలోగాని ఉంటాయి. ధ్రువకాలదరువులు అసలంతగా ఉండవు. ఈ ఉభయులు సామాన్యంగా విలంబకాల దరువులను త్రిపుటతాళంతో పాడుతారు. క్షేత్రయ (కీర్తనలు) పదములను ఆతాళం చక్కగా అతికినట్లు ఉంటుంది.

ఆదితాళదరువులు పట్నం సుబ్రహ్మణ్యఅయ్యరు కృతులకు పదాలకు అనుకూలంగా ఉంటాయి. ఇందులో ఒక సాహిత్యంనుండి మరొకసాహిత్యాన్ని శాస్త్రరీత్యా పాడటానికి త్ర్యక్షరకాలవ్యవధి ఉండాలి.

భామాకలాపంలోని కొన్నిదరువులు-"మిశ్రాలు"—లేక "సాహిత్యం"తో కూడి రెండింతల రాగతాళాలతో (లయలతో) ఒప్పుతూ వుంటుంది. కొన్నిసమయాల్లో సాహిత్య మొకసారి వచ్చినదే, మరల నొక్కినొక్కి చెప్పవలసివస్తుంది. దాన్ని త్రిస్రనడకనుండి — ఖండము, మిశ్రము, చతురస్రము— ఈరీతిగా ఆరోహణక్రమంలో పాడుతూ, యథాక్రమంగా అవరోహణాన్ని అందుకుంటుంది. ఈ సంగీతగతులన్నీ శరీరాంగములలోని ప్రతిభాగముయొక్క కదలికచేత విశదమయి సాహిత్యవిషయాలు నాట్య— అభినయాదులచే ప్రస్ఫుటమవుతూ వస్తుంది. మేళత్తూరి భాగవతుల దరువుల రాగాలన్నీ ఈ నాడుకూడా దక్షిణాన సాధారణంగా పాడుతూండే రాగాలను అనుసరించే వుంటాయి. కాని, కూచిపూడివారి దరువులు సరిసంగీతంగా మధ్యయుగంనుంచి వచ్చే రాగాలను అనుసరించి ఉంటాయి. అని కళా ఫిల్లెల సరళ సహితుల అభి ప్రాయము మేళత్తూరివారి దరువులు రాగాలు గమక ప్రయోగాలతో నిండిఉంటాయి. కూచిపూడివారి ఖత్తు అట్టిది కాదు. కూచిపూడివారి సంగీతం నాటకంలోని పాటలకు అతికినట్లుగా— రసోల్బణంతో ఉద్రేకపూరితంగా ఉంటుంది. మేళత్తూరివారి పాటలకు సంగీతం ప్రధానం. కూచిపూడివారి ప్రదర్శనాలు— స్వరజతితో రెండుమృదంగాల వాద్యాలమధ్య ప్రారంభం అవుతుంది. భరతనాట్యాలలో చూచే, వినే "మేళప్రాప్తికి ఇది సమానమయిందని చెప్పవచ్చును. నాట్యశాస్త్రంలో ఇట్టిది "ప్రత్యాహార" మని పేర్కొనబడుతుంది- ప్రత్యాహారం కాగానే, మార్దంగికఝల్లరుల రంగప్రవేశం జరుగుతుంది. అట్టిప్రవేశం "అవతరణ"— అనబడుతుంది. అప్పుడు శ్రుతికి తగినట్లు మద్దెల వాద్యం సజ్జం కావడాన్ని "ఆరంభ—ఆశ్రవణ"—మని అంటారు. అనంతరం "వక్త్రాపాణి"— అనగా, అంబా స్తుతి. లేదా. వినాయకప్రార్థన — ఒక్కొక్కప్పుడు రెండూ— జరిపిస్తారు. తరువాత ఇరుగురు పాత్రధారులు 'మంగళకలశము'— లేదా—పూర్ణకుంభమున అలంకరించబడ్డ మామిడాకులతో రంగముమీదికి వత్తురు. దీనికి "పరిఘట్టన"మని పేరు. వాళ్ళప్పుడు గ్రంథకర్తచే యేదేవతకానాటకం అంకితం చేయబడిందో, ఆదేవతను స్తోత్రం చేస్తూ "శోదయగీతా"న్ని పాడ్తారు. వెంటనే యింద్రపూజానైవేద్యాదులు నిర్వర్తిస్తారు. అంతట దౌవారికుడు లేదా, పారిపార్శ్వకుడు తనదరువును పాడుకుంటూ రంగం మీదికి వస్తాడు. ఈనాటకారంభ క్రమ కార్యాలకి "ఆసారిత" మని పేరు. అపుడు సూత్రధారుడు రంగంపై వచ్చి, తామాడబోవు నాటకంపేరు సూచిస్తూ "కథాప్రారంభం బెట్టిదనిన"— అని మొదలుపెట్టాడు. ఇంతవరకు తెరలోపలనే జరుగుతుంది. ఆతరవాతనే కథానాయక ప్రవేశం. ఈతతంగాల్లో సూత్రధారుడి ప్రవేశం వరకు 'పూర్వరంగం' అనీ, కథానాయకప్రవేశంతో ఆరంభించే నాటకాన్ని 'ఉత్తరరంగ' మని నాట్యశాస్త్రజ్ఞులంటారు.

పూర్వరంగంలోని నాట్యం "అలారిప్పు" లోని నృత్యమువంటిది. దీనికే "జడపట్టు"—అని పేరు. భామయొక్క జడకుచ్చులు మాత్రము ఇవతల ఉండే ప్రేక్షకులకి తెలిసేటట్లు— తెరమీదుగా జడను చూపుతారు. బయట రంగం మీదికి రాకముందు భామ తెరలోనే చాలసేపు పాడుతూ నృత్యంచేస్తూ వుంటుంది. తరువాత తెరమీదినుండి తన ముఖాన్ని మాత్రం సభ్యులకు చూపుతుంది. దానికి "ముఖదర్పణం" అని పేరు. అప్పుడు భామ "రేఖచిత్తు"— "దిద్దియము —"అనే నానావిధాలయిన నృత్యాలు రాగాలనే చేస్తూ కొంతసేపు ఎగురుతూ ఉంటుంది. అప్పుడు తెరపై నుండి నడుమువరకు ప్రేక్షకులకి అగపడేటట్లు పాడుతూ ఇవతలికి రావటానికి కారంభిస్తుంది. దరువు జతిస్వరంలో గానంచేస్తూ ఇవతలికి పూర్తిగా వచ్చి కీర్తన పాడుతుంది.

దరువులక్రింద పాడే యక్షగానపద్ధతే కాకుండా, పద్యగద్యాలుకూడ మధ్యమధ్య పఠిస్తూ. దాని భావాల్ని అభినయాల్లో— అనగా, అడుగులు వేయటంలోను, చేతిసైగలలోను, కంటిగిరుపులలోను, ముఖవికారాలలోను చూపుతూ— భావాల్ని వివరిస్తారు; రసాలు ప్రస్ఫుటం చేస్తారు.

సంస్కృతనృత్తజాతులయిన— మత్తకోకిలం, భుజంగప్రయాతం, పంచచామరం, మందానవాసిని. దేశికవిత్తులకు సంబంధించిన ద్విపదలసంటివానిని సైతం, త్రిశ్ర, ఖండ, చతురస్ర, మిశ్రగతులలో పాడ్తారు.

కూచిపూడి భాగవతులలో చాలమంది ప్రసిద్ధిపొందిరి. 120సం॥రాల క్రిందట పసుమర్తి సీతయ్య అనునతడు కూచిపూడి భాగవతుల్లో అగ్రగణ్యత వహించాడు. అతడు, విద్వాంసుడు, సూత్రధారుడు; విద్యాగురువు. చింతా వెంకటరత్నం, వెంకటరామయ్య ఆతని శిష్యులే. అందులో మొదటి ఆతడు నారదపాత్ర నటించటంలో అఖండుడు. అతడి తమ్ముడు వెంకటరామయ్య నాటకాల్లోని నృత్యాల్లో పేరుగడించినవాడు. వెంకటరామయ్య కాలానికి (అంతకంతకు) నశిస్తూ వస్తున్న వీధినాటకాలను అతడు పునరుద్ధరించాడు. నృత్యనాటకాలకు అతడు సరిక్రొత్త శబ్దాలతో దరువులతో నూతన రూపములు ఇచ్చాడు. అవి ఆకర్షణీయంగాను. ప్రజాసంతుష్టిదాయకంగాను వెలిశాయి. సమకాలికులలో వెంపటి వెంకటనారాయణ, చింతా నరసింహామూర్తి. వేదాంతం లక్ష్మీనారాయణశాస్త్రి ప్రఖ్యాతి వహించిన సత్యభామాపాత్ర నిర్వాహకులు; ఆదర్శ నాట్యాచార్యులుకూడ. పేరుమోసినట్టి. బాల సరస్వతికి ప్రాథమికదశలో భరతనాట్యం నేర్పిన గురువు కీ॥శే॥ వేదాంతం లక్ష్మీనారాయణశాస్త్రి). ప్రొఫెసరు— విస్సా అప్పారావుగారు ఈ కూచిపూడి మేళకర్తలను గూర్చి యిలా చెప్పారు.—"చింతా వెంకటరామయ్య కుమారుడు కృష్ణమూర్తి కూచిపూడి నాటకసంస్థను ఈనాడు తీర్చిదిద్ది, దానికి ఊపిరిపోశాడు. అతను దానికి శాశ్వతత్వం చేకూర్చాల్నని శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు"— అని.

నాట్యాచార్యుడైన చింతాకృష్ణమూర్తి, తనమేనల్లుడు వేదాంతం సత్యనారాయణను—గొల్లభామ,—సత్యభామ ఉష, శశిరేఖ— మొదలగు స్త్రీపాత్రలు ధరించి, నిపుణతతో నటించేటట్లు తరిబీతు చేశాడు. నాయికాపాత్ర ధరించి, సత్యనారాయణ రంగంమీదికి ఎక్కినపుడు "స్త్రీపాత్రలు పురుషులవల్ల నిర్వహించటానికి చేతకాదు. ఆ పాత్రలకు స్త్రీలే తగినవారు"— అనే అభిప్రాయం గల ప్రేక్షకులు— అట్టిఅభిప్రాయాన్ని మార్చుకొని తీర్తారు. మహంకాళి సత్యనారాయణ—హిరణ్యకశిపుడు. బాణాసురుడు మొదలైన రాక్షసపాత్రలు ధరించి నటించటంలో అసమానుడు.

చింతా కృష్ణమూర్తి నాటకమండలి ఇటీవల ఢిల్లీలో రంగంమీదా. దూరదర్శన యంత్రాలద్వారా కూచిపూడి నాటకఖిత్తు ప్రదర్శింపగా, ప్రేక్షకులు ముగ్ధులయి, ఒక ప్రాచీననాటకకళ మరలా పైకి తలయెత్తగల శుభసూచనలు కనిపిస్తున్నవని ప్రశంసించారు.

(ముగిసింది.)

(అనువాదం: "కౌశిక")

---

# "భయం"

## "బాలశ్రీ"

చిన్నతనమందు భయమొంది చేరినాను
అమ్మ యొడిలోన నాదుదుఃఖమ్ము వీడ,
గుండె కరిగించి అమ్మ యీనాటిల లోక
మును విడచి దూరతీరాల మనగ వెడలె.

అమ్మ పోయినరాత్రి నాన్నా! యటంచు
బావురంచును యొడిలోన పడితి నేను,
అమ్మపోయిన బెంగనే నయ్యయొడిని
కోలుపోయితి నాయన కూర్మిలోన

కనుల నీళ్ళన్ని బలికించి, కనులుమూసి
నన్ను వీడెను మానాన్న—ఖిన్నుడైతి.

వేదనాపూర మానసనై, దయార్ద్ర
హృదయుడగు శ్వశురునియొడి. చేర్చినాను.

ప్రకొకు భయమంచు సిరికినై పలవరించి
చిమ్మచీకటి రాత్రి నా స్వీయ నదిమి
గుండె లందున్న భయమును చెండినాను
మృదుల కంఠసమ్మును ఎదను నిల్పి—

కాని, నాకెవరీనాడు కానరారు
కన్నుమూసినదోయి నా కాంత నన్ను
వీడి— ఒంటినై తపియింతు నేడు— ఈభ
యమ్మెవరితోడ వాక్రుత్తు నకట నేను.

★

# కళాపూర్ణోదయములోని నాయికలు

శ్రీ-వే. చంద్రశేఖరయ్య

పదునారవ శతాబ్దిలో ప్రబంధరచనా నిధానమున నూతనమార్గ మవలంబించి ఆంధ్రలోకమునకు తన కావ్యరత్న త్రయమును సమర్పించినవాడు పింగళి సూరనార్యుడు, కథాసంవిధానమందుగాని. కథౌచిత్యము నందుగాని, పాత్రపోషణమునందుగాని, కుంటుపడక సర్వథా ఏకధార కావ్యమును నడిపించిన మేధావి సూరన. ఇతని కావ్యములు, రాఘవపాండవీయము. కళాపూర్ణోదయము. ప్రభావతీ ప్రద్యుమ్నము. రాఘవపాండవీయము రామాయణ భారతార్థములు వచ్చు ద్వ్యర్థికావ్యము. ప్రభావతీప్రద్యుమ్నము శ్రీకృష్ణుని కుమారుఁడైన ప్రద్యుమ్నుడు వజ్రనాభుడను దైత్యరాజును వధించి యాతని కూతురు ప్రభావతిని వివాహముచేసికొను కథగలది. మూడవది కళాపూర్ణోదయము, ఈతని కావ్యములలో మణిపూస. అది యొక కల్పిత కావ్యము. అందు కథానాయిక కలభాషిణి.

శ్రీ కృష్ణపరమాత్ముని కాలమున ద్వారకానగరమున నివసించు ఒకనటముఖ్యుని తనయ కలభాషిణి. వేశ్యకుల సంజాత. శాపవశమున నిట్టిపుట్టు వీమెకుఁ గలిగినది. పూర్వజన్మమున శారదాదేవి చేతిచిలుక వాగ్ఘోషముచే నామె శపించినది. ఆమె మధురాలాపము లావుట్టువున దోషముగా నెంచఁబడిన, ఈజన్మమున నదియే యొక యలంకారమై భాసించినది. ఆమె కలభాషణములను గూర్చి సూరనార్యుడు :—

"కలభాషిణి యనుపేరా
వెలది మునువహించు సహజ విలసత్కల భా
షలకుఁ దగఁ, జాలదిపు డది
కలికితనముఁ జతురతయును గల పలుకులకున్॥"

అని వెల్లడించినాడు, ఆమె నానాటికి పెరిగి యౌవన దర్పోపయుక్తగా, వేశ్యా గాయని, విటాళి హృదయములకు కటారికత్తియ యైనది—

ఆమె విద్యావైశద్యమును గూర్చి

"కీర్తనపాత్ర చిత్రమృదుగీత కళాకలన ప్రవీణతన్
నర్తన నైపుణీ విలసనంబుల పెంపున, నత్యపూర్వ ని
ర్వర్తిత పంచబాణ సమరక్రియలన్ హరిణాక్షి యప్సరః
కీర్తి బలెన్ హరింపఁదొడఁగెన్ విటసంచయ
చిత్తవిత్తముల్"—

ఇందు అప్సరసల కీర్తినిగూడ హరించుట భావికథా బీజము. అట్టి సర్వసౌందర్యమూర్తి, సకలవిద్యాగరిష్ఠ, కలభాషిణి వినయవిధేయతాది గుణములలో నేరికిని తీసిపోదు. తాను చెలికత్తెలతో వనవిహారముచేసి లతాడోలికల నూగి, యొకచో నున్న తరి దేవతామౌని నారదు డాయుపవనమున కేతెంచును. అట్టి మౌనీంద్రుని యెడల నామె పచరించిన మర్యాదలు—తానొక్కతియ యేగి కడుఁజేరువ నాయనుపమతేజుని నారదమునిగాఁగ నెఱింగి వినయమునఁ బ్రణమిల్లెన్"—లేచి విపంచితాంజలియై తా నడుగ దలఁచుకొన్న విషయముల నడిగినది.

విమానములో రంభానలకూబరు లేగుటయు, వారి సంభాషణమును విన్నది. అతడు నలకూబరుడను సందేహము. అతనిపై మరులుగొన్నది. కాని తనకాతడు చేకూరుటెట్లు ?

కావుననే తన వినయాతిరేకమున నారదునిమన్నన బడసి తన సందేహనివృత్తి చేసికొనినది. "ఆ రంభకు సవతిగా దైవనియుక్తి యున్న నీవే కాగూడదా?" యని పించుకొనినది. కాని ఆ దైవనియుక్తిపై సందేహము కలిగి అందరికి అబ్బునా, యని విచారించినది. కాని నారదుడు మాత్ర మీమెనే రంభకు సవతిగాచేయ సంకల్పించినాడు. అందుచే "నామాటకేమిలే" యని అప్పటికి త్రోసిపుచ్చి మిగిలిన విషయములపైకి పోయినాడు.

నారదుని మనసు కెక్కినయెడల నెంతటి కార్యమైనను సాధింపవచ్చునని తలంచినది. అతడు మణికంధర రచితమైన శ్రీ కృష్ణదండకము చదువుమన్నం తనే "మధురగంభీరస్వరంబున" చదివి యాతని వీనులకు విందుగూర్చినది. ఆచనవుచేతనే యాతని శిష్యత్వ మభిలషించినది. నారదుడు తనపథకము నెఱవేరుట కామె సహాయ మెంతయు వాంఛితము. కాబట్టి యంగీకరించినాడు. అపరిచయ సేవా భాగ్యములచేత నీమెయు నారదునియంత గానకళాప్రవీణ యైనది. ఇంకేమి కావలయును—నారదుడు చూచి మెచ్చుచున్నాడు. పునర్దర్శన మెప్పుడో ? కావున తన యభీప్సితము నెఱవేరుటకు కావలసిన ప్రయత్నములు చేసికొనవలయును. చక్కగా యోచించినది. రంభారూపము తన కమరిన నలకూబరునితో గాలక్షేపము కొంతకాలమైనను చేయవచ్చును—దానికి తగినసమయము వచ్చినది.

నారదుడు తన గానవిద్యాప్రావీణ్యమునందు సందేహపడినాడు. సందేహనివృత్తికి, శ్రీ కృష్ణుని యంతః

పురము తన విద్యనుగూర్చి యేమనుకొనుచున్నది తెలిసికొనవలయును, అందు కెవరైనను పోవలయును. మణికంధరుడు తనకు శిష్యుడు. కలభాషిణి తన శిష్య—వీరి యెదుట వారు పొగడువారేగాని లోపముల చెప్పరు. మారురూపులతో పోయిన తెలిసికొనవచ్చును. ఈయూహ నారదునికి, కలభాషిణికిని అనుకూలములైనవి—నారదుని సందేహమును తీర్చుటకు కలభాషిణి నడుముకట్టినది. నారదుడామెకు వరమిచ్చినాడు.

"నాకపేక్షితమైన నాతిరూపు ధరింప
సామర్థ్యమబ్బిన, నామగువల
సఖులరూపము దాల్చి సముచితంబగు వేళ
జని వారిహృదయంబు గనగవచ్చు"

అని కలభాషిణి కోరగా, నారదుడు—

"నిది నెపముగాను నిధీశసుతుని
రంభవై కూడుట రమణికోర్కె
యదియు మదీయకార్యానుకూలము కదా.
అని తన యాత్మనలరి"

వరమిచ్చినాడు, అంతేకాక పోవునపుడు.

"మున్ను నీవాత్మలోఁ గోరినట్టి
కాంతు, రంభామనోహరాకారు డగుచు
మెఱయువానిని గూడి రమించగలవు"

అని వరమిచ్చి వెడలినాడు నారదుడు.

ఇట్లు కలభాషిణి, తన యభీష్టము నెర వేర్చుకొనుటకయి కావలసిన సాధనసంపత్తి యంతయు సమకూర్చుకొనినది. ఇక నలకూబరుని చేరవలసినదే తరువాయి. కాని, అదియెట్లు సాధ్యము? అతడెప్పుడెచ్చట నుండునో? ఉండినను అచటికెట్లు పోవలయునో? కావున నామె తన చిత్తంబు నలకూబరాయత్తం బగుచుండం దత్సమీప గమనంబున కుపాయంబు కానక, బహుకాలంబు గడపి, కాలయాపన దుష్కరంబగుటయు, నొక్కనాడు ఒక్కతెయే వీణగైకొని యుద్యానవనంబున కరిగెను.

నారదుడు వెడలిన యనంతరము శ్రీ కృష్ణదర్శనమునకు గూడ వెడలుటలేదు, అచ్చటికి పోవలసినపనియు లేదు. గ్రహింప వలసిన విద్యయింతయు నీ వరకే గ్రహించినది. ఇక కాలయాపనకు పోదమన్న, తనపై నలసభావ ముదయింపవచ్చునేమో? అందుచే నచటికి వెడలలేదు. ఇక నింట పనిలేదు. మనసులో నలకూబర ధ్యానము తప్ప మఱియొకటిలేదు. అధ్యానమును మరలించుట కుద్యానవనమునకు పోయి పాడుకొనుచుండినది.

అచ్చటి కొకసిద్దు డేతెంచెను. అతడే మణిస్తంభుడు? మఱుజన్మమున తనకు మామగారు. వచ్చిన యాతడు కలభాషిణిని పలుకరించి యోగక్షేమములు విచారించినాడు. ఆమె మనస్సునకు తన్నుగూర్చి నమ్మకము కలుగునట్లు చేసికొనినాడు. తనకు దూరదృష్టి దూరశ్రవణములు కలవని నిరూపించినాడు. ఆమె నమ్మినది. రెండు మహత్తర ప్రభావములు గల అతనిచే తన మనోరథము నెఱవేర్చుకొనవచ్చునని తలంచినది

ఈ మణిస్తంభు డసాధ్యుడు. కలభాభాషిణి కోరిక తెలిసికొనినాడు. అంతేకాదు. ఆమెకు నారదుడిచ్చిన వరము దీవనగూడ తెలిసికొన్నాడు. ఆవిజ్ఞతచేతనే యామెను పూర్తిగా మోసగింప గలిగినాడు. అతడు "నీకును మానసమితరప్రచింత మాని తిరముగ నీ నలకూబరునంద యధీనంబై నిలిచియున్నయదియె?" అనియు కాంచనగర్భతనూజుడు గడమ యభీష్టసిద్ధియును గాదగు దీవెన యిచ్చెగావునన్, బడతి యమోఘ మా యనఘు పల్కు చలింపనీకు తాల్మి" అనియు నూరడించినాడు.

నారదు డరిగినపిదప మణికంధరుని వృత్తాంతమంతయు తనదూరదృష్టి దూరశ్రవణములచే నెఱింగినవాడు, గావున నామెకు వివరించినాడు. తుదకు మణికంధరుడొకయాశ్రమమున తపము చేయుచున్నట్లును, ఆ తపము చెఱచుటకు రంభ అందు ప్రవేశించుటవల్ల, ఆమెను ఎడబాయజాలక నలకూబరు డాప్రాంతముననే యొక చూతవృక్షచ్ఛాయ నాశ్రయించి యుండునట్లును తెలిపినాడు.

ఇప్పటికి నలకూబరు డొంటిగా నున్నాడు. ఏ సమయముననో వీడనిరంభ కార్యాంతరమున వెడలినది. సమయమిదే; కాని అతనిని చేరుట యెట్లు? ఎక్కడి ద్వారక? ఎక్కడి మణికంధరు డపోవనము? ఉపాయ మేమి? సిద్ధుడైన మణిస్తంభుడే చెప్పవలెను

ఇక మణిస్తంభుడు, తాను వచ్చినది కలభాషిణి గానమాధుర్యము నాస్వాదించుటకు. ఇన్ని సంగతులైనవెనుక గానస్రవంతిలో నాతని నోలలార్చినది. అతడు ప్రయాణము కట్టినాడు, కాని ఆమె దీనయై తన మనోభీష్టము నెఱవేఱుటకు మార్గము కోరినది. మణిస్తంభుని గూడ ఆమె తనతో బయలు దేరుటయే కావలసినది. కాని ఎన్ని యడ్డంకులు చెప్పవచ్చునో చెప్పిచూచినాడు. కలభాషిణి అన్నిటి కన్ని ప్రత్యుత్తరము లిచ్చి యెట్లయినను తన్ను గొంపోగోరినది. లోన నిష్టముతోడ పైకి ననిష్టముతోడ

ఒప్పుకొనినాడు. అతని సింగపుతేజీ నెక్కిరి. అది నేటి మన "జెట్ ప్లేను" వేగముతో దక్షిణదిశకై వెడలునది.

దారిలో రంభాసఖులెదురైరి. విచారింపగా మణికంధరు డెక్కడికేగునో తెలియదు. కాని మా రంభ మాత్రము తన ప్రియుడగు నలకూబరునితో విహరించుచున్న"దని నుడివిరి. ఆ మాట వినినదే కలభాషిణికి మనసు కలత బడినది. నలకూబరునిమీది యాశచే నింతదూరము కష్టములకోర్చి రాగా ఇక్కడ ఈమాటలు వినబడుచున్నవే. మనగతి యిక నెట్లోయని విచారము అలమికొనినది. మణిస్తంభు డామెకలత నెఱిగి యూరడించినాడు. నీ కార్యమన్ని విధముల సానుకూలమగునని ధైర్యము చెప్పినాడు. ఇంతలో సింగము ముందుకరుగుటకు వెనుదీసినది. అచ్చట మృగేంద్రవాహ నిలయము కలదు. అచ్చటికి కలభాషిణిని కొనిపోవుటయే మణిస్తంభుని యుద్దేశము. అక్కడనే దిగవలసి వచ్చినది. మృగేంద్రవాహనకు పూజలుచేసి పిదప పయనము సాగింతమని నచ్చబలికినాడు, కలభాషిణి సమ్మతించినది.

ఆతడామె నచ్చట వదలి పూలుపండ్లు తెత్తునని వెడలి, నాడు. అతడటు పోగానే యొకయవ్వ కలభాషిణిని. సమీపించినది. ఆమెపేరు సుముఖాసత్తి. కలభాషిణికి మఱుజన్మమున నత్తగారు. ఈమణిస్తంభునికి భార్య. కాని ఆ దంపతులకు గారణాంతరములచే తాము భార్యాభర్తలమని తెలియదు.

ఆ ముసలిది చేరియు చేరకమున్నే కలభాషిణిని చూచి "లతాంగీ! ఎచటినుండి చేరితివకటా! కలుషపు బాపురఁబిల్లిని జిలుకయుఁబలె నిద్దురాత్ము సిద్ధుండనుచుఁ"— అని విచారించినది. కాని యీమాటలు కలభాషిణిని ఎక్కువ కలతపెట్టలేదు. ఏలన, ఇదివఱకే సిద్ధుడు "ఓచెలువ! చింతిలగావల దిప్పుడెంతయుఁ బుద్ధిఁ దిరంబుగాఁగ ధృతిఁ బూను మొకించుక సేపులోననే శుద్ధముగాఁగ నీమనము శోకము సర్వముఁ బుచ్చివైచెదఁ, సిద్ధము నామబల్కు" అని వ్యంగ్యముగా పలికియున్నాడు. దాని నూహించి,

"ఇంక నొక్కింత సేపున కెల్లవగపు
బుచ్చివైచెదనని పల్కె నిచ్చటికిని
జేరుచపు, దని యీయమ్మ చెప్పినట్లు
శక్తికిడియెడు ననుట నిస్సంశయంబు"

అని మనస్సులో నిశ్చయపరచుకొన్నది. ఆపై తనగత చరిత్రను, ఔన్నత్యమును తలంచి, తన నికృష్టపు మరణమున కింతవగచినది.

(సశేషము)

# చండిక

అయ్యగారి నరసింహమూర్తి

1. సూరయ్యాను బ్రాహ్మణుడు
చండిక యను దానితోడ
కాపురము చేయుచుండె
కల్యాణపురము నందు.

2. శ్రమముచేసి సూరయ్య
సరకులను తెచ్చుచుండ
వాసిలోన కొన్నిటిని
చాటుగాను చండికయు
అమ్మివేసి ఆమీద

3. ఏరోజున కారోజు
ఇంటిలో నిదిలేదది లేదంచు
మగనిమీద మాత్రము

4. మండిపడును ననుదినము.
సహాన మెంత చూపుచున్న
చండికలో మార్పులేక
సూరయ్యొక రోజున
పెండ్లామును పిలిపించి

5. సరకులమ్మ వద్దనినాు
శౌర్యముతో నటు చెప్ప
తోకత్రొక్కిన త్రాచువలె
చండికయు మండిపడుచు

6. ఒట్టుపెట్టె నీవిధముగ
"నాలో నపరాధమున్న
ఆరునెలలు తిరుగకుండ
నాపసుపు కుంకుమయే

7. నట్టేట్లో కలసిపోవు.
మీలోనే లోపమున్న
మూడునెలలు తిరుగకుండ
నాయుసురే మీకు కొట్టి

8. నాశనమై పోయెదరు"

# జడభరతుఁడు

ఉభయభాషాప్రవీణ, ఉత్పల. వేంకటరంగాచార్యులు

క॥ తనతోఁ గూడి కర్మరాశికి
ననుచరమై బహువికారమై మనము వడిన్
జను నింద్రియముల తెరువులు
తనువులు పెక్కైనఁ జెడవు తనకర్మంబుల్॥

ఋషభుఁడను రాజేంద్రుండు ధర్మము తప్పక యిలా పాలనం బొనరించువాఁడు. జయంతి యితని రాణి. పతి కనుకూలవతియై ఛాయవలె నతని ననుసరించునది. వీరికుపురకు విద్యావతులును గుణవంతులును ధర్మాత్ములు నగు భరతుఁడు, కుశావర్తుఁడు, ఇలావర్తుఁడు, బ్రహ్మావర్తుఁడు, ఆర్యావర్తుఁడు, మలయకేతువు, భద్రసేనుఁడు, విదర్భుఁడు ననునొమ్మండ్రుగురు పుత్రులుదయించిరి. అందు ధర్మానుసరణముగ భరతుఁడు పృథివీపతి యయ్యె. అతఁడును దన రాజ్యమును సోదరులకు సమముగఁ బంచియిచ్చె. వారును దమ దేశంబుల న్యాయంబు తప్పక ప్రజలానందింప ధరాపాలనంబు కావించిరి. అక్కారణంబున నాయాదేశంబులు వారి వారి పేరిటఁ బిలువఁబడుచున్నవి. వారిలో భరతునిచేఁ బరిపాలింపఁబడిన యీ యిలావర్షంబు భారతవర్షంబని ఖ్యాతివహించినది.

భరతుఁడు విశ్వరూపుని పుత్రికయగు పంచజని యను కన్యామణిని బరిణయమాడె. ఆమెయందుఁ గ్రమముగ సుమతి, రాష్ట్రభుక్, సుదర్శన, ఆచరణ, ధూమకేతువులను నేవురపుత్రులఁ బడసె. మఱియు నతఁడు తన తండ్రులవలె విష్ణుభక్తియుక్తుఁడై భూసురులు వొగడఁ గర్మల నాచరించుచు భూపాలనం బొనర్చుచు, సర్వము విష్ణుమయమని యెంచి, బహుయాగములచేతను, దర్శపూర్ణిమలచేతను జాతుర్మాస్యములచేతను, బహుసోమములచేతను, నగ్నిహోత్రములచేతను యజ్ఞకర్తయు యజ్ఞభోక్తయునగు శ్రీమన్నారాయణుని బూజించి కృష్ణార్పణంబుగ సకల విమల కర్మంబుల నాచరించుచు, సకల మంత్రంబులును శ్రీమన్నారాయణుని యవయంబులుగ నెంచి జపించుచు, వసుంధరా పరిపాలనం బొనర్చుచుండె. ఇవ్విధంబున భక్తజన హృదయారవింద సంవాసుండగు వాసుదేవు ననుదినంబు నర్చించుచుఁ బది లక్షలవేల యేండ్లు రాజ్యంబు పరిరక్షణచేసి, పైతృకంబగు రాజ్యంబును సుతులకు యథారీతిఁ బంచిపెట్టి, సకల భోగ సంపత్సంభరితమగు సంసారమును ద్యజించి పులహాశ్రమంబునకుఁ దపం బొనరింప నేగె.

ఎచ్చట నివసించు జనులకుఁ బ్రత్యక్షమై పుండరీకాక్షుఁడు నిత్యము సన్నిహితుఁడైయుండునో, ఎందు సాలగ్రామములు గల్గిన గండకీనది ప్రవహించుచున్నదో, యట్టి పులహాశ్రమంబున భరతుఁడు నానావిధ పుష్పపల్లవములచేతను, నతుల తులసీ దళంబులచేతను, జలంబులచేతను, గుందమూలాది ఫలంబులచేతను, దామరసంబులచేతను సర్వోపగతుండగు విష్ణువు నర్చించి, తనవిసనక యారాధనలు సల్పుచుండె. దానంజేసి విగత విషయాభిలాషుండునయి శమదమాదిగుణంబులు గలిగి, పరమపురుషభక్తి పరిచర్యా సముచిత సంతుష్టహృదయుఁడై యానందామృతమును గ్రోలుచు, నేణాజిన త్రిషవణ స్నానంబుల నార్ద్రకపిశవర్ణ జటాకలాపంబు గలిగి, కర్మ ఫలంబులను గలిగించుచు నఖిలలోకములను సృజించి యా లోకముల నంతర్యామియై చొచ్చి యంతట నానందరూపమగు బ్రహ్మమును గోరుచున్న జీవుని యోగశక్తిచేఁ బాలించుచు మార్తాండమండల మధ్యవర్తియగు నారాయణుని శరణు వేడుచునుండె.

అంత నొక్కనాఁడా భరతుఁడు ఆ మహానదిని స్నానమాడఁ జని యంతర్జలంబుల ముహూర్తమాత్రము నయనముల నిమీలించి ప్రణవోచ్చారణంబు చేయుచుండ నా సమయంబునఁ బూర్ణగర్భిణియగు నొక హరిణి పిపాసితయై యొంటిగవచ్చి యాతరంగిణిం జలంబులం గ్రోలుచుండ నొక కంఠీరవంబు బెట్టిదంబుగ నారావంబుగావింప, భీతస్వభావ యగు నాకురంగము కడిందిబెగ్గడిలి సింహదర్శనంబుచే వ్యాకులచిత్తయై భయంబుచే నానది నుల్లంఘించునెడ, గర్భంబుజాఱి నదీనీరంబులంబడె. ఆ జింకయు నికట గిరితటంబునం బడి చేతనంబులుడిగె, అంత నాభరతుఁడు కన్నులువిచ్చి చూచి కరుణాతరంగిత హృదయుఁడై ప్రవాహంబునం గొట్టుకొనిపోవు మృతజనని యగు నాహరిణపోతంబును దన యాశ్రమంబునకుం గొంపోయి ప్రేమభరంబుమీఱ నద్దానిఁ బోషించుచుండె. ఇట్లు తత్పోషణ పాలన ప్రీణన లాలన ధ్యానంబులచే భరతుని యాత్మనియమంబులైన యష్టాంగయోగములును, బుండరీకాక్షుని పూజాసపర్యలును గ్రమముగ నుత్సన్నంబులయ్యె.

అట్లు యోగంబు భ్రంశంబగుట యెఱుంగక యాహరిణపోతమును జూచి "తల్లి మరణింప నెవ్వరును దిక్కులేని యీ కురంగమును దెచ్చితిని. ఇదియు నాయందు

మిక్కిలి మక్కువగలిగి వర్తిల్లుచున్నయది. నేను దీనిఁ బ్రీతితో రక్షించెద. శరణాగతరక్షణము నెల్లధర్మముల నుత్తమమని మహర్షులు పలుకుదురుగదా'' యని తలఁచి, శయనాసన సమిత్కుశాద్యాహరణ దేవాపూజాసమయంబులఁ దన సమీపంబున నుంచుకొనుచు, క్రూరమృగాది భీతిచే దాని వెన్నంటి తిరుగుచు, నతిస్నేహంబున స్కంధంబుల వహించుచు, నుత్సంగంబున నునిచికొనుచు లాలించుచు సంతసించుచునుండు. మఱియు నిత్యనైమిత్తికాది కర్మానుష్ఠానంబులు సలుపునెడ నడుమ నంతంతన లేచి హరిణశాబకంబుం జూచుచు శాంతచిత్తుఁడై దాని నాశీర్వదించుచుఁ జుంబనాదులచేఁ బ్రీతినందుచు మోహంబు నందియుండె.

ఆ యేణశిశువును పరువులువాఱుచుఁ గుప్పించుచుఁ గొమ్ములఁజిమ్ముచు దగ్గఱుచుఁ గాళ్లఁగీఱుచు నారాజు తొడపైఁ బవ్వళించుచు లేచి భుజముల నెక్కుచు లీలతోఁ గ్రీడించుచుండు, అది కొంతతడవు కానుపింపకున్న 'నాహా! ఏ మృగములు హింసించెనో' యని పలుతెఱంగులఁ జింతనొందుచుఁ బలవరించుచు నది కనుల కగుపడినంతన మిక్కిలి మోదమునందుచు నీహరిణపోతము నా పుత్రవియోగతాపమును బాపెఁగదా! యని పలుతెఱంగుల హరిణనిమిత్తంబులయిన మనోరథములచేఁ బూర్వజన్మకర్మవశమున నాభరతుఁడు యోగభ్రష్టుండయ్యె. మోక్షనిరోధకంబని పుత్రాదిబంధంబు నెడఁబాసి యాశ్రమంబు గ్రహించిన యా భరతునకు నీతగులంబొక్కటి బంధంబయ్యె. ఆహా! యెట్టివానికైనం గాలంబు గడువరామి తెల్లంబగడా! విధి అలంఘనీయము. పరమ మునులకైనను గర్మంబులు తొలఁగవు.

భరతుఁ డంత్యకాలము సమీపింపఁ బుత్రునిపగిది నత్యాసక్తిఁ బ్రేమించు నా కృష్ణసారమును దనయాత్మఁ దలంచుచుఁ దనుపును ద్యజించె. భ్రమర కీట న్యాయము వాలి నాతఁడు హరిణీగర్భంబున జననమందె. భరతుఁ డిట్లు మృగీగర్భంబున జనించి ప్రాక్తన భగవదారాధన మహిమచే మృగత్వకారణంబు దెలిసికొని మిక్కిలి వగం బొగులుచు.

ఉ॥ ''రాజులు ప్రస్తుతింప సురరాజ
సమానుఁడనై తనూజులన్
రాజులఁజేసి తాపసుల
రాజఋషీంద్రుఁడటంచుఁ బల్కఁగా
జేజమనొంది యాహరిణదేహము
నందలి ప్రీతిఁజేసి నా
యోజ సెడంగ నేఁ జెడితి
యోగిజనంబులలోన చేలనై॥''

ఇట్లు శ్రీహరిశ్రవణ మనన సంకీర్తనారాధనానుసరణాభియోగములఁ గాలంబుపుచ్చు నాకు హరిణపోతస్మరణమున యోగవిఘ్నంబు గలిగె; మోక్షదూరుఁడనయితినని చింతించుచుఁ దల్లింబాసి భగవత్క్షేత్రంబగు నాపులస్త్యపులహాశ్రమంబునకుఁ జని మృగదేహత్యాగావసానంబు గోరుచు శుష్కపర్ణజలాదుల నాహారంబుగాఁ గొనుచు మృగత్వ నిమిత్తంబగు నా నదీతీరంబునం దవసానంబు గోరుచు నందవగాహనంబు చేయుచు మృగశరీరమునుం దొఱంగె.

భరతుఁడు హరిణదేహంబు వదలి శమదమ తపస్స్వాధ్యాయనిరతుండును, నీతి కోవిదుండును, గుణ గరిష్ఠుడును శుద్ధుండును, బవిత్రుండు నయిన యంగిరసుఁడను బ్రాహ్మణునకుఁ బుత్రుఁడై జన్మించె. అట్లు జన్మించి కర్మబంధ మోక్షణంబు గావించు నా శ్రీమన్నారాయణుని విఘ్నభయంబున మనంబునందు నిలిపి సంస్తుతి యొనర్చుచుండె.

అంగిరసుఁడు జ్యేష్ఠపత్నియందుఁ దొమ్మండ్రుగురు పుత్రులను, గనిష్ఠయందు స్త్రీ పురుషుల నిరువురం గనె. అందుఁ బురుషుఁడు పరమభాగవతుండును, రాజర్షి ప్రవరుండును, నుత్సృష్ట మృగశరీరుండునగు భరతుఁడయ్యె. అతఁడు అన్యజనసంగంబు జన్మపరంపరలకుఁ గారణంబని భీతింజెంది, శ్రీహరి కటాక్షమునఁ దొలి జన్మంబుల సంస్మరించుచుఁ దన స్వరూపంబున్మత్తజడాంధబధిర రూపంబుల లోకులకుం జూపుచునుండె, అత్తఱి నంగిరసుఁడు పుత్రునిఁ బ్రేమతోఁ బెంచుచుఁ జౌలాది కర్మంబులఁ గులోచితంబుగ యథాక్రమముగ నాచరించి శౌచాచారముల బోధించె. గాయత్రీమంత్రోపదేశంబుచేసి వేదాధ్యయనంబు సేయించె. తనయుని విశిష్టాచారునిగఁ జేయనెంచి యెంత శిక్షించినను, సద్బుద్ధి బొడవకుండుటకుఁ జింతిల్లి నిర్బంధంబున నాచరింపఁజేయుచుఁ జింతచే నాయంగిరసుఁడు గృహస్థాశ్రమమునందు మరణించె. తల్లియుఁ దండ్రి ననుసరించి యగ్నిప్రవేశంబొనర్చె. అంత సవతి తల్లి కొడుకులు దుర్వినీతులై యాభరతుని వేదవిద్యలఁ జదువనీయక గృహ కార్యనిర్వహణమున నియోగించిరి. ఇట్లు కర్మప్రవృత్తుఁడగు నతఁడు మూఢులగు జనులచే నున్మత్త జడ బధిర నామంబులచే నాహూయమానుండగుచుఁ దదనురూపముగ సంభాషణాదుల నొనర్చుచుఁ బరేచ్ఛాయదృచ్ఛలచే విష్టివేతన యాచ్ఞాదుల జేయుచు

కర్మంబులఁ బ్రవర్తించుచు, మృష్టాన్నమైనను గదన్నమైనను నేదిపెట్టిన నది జిహ్వాకింపుగ భుజించుచు భేదంబు పాటింపకయుండె.

మఱియు నానిత్యం బాత్మానంద సుఖంబుగలిగి సుఖదుఃఖములయందు దేహాభిమానంబు గొనక శీతోష్ణ వాత వర్షాతపములకు నోడి వస్త్రాదుల ధరింపక వృషభంబువలెఁ బీనుండును గతినాంగుడు నగుచు స్థండిలశాయియై రజోదూషితమగు దివ్యమాణిక్యమువలెను, నివుఱుగవిసిన నిప్పువలెనునవ్యక్తబ్రహ్మవర్చస్కుండై మషీవిష్టయజ్ఞోపవీతుఁడగుటంజేసి బ్రాహ్మణాభాసుండు మందుండునని పిలువఁబడుచుఁ గర్మమూలమునఁ బరులవలన నాహారంబు గొనుచునుండె. అది గని తమవారు వ్యవసాయ కర్మయందతని నియోగించిరి. అందును సమ విషమ న్యూనాధికంబుల నెఱుఁగక ప్రవర్తించుచు నూక తవుడు తెలికపిండి పొట్టు మాడు మున్నగాఁగల ద్రవ్యములను నమృతముంబోలె భక్షించుచుఁ జేకి కావలి యుండె.

ఆ పట్టణాధిపతియగు వృషలుఁడు సంతానార్థియై కాళికాదేవి నారాధించి నరపశువు బలినొసంగఁ దలచి మనుజుని గొనితేర భటుల కాజ్ఞాపించె. సేవకులు నంతటను వెదకి యెందును దగిన వాడు లభింపక యారాత్రిఁ జేనిఁ గాచుచున్న యావిప్రయోగిని గని పట్టుకొని పోయిరి. కొంపోయి యా బ్రాహ్మణున కభ్యంజనాది సంస్కారములు చేయించి నూతన వస్త్రంబు గట్టనిచ్చి గంధ పుష్పాద్యలంకృతునిఁజేసి మృష్టాన్నంబు భుజియింప నిడి ధూపదీపనైవేద్యాదులు సమర్పించి బహువిధ వాద్య ఘోషంబులు చెలంగ నా పురుషపశువుం గొంపోయి కాళికాదేవి సమ్ముఖంబునఁ గూర్చుండఁబెట్టి యాతనిరక్తంబుచే దేవిని సంతృప్తి చేయఁదలఁచి యానరపతి యతికరాళంబును మంత్రాభి మంత్రితంబునగు ఖడ్గంబుగ్రహించి యావిప్రుని ఖండింపనుంకించె.

అప్పుడా, ధరామరుండు కొంచెమయినను భయమును బొందక దిగులుచెందక తన్నుఁజంపఁదలఁచిన వారియందును విష్ణుభావముంచి నిశ్చలుఁడై యుండె. అట్టితఱి సర్వభూతహితుండును సకల సమవర్తనుండును బ్రహ్మభూతుండునగు నాబ్రహ్మపుత్రుని తేజంబు నాలోకింప దుస్సహమై ప్రజ్వరిల్ల నా కాళి గజగజ వణకుచు గ్రోధమ్ముచే హుంకరించి, వికృతముగ నట్టహాసము గావించి, పాపులును గ్రూరులును రాజసతామస కర్ములయిన పాఱుని హింసింపఁదలఁచిన యావృషలనరపతిని నతని భృత్యులను కసికుసంగి హతము గావించె.

క॥ ధరలోన నెవ్వరేనిని
ధరణీసురవరుల కెగ్గు దగఁదలఁచిన వా
రరయఁగఁ జెడుదురునిక్కము
హరి ధరణీసురవరేణ్యులందుండుట చేఁ॥

పిమ్మట నాభూసురుఁడు చండికాలయము వెలువడి కావలియుండుటకై మఱల నా క్షేత్రమునకుఁ బోయె,

ఇట్లుకొన్ని సంవత్సరంబు నడువ నొక్కనాఁడుసింధు దేశాధిపతియగు రహూగణుఁడిక్షుమతీ తీరంబున, వసించుచున్న కపిలమునిం గాంచి తత్త్వజ్ఞాన మెఱుంగఁగోరి పల్లకిలోఁ బోవుచుండె. ఆ మార్గమధ్యమునఁ జేనికిఁగాపున్న వుడమువేల్పుంగాంచి వాహకు లితనిచే శిబిక మోయింతమని పోయి పల్లకీ కొమ్మును మూఁపునఁబెట్టి మోయించిరి. ఆ విప్రుఁడుగూడ నెట్టి విచారమును లేక యప్రయత్నమున నడచె. అట్టి నడకచే శిబిక యెగుడు దిగుడై యంతరమున నున్న రాజునకు బాధగలిగించె. ఆరాజీ విషమ గమనమునకుఁ గారణమేమని వారి నడిగి నాలవవాని దోషమని యెఱిఁగి యతని బహుభంగుల నిష్ఠురములాడె. ఆ భూసురుఁడును మారువలుకక పల్యంకిక మోయుచుండె. తనకుఁ గడపటి దేహంబగు నీ శరీరమం దహంకార మమకారంబులు పొందక విద్యాజ్ఞానరహితుండై బ్రహ్మభూతుఁడై మౌనమున శిబిక మోయుచుండ, నా విషమగమనంబునకు నతికుపితుఁడై రహూగణుండు ఓరిదురాత్మా! నా యాజ్ఞను దిరస్కరించుచున్నాఁడవు. నీ వక్ర మార్గంబులన్నియుఁ దొలఁగించి నిర్వక్రముగ నడిపింతునని గర్వాంధుఁడై గుణత్రయంబునఁ బెంపొంది యసంబద్ధముగఁ బ్రలాపించుచుండె. అది చూచి శమదమాది సంపన్నుఁడును బ్రహ్మస్వరూపుఁడును సకలభూతహితుఁడునగు నాధరామరుండు యోగివర్తనఁబెఱుఁగని యా భూమిపాలుని బరికించి మెల్లగ నిట్లనె.

ఓ నరేంద్రా! నీవు చెప్పునది సత్యము. భారం బీ శరీరంబునకెగాని నాకు గలుగదు. అయినను స్థౌల్య కార్శ్యంబులు నా ధివ్యాధులు క్షుత్తృష్ణలు నిచ్ఛావిరోధంబులు జరామరణంబులు క్రోధలోభంబులు ఖేదమోదంబులు నిద్రాజాగరణములు నహంకార మమకారంబులు మద మాత్సర్యంబులు దేహములోఁ గలుగునవి గాని నాకు గలుగనేరవు, స్వామి భృత్య సంబంధములు విధికృతంబులగుచు వ్యవహారంబునంజేసి శరీరంబులకుఁ గలుగుంగాని జీవునికి లేవు, రాజాభిమానంబున నీవు నన్నాజ్ఞాపించెదేని, ప్రమత్తుఁడవైన నీకుఁ బూర్వ

స్వభావంబట్టిద యగును, గాన నేనేమి చేయుదును. ఉన్మత్త మూకజడాంధ బధిరులం బోలె సహజ స్వభావమునుం బొందియున్న నాయందు నీశిక్ష యేమిలాభంబు పొందింప నేర్చు? అదియునుంగాక స్తబ్ధుకుని మత్తుండు నయిన నాకు నీశిక్ష వ్యర్థంబగును' అని పలికి పూర్వ కర్మశేషం బునం గలుగు భారవాహకత్వమును దొలగింపుకొనుట కయి శిబిక మోయుచుఁ బోవుచుండె.

అంతఁగొంత తడవునకుఁ దత్త్వజ్ఞానాపేక్షచేఁ బోవుచున్న యారాజు ఆత్మహృదయ సంశయ విభేదకంబులును బహు గ్రంథ సమ్మతంబులు నగు నావిప్రుని వాక్యంబులు విలక్షణంబుగ దోప శిబిక డిగ్గనుఱికి యా బ్రాహ్మణునకు సాష్టాంగదండ ప్రణామంబులాచరించి గర్వము సర్వమును ద్యజించి చేతులుజోడించి యిట్లనె. ఓ మహాత్మా! బ్రాహ్మణులలో నెవ్వఁడవు? సన్యాసివై యేల యిట్లు సంచరించుచున్నాఁడవు? అటనేల యొంటి నున్నాఁడవు? నన్ను నుగ్రహింపవచ్చిన సాక్షాత్తు ఆ కపిల మహామునివో, నీ మహిమ నెఱుగఁజాలక నొప్పించితిని. నాతప్పు సైరింపుము. బ్రాహ్మణునకు భయపడినట్లు కాలదండమునకును, పశుపతి శూలంబునకును, వజ్రాయుధంబునకును, జంద్ర సూర్యాగ్ని కుబేరాదుల శస్త్రాస్త్రములకును భీతినందను. విజ్ఞానంబుగలిగియు నిస్సంగుఁడవయి జడునివోలె నున్నాఁడవు. నీ వచనంబులు యోగశాస్త్ర సమ్మతంబులయి యున్నయవి. నేను విష్ణ్వంశ సంభూతుఁడగు కపిలముని వలన బ్రహ్మవిద్య నెరుగ నరుగుచున్నవాఁడను. నీవా కపిలమహర్షివి కానోపుదువు. మందుఁడగు గృహస్థుఁడు యోగీశ్వర చరిత్రంబు నెట్లెఱుంగఁ గలఁడు? కర్మవశంబున నాశ్రమంబుల నాచరించు నాకు నెట్లో, నీకు నట్లేయగును. అదెట్లనిన, ఘటంబులేక, జలంబుగొని తేరని విధంబున, లేనిది గలుగనేరదు. కావునఁ బ్రమాణమూలకంబగు లోక వ్యవహారంబు సత్పథంబున సమ్మతంబయియుండు, గాన నీ మాటలు సర్వసమ్మతములుగావు. అని రాజు పలికె.

అది విని యాంగిరసుఁడు 'శరీరభేదంబులచేతను బుద్ధి తన్మాత్రలచేతను జీవుఁ డింద్రియవశుఁడై బహుజన్మంబుల గ్రహించుటయును. ద్వంద్వాదులు సంభవించుటయును, బరమేశ్వరుని జేరువిధంబును దన పూర్వజన్మవృత్తంబులును, దాను మనుష్య సంసర్గంబు విడిచి యేకాకియై చరించుటయును మాయాబలముచే గలుగు వివిధ కర్మంబులును విపులముగ నారాజునకుఁ దెలిపె.

అంతట నారాజు మానుషజన్మంబులు పెక్కు తెఱంగు లగునని యెఱింగి:

ధరణీసురవర నీ శ్రీ
చరణాంబుజ యుగళ రేణు సంస్పర్శము నా
దురితంబులడఁచె నంతట
హరిభక్తియు నంతకంత కధికంబయ్యెన్॥

విశేషించి విప్రవరులయందు యోగీశ్వరులవధూత వేషంబునఁ జరియించుచుందురు. కావున విప్రులు పిన్నపెద్దలనక యందఱును నమస్కారయోగ్యులు. అని మ్రొక్కి యతని యనుమతిఁ గొనిచనె.

భూసురుఁడును నాక్షితిపాలునకుఁ దత్త్వజ్ఞానం బుపదేశించి యతనిచే నమస్కరింపఁబడి పూర్ణార్ణవంబుంబోలె సంపూర్ణ కరుణారసపూరిత స్వాంతుడగుచు వసుంధరం జరియించుచుండె.

భరతుఁడు తొలిజన్మమున దారాసుతరాజ్యాదులను విడిచి భగవత్పరుండై యజ్ఞరూపుండును ధర్మస్వరూపుండునునయి సాంఖ్యయోగంబును మనస్కరించుచు మృగ రూపంబును బాసి యుత్తమ జన్మమంది నిరీహుఁడయ్యె. అట్టి భరతుని చరిత్రం బెవ్వరు చెప్పినను జదివినను విని నను నట్టి వారలను బుండరీకాక్షుండు రక్షించును; ఆయుర్వృద్ధియగును. మఱియు వారు ధనధాన్య సమృద్ధి గలిగి స్వర్గాప భోగంబులం బొందుదురు. ★

---

(4-వ పేజీ తరువాయి)

వారితో పనిచేయటంవల్ల ప్రమోద ఎంతో అనుభవజ్ఞానాన్ని సంపాయించుకుంది. కళాభ్యాసం చేయాలనే యువకులు, ఉత్సాహవంతులు పారిస్‌లోని ప్రఖ్యాత చిత్రకారులతో పరిచయం ఏర్పరుచుకునేవారు. ప్రమోదకి అటువంటి అవకాశం చిక్కటమేకాదు, వారి దీవెనలు ప్రోత్సాహము లభించాయి.

విదేశం వెళ్లినప్పుడు చిత్రకళని ఒకవృత్తిగా స్వీకరించాలనే భావంలేదు ఈమెలో. స్వదేశం తిరిగివచ్చాక కొంతకాలం రసాయనిశాస్త్రం ఉపాధ్యాయురాలుగా, పరిశోధకురాలుగా పనిచేసింది. కానీ ఆమెలోని కళాహృదయం. సృజనాత్మకశక్తి దేనికోసమో ఉవ్విళ్లూరుతూనే వుండేవి. మనదేశంలోని పల్లెలు ప్రకృతిసౌందర్యం తిలకిస్తూంటే ఆమెచేతివేళ్లు కుంచెకోసరం వెతికాయి. భారతీయజీవితం, సంస్కృతి వర్ణించే అనేకచిత్రాలని గీసింది ఆమె.

దేశంలోని వివిధకళాప్రియులు ఆ చిత్రాలని అమోఘమని మెచ్చుకున్నారు. ప్రమోద యిక కళాతపస్సులకే

తనజీవితాన్ని ధారపోయ నిశ్చయించింది. 1942 వ సం॥లో కలకత్తాలో ఒక సొంతస్టూడియో నెలకొల్పింది. 1948 వ సం॥లో ఢిల్లీలో స్టూడియో ప్రారంభించింది.

1948 వ సం॥లో ఈమె తిరిగి పారిస్ వెళ్లటం సంభవించింది. ప్రఖ్యాతశిల్పులు ఆమెని శిల్పకళ నేర్చుకోమని ప్రోత్సహించారు.

1951 వ సం॥లో ప్రమోద ఓమూటు ఒరిస్సా వెళ్లింది. రాతిశిల్పకళని భారతీయపద్ధతిలో నేర్చుకోవాలనే వాంఛ గాఢంగా నాటుకుపోయింది మనసులో. అక్కడ ఆలయంలో పనిచేస్తున్న ఒక శిల్పిదగ్గిర శిక్షణ ప్రారంభించింది. (స్త్రీలు సుత్తిని పట్టగలరని నిరూపించిన ప్రథమస్త్రీ ఈమె) మట్టితో చేసే ప్రతిమలకంటే రాతిశిల్పం ఈమెని ఎక్కువ ఆకర్షించింది. శిల్పకళ ఎంతో ఓరిమితో సాధించ వలసిన విద్య అంటుంది ఈమె. ఈ విద్యా సాధనకొరకు రాత్రనక పగలనక పనిచేసింది.

కళాసాధన ఏకైకలక్ష్యంగా గల ప్రమోద పూరిపాకలలో, కటికనేలమీద గడిపింది. మనదేశ సహజ సౌందర్యం ప్రకృతి రామణీయకత తిలకిస్తూ, దేశమంతా పర్యటించింది. ప్రఖ్యాత చిత్రకారులతో, చిత్రకళని గూర్చి భావసంచలనం కలిగించే చర్చలు సాగించింది.

చిత్రకళ ఉగ్గుపాలతో పెట్టినవిద్య ఈమెకి. ఈ కళలో పరిపూర్ణత పొందేందుకు, ఎంతో సాధన, తపస్సు జరిపింది ఈమె. తాను అభ్యసించిన శాస్త్రీయజ్ఞానం సంస్కృతివిద్య ఇందుకు చాలా తోడ్పడింది అంటుంది ప్రమోద.

విద్యారంగంలో అనేక ముఖ్యవుద్యోగాలు నిర్వహించింది ప్రమోద. గత నాలుగుసంవత్సరాలుగా ఢిల్లీ ఆర్కిటెక్చర్ డిపార్టుమెంటులో ఉపాధ్యాయురాలుగా ఉత్సాహవంతులైన యువతీయువకులతో కలసి పని చేయటం ఈమెకెంతో సరదా. మాటలలో చమత్కృతి, మృదుత్వం గల—నిగర్వి అయిన ఈమెని కల్సుకోవటం ఒక మరవురాని అనుభూతి కలిగించింది నాలో.

(సోషియల్ వెల్‌ఫేర్‌నుంచి)

---

# భారతి కొక బహిరంగ లేఖ

## పండిత- సత్కవి- శ్రీనారు నాగనార్య

కం॥ ఎందేగితివో? యని పలు
సందులు గొందులును దిరిగి–సందియపడి, నా
డెందము కొందల మందెను
దొందఱగా(బలుకు; పలుకు( దొయ్యలి! విందున్

౧

ఉ॥ కానని సీమదాటి, కడ
గండ్లకు లోగి, నిరస్త భూమవై
నీనిరవద్య సద్యశము-
నిప్పు చెఱంగినచేట సాటి, ని
ల్పానక, చంచలంబలె న
యోమయమార్గము బట్టి పోయితే?
నేనెటుగొల్తు నీ చరణ
నీరజముల్ మదినిల్పి భారతీ!

౨

ఉ॥ లోకములన్నియున్ క్షణము
లో సృజియించిన వీ(డు భర్త, నీ
వాకు సమస్త సత్కవులు
పారము ముట్టెడిచోటు, వాహ్యమో
దీకొని పాలు నీరు విడ(,
దీసెడి శక్తి(గలట్టియంచ, యుం
కేకరణిన్ గణించిన, మ.
హాష్టవు నిన్నెటు! గాంతు భారతీ!

౩

శా॥ అమ్మా! భారతి! కింకరుండ! భవదీ
యాంఘ్రిద్వయీ సేవనా
ర్థమ్మై జీవిత శేషమున్ గడుప య.
త్నమ్మూనియున్నా(డ, లో

కమ్ముంజూడ స్వదేశభాషపయి రా
గమ్మింత లేదాయె, ద్వే
షమ్ముల్ బ్రెమ్మె నిజమ్మె నమ్ముమిదె నా
సందేహముల్ దీర్పుమా

౪

శా॥ ఎన్నో యేండ్లును బూండ్లు దాటె నిటులే
యీ రాజకీయార్థ సం
పన్నుల్ నిన్నిట లేతఁజేసి సభలన్
బ్రచ్ఛన్న వాదార్భటిన్
బన్నాగమ్ములు వన్ని యాంగ్లమె శర
ణ్యంబంచుఁ దద్భాష లే
కున్నన్ లోకమె గొడ్డువోవునని హా
కోఁజూతురే భారతీ!

౫

మ॥ పరభాషా లవపాండితీవిలసితుల్—
ప్రాచీన భాషాసతీ,
గరముం దక్కువగా గణించుచు, సభా-
గారమ్ములన్ నిల్చి, యు
ద్ధురవాచా విభవోన్నతిం బలుకుచున్
దుర్జ్ఞేయ శక్త్యాదు లా
పరభాషన్ గలవంచుఁ బల్కెదరు, నీ
పట్లన్ విలుప్తాత్ములై॥

౬

గీ॥ అన్నిభాషలకుం- దల్లివైన
పలుకుమా! యేమిలోపమీ-తెలుఁగునందు,
అన్యభాషలలో వ్రాలినట్టిమేలు,
తెలుఁగునందేమి లేమియో- తెలుపుమమ్మ!

౭

గీ॥ కడుపుకూటికి నుద్యోగ, కాంక్షఁచేసి,
భూమిపుత్రులు దెగనమ్మి- పొరుగు వారి,
చదువుఁజదివిరి, యంతతో- వదల రయ్యొ!
తల్లి బాసకెసరుపెట్టఁదలఁచినారు,

౮

గీ॥ తల్లి చనుఁబ్రాలుద్రావియం- తటనుబోక,
అమ్మ! తొమ్మెక్కి క్రుమ్మ నే- రమ్ముఁ గాదె!
యిట్లయిన నెట్లుసూచి సహింతురోరులు,
పాపభీతి యెదంద ర-వంత వలదె!

౯

శా॥ అంతో! యింతో! తెలుంగుతలను వ్రా
యన్నేర్చినన్, వానిక
ల్లంతైనన్ విభవంబు, నార్జనము లే-
దాయెన్గదా! యాంగ్ల మా
వంతైనన్ వచియించుచో, మహితవి
ద్యావంతుఁడంచున్ బదా
తింతల్గౌరవముం బొనర్తురిడి, యెం-
తే సత్యమో, భారతీ!

౧౦

చం॥ నినుభజియించుచోఁ గడుపు.
నిండుగ! గూడొకపూటయేని లే
దనయము నిత్రుపాసములు-
నట్టిటు బిచ్చము లెత్తువ్రాఁత త,
ప్పనిసరి! నాల్గుముక్కలు ప్ర
పంచమురంగిడు నింగిలీసు నే
ర్చిన మఱి వానిఁగొల్తురి కురి
చీపయిఁ గూర్చొనఁబెట్టి భారతీ!

౧౧

॥ ప్రాచ్యకళలయ్యొ వెలలేని- పాడుసుద్ద,
గట్టుఁదేరిన యింగ్లీషు- లడ్డుముద్ద,
యెంతవాఁడేనిఁ గొను నేది? యేది!
విడుచు?
నీ సమస్యను దెలిసి వ- చింపవేల?

౧౨

చం॥ నలుబది యేండ్లనుండి సద
నంబిటు వీడక, నీదు కొల్వులో
పల బలిగొన్న జీవితము
పై నొకయించుక కూర్మిలేని, నీ
వలన ప్రయోజనం బొకల
వం బొనగూడిన, దక్కయుండినన్
నిలుపెటువచ్చు, శాంతికిఁగ—
నీసము మేరలులేవె! భారతీ!

౧౩

శా॥ ఆయంబెల్లను గోలువోయి, తుది మా-
న్యంబుల్ భవత్సేవకై
యేయుల్పావధికో వ్యయించి, పని పా
టే యింతయున్ లేక, నా
యాయుర్దాయమిటుల్ వ్యయించితి, మఱే
యాదాయమా నాస్తి, లే
దాయెన్ స్వీయకుటుంబపోషణము సే
యన్శక్తియున్. భారతీ!

౧౪

ఉ॥ రాతిరియుం బవల్ మఱపు
రానిభవత్పద పద్మసేవలో,
నేతరినై వ్యయించితిగ
ణింపఁగ నేతటిఁ గాసుఁగాని, నా
చేతికివచ్చియే యెఱుఁగఁ,
జేతను వాతను గల్గునంతయు౯,
బ్రాఁతిగ జారిపోయెఁ, దల
వంపుల జీవితమయ్యె ! భారతీ !

౧౫

ఉ॥ గొప్పకయీసడుండని, క
కుప్పులఁ జెప్పుటతప్పు. నింటిలో
నప్పకదెట్లు వచ్చునని
యందొకఁడేని గ్రహించి దానికై
తిప్పలువడ్డఁ గాలమొక
తీరున వానికృపానుభూతిలోఁ
జప్పునఁ గాలమేగునటు
నల్పెడి దాత యెవండు ? భారతీ !

౧౬

శా॥ చట్టాబేరముసేసి కోలువ డుల
క్షల్ లక్షలు౯, "రేసులో"
గుట్టల్ గుట్టలు దారపోయు, మఱియే
కోనేటి సీమాటికో,
కట్టల్ గట్టలు "నోట్లొ" సంగు మఱియే
కర్మమ్మొ కావ్యానికై
గొట్టాడు౯ బయిసా యొసంగుటకు, నీ
కు౯ వింతయే భారతీ !

౧౭

శా॥ ఆరోగ్యం బిసుమంతలేకనిఁక నే
దైన౯ ధనాదాయము౯
గోర౯ బుద్ధిబలంబులేక, చెడె నీ
కోసమ్ము నాజీవితం
బౌరా ! నేఁటికొకండెటింగె నొకా ! యీ
యాంధ్రుల్ భవత్సేవకై,
కారాకూరము లొందువారనియు నిం
క౯ భ్రాంతియా ? భారతీ !

౧౮

శా॥ నీకై కాలము పేటిబుచ్చి తెటులే
నిన్ సేద్యమో ! వైద్యమో,
లేకుద్యోగముచేసియున్నఁ బదిరా
శ్శీపాటికేచేత్తి, యీ
లోకానన్ ధనవంతుఁ డీతఁడని, క
ల్గుంబేరు పెంపద్దియే
యీ కాలమ్మున కెంతసాయమగు నూ
హింపంగదే ! భారతీ !

౧౯

ఉ॥ వ్యాకరణమ్మలంకృతుల
టంచిటు బుట్టచెడెన్ బఠించి, మే
మీకరణిన్ బ్రయోజనమొ
కించుకలేని ధనార్జనాది స
ద్వ్యాకరణీయ లాభమెది
యున్ గమనింపక, కూటిపేదనై
యాఁకలిబాధకున్ నవసి
యల్లల నాడితినమ్మ ! భారతీ !

౨౦

శా॥ నాతోపాటు భవత్పదార్చనకుఁబూ
నన్ బ్రీతిలేనట్టి వి
ఖ్యాతుండొక్కఁడు నుండు చూడుమదిగో?
వ్యాపారముంజేసి చే
సేత౯ పేనకు వేలుకూర్చి "ధనల-
క్ష్మి" సౌధముంగట్టె నా
చేతన్ లేదొక చిల్లిగవ్వ యివి నీ-
చేతల్ గదే భారతీ !

౨౧

చం॥ అనుకొని యేమిలాభ మిఁక
నైనను, రాఁగల కాలమందు నా
తనయులకైన నిట్టి కవి
తాపథమందు జరింపఁబోకుఁ డం
చని మనుమున్న పల్కుట స-
హాయముసేసిన నౌదునేడు. నా
యనుభవ మింత చాలు ! మరి
యాదకు నీల్గిన మేలె? భారతీ !

౨౨

ఉ॥ నీపదసేవఁ జేసిన క
నీసము తిండికొ ! బట్టకో ! మఱే
దో ! పనిపాటుకో ! యరయ
దొడ్డమతంబని యెంతుఁగానిచో
"పాపరుసూటు" కగ్గమయి
బన్నములంబడి బెరితాంత మి
ట్లే, పడి యేడ్చియేడ్చి తుద
కీడిగిలంబడిపోనె ! భారతీ !

౨౩

మ॥ ఒక మధ్యాహ్నపుఁదిండి తీర్థమునకై
యొక్కింతరానట్టి, యీ
సుకవిత్వంబులతోఁ బనేమి? యని మా
శుద్ధాంతకాంతామణుల్
రకవారీగ వచించుటల్ వినియుఁ, జ
ట్రాయైన, మచ్చిత్తమూ
రక విద్యుల్లతికా చలచ్చలనసం
రంభంబగున్ ! భారతీ !

౨౪

శా॥ ఈకైతల్ వలనం బ్రయోజనము లే,
దీనాఁడు మాసీమలో
జేకెత్తించిన యుత్తరాంధ్రమునకో,
రేనాటికో పంపి నా
యాకాంక్షన్ సఫలమ్ముసేయు మిదియే
నాసింతు, నీభర్తతో
నాకై యీ మనవింబొనర్పు, మదియై
నం గష్టమా? భారతీ !

౨౫

మ॥ కలనాఁడెల్ల నినున్ భజించి మివులన్
గావ్యమ్ములన్ వ్రాసి చెం !
తలఁ జేరందగు జట్టుగుంపునకు వి-
ద్యాదానముం జేసి ని
చ్చలు నాజీవితమెల్ల ధన్యమయి స్వే
చ్ఛావృత్తి జీవింప దు
ర్బల మీనాఁటికి దాపురించె నిఁక నీ-
ప్రాపుండునే ! భారతీ !

౨౬

ఉ॥ కొంచెమొ ? గొప్పయో ? కలదు,
కోరి భజించిన తిండి తీర్థమా
సించిన వారికింత యిడి,
జేనెఁడుపొట్టల నేపదింటికో
నించిమెలంగ భూవసతి,
నేనట సేద్యము సేయమాని, యీ
కొంచెపుఁ బేరుకోసమయి-
కొంగజపమ్మొనరింతు? భారతీ !

౨౭

శా॥ కాలమ్మెట్టులొ? పోయె, దానికయి పై
క్లబ్యమ్మునం గుందఁగా
నేలా? యింకయినన్ స్వభాషపయి, నెం
తేఁ బ్రీతి నర్పించు వా
రీలాగున్ బనవన్ బనేమి? యిఁక మీ-
రేదారినో పొండటం
చాలోచించి వచింపరాదె, యిటు లే-
లా ! కుయ్యిడన్ - భారతీ !

౨౮

చ॥ అహిమికలేని నాథు దరి
యంజని సత్కవి చంద్రులింత ని
స్పృహమున కగ్గమైరి- యెటు.
లేని కృపం బరిరక్షసేయు మం
చహరహమర్థి వేడుకొను,
మాతఁడనుగ్రహముంచెనేని, యీ
తహతహపాటు నింకయిన-
దాటి శుభంబగునేమొ? భారతీ !

౨౯

చ॥ హిత మహితమ్మొకింత గమ
నింపని పెద్దలు, తూఁగుటూయెలన్
సతముసుఖింప, విజ్ఞులగు-
సత్కవు లార్థికనిస్సహాయులై
మదిచెడి దేవురింప, మతి-
మత్తవు, నీ వెటుచూచి సైచి మా
బ్రతుకు బజారులో విడి స
వాలొనరింప నదేల? భారతీ,

౩౦

కం॥ ఛూ ! ఛూ ! ఛూ ! బసవన్నల
జాడ సిరంబెగురవేయు- స్థానిక సభ్యుల్
గూడ సిరులంద, కవులే
కీడెంచిరి తల్లి ! వారికీలగలింపన్

(సశేషము)

# ANDHRA MAHILA SABHA

## NURSING HOME & NURSES' TRAINING CENTRE

### Statistics for the month of December, 1960.

**OUT-PATIENT REGISTER:—**

| | | |
|---|---|---|
| | No. of Medical cases treated | 702 |
| | „ „ Surgical „ „ | 44 |
| | „ „ Ante-natal „ „ | 289 |
| | „ „ Post-natal „ „ | 65 |
| | „ „ Gyneac „ „ | 102 |
| | „ „ Dental „ „ | 9 |
| | „ „ E.E.N.T. „ „ | 25 |
| Total | „ „ New Patients | 1,236 |
| „ | „ „ Old Patients | 1,664 |
| | Grand Total | 2,900 |

**ADMISSION REGISTER:—**

| | |
|---|---|
| No. of Patients admitted for Normal Deliveries | 133 |
| „ „ „ „ Abnormal Deliveries : | |
| (Forceps 7; M. R of Placenta 1; Extraction of Breeth; 1 | 9 |
| No. of Surgical cases treated | 2 |
| „ „ Medical „ | 50 |
| „ „ Ante-natal C False Pains | 29 |
| „ „ Ante-natal C Toxeamia | 6 |
| „ „ Post-natal „ | 4 |
| „ „ Gyneac cases | 30 |
| „ „ Babies admitted as Lodgers | 152 |
| Grand Total | 415 |

(True Copy)

(Sd.) Dr. K. R. AMBUJA,
*R.M.O.*

(Sd ) Dr. M. PAVANA BAI,
*Medical Superintendent.*

(Sd.) Smt. V.LAKSHMI PARVATHI,
*Secretary.*

# పాపం పిచ్చాడు

**"హామీ"**

ఆరోజు మేమిద్దరం కాలేజీనుంచి తొందరగా వచ్చేశాం. శర్మ నాదగ్గరకు వచ్చి "భాయ్" అలా వెల్దాంపద" అన్నాడు. బద్ధకంగా ఉన్నా బయలుదేరాను. ఇద్దరం డాబాగార్డెన్సువేపు బయలుదేరాం. "ఒరేయ్, మనం ఈ రోజు ప్రేమసమాజంసైడు వెళ్దాం అన్నాడు. శర్మ సరే, "నువ్వెలా తీసుకొనివెళ్తే అలా వస్తా" నన్నాను. ఇద్దరం డాబాగార్డెన్సుపార్కు ఎడం చేతి వైపు ప్రేమసమాజానికి తిన్ననిరోడ్డు, అట్టె దూరంకూడా ఉండదు. మహా ఉంటే, ఓఫర్లాంగుంటుందేమో' ;

ఇద్దరం ఆఅప్పు ఎక్కుతున్నాం. అక్కడ పెద్ద మైదానం ఉంది. మైదానం ఒకవైపు మేం నడుస్తున్న రోడ్డు, ఎదర రోడ్డు సరస్వతీ సినీమానుంచి వచ్చే రోడ్డు ఉన్నాయి, మిగతా రెండువైపులాకూడా యిళ్ళు న్నాయి. మేం పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ గ్రౌండులో క్రికెట్ ఆడుతూంటే చూస్తూ వస్తున్నాం. నాకు క్రికెట్ అంటే చాలాప్రీతి. నేనూ ఒక "ఇంటర్ కాలేజీమేట్" ప్లేయర్నవటంవల్ల మరీప్రీతి. ఇంతలో మాకళ్ళు ఒక యింటివేపు తిరిగేయి. ఆయింటిలోనుంచి "ఒకతను గబ గబా రోడ్డుమీదకి వచ్చి" ఛీ. పాడు ముండ....చచ్చేవు. చాలా మంచిపని చేసేవు... "అని ఓరాతిమీద కూర్చొని అకాశంకేసి చూస్తూ. "నువ్వు ఛచ్చేవు.... నాశని విరగ డైంది....ఇంకా నయం...అమ్మాయినికూడా నీతోకూడా తీసుకొని పారిపోయేవుకాదు" అని గుండె నిమురుకొని యింకా గొణుగుకుంటున్నాడు.

నాకు బలే బాగుంది సీను అనిపించి, "ఒరే. శర్మా కాస్త యిలా కూర్చో" అని విశాఖపట్నం మునిసిపాలిటీ వారు డాబాగార్డెన్సు ఉపయోగార్ధమై బజారు కట్టడానికి గాను కేటాయించి. అశ్రద్ధ వారి అలవాటును బట్టి ఆసంగతి పూర్తిగా మరచినవారై అక్కడ నివసించే అలగా ప్రజల ఉపయోగార్థం అట్టే పెట్టేడంవల్ల, ఆస్థలం చుట్టూ నివసించేవాళ్ళకి చాలాయిబ్బంది కలుగుతున్నా, అఁ... మనకెందుకులే. అని వాళ్ళు విడిచిపెట్టేరు. అదేసాయంత్రం పూట R. S. S. వాళ్ళకి గ్రౌండు క్రికెటు ఆడే వాళ్ళకి పుట్బాల్ ఆడేవాళ్ళకి కోఫీ అయిందే. ఆగ్రౌండులో క్రికెట్ చూస్తూ ముక్కుమూసుకొని ఓరాతిపై ఆ అనాధునిపల్కులు వినటానికి ఓరాతిమీద చతికిలపడ్డాం.

ఆమనిషింకా "హుఁ.... నాదే ఊఁ ఎంతగొప్ప యింట్లో పుట్టేను, కాని నీతెల్లతోలుచూచి ఎర్రతేలువని తెలియక. నిన్ను ప్రేమించాను. 'ప్చ్....' చాలా పొరబాటు పని చేశాను. పోనీ, ప్రేమించి ఊరుకున్నా బాగుణ్ణు. కొరివితో తలగోక్కున్నట్లు నిన్ను పెళ్ళాడేను."

నిన్ను మెడకట్టుకొని నేనేం బాగుపడ్డాను. అటు ఆస్తా పోయింది, యిటు ఉద్యోగమా పోయింది, నా యింటర్ కంప్లీటయిపోగానే, బి. ఏ, చదువుదాం అనుకున్నా, యింటర్లోనే మనిద్దరికీ స్నేహం కుదరటం చాలా పొరబాటయింది. నాచదువుగురించి నాఅభీష్టం నీ చెవిలో వేస్తే నువ్వేమన్నావో గుర్తుందా? "ఏందుకొచ్చిన బి. యే. లు-ఎం.ఏలు? పేరు గొప్ప ఊరు దిబ్బా అన్నట్లు అంతడబ్బు ఖర్చు చేసి ఆచదువులు చదవటం! ఉద్యోగాల వేటలో ఆచదువుకి తగ్గ ఉద్యోగం కాదు, సరికదా? మామూలు స్కూలుఫైనలు పాసయిన వాడితో సమానంగా ఏగుమాస్తాగిరో వెలిగించాల్సిందే కదా. అందుకే కాబోలు మీమామ్మ "అమ్మాయ్, యీకాలంలో బి.యే., ఎం. ఏ. కానివాడెవడో చెప్పు? ఎక్కడ చూచినా తోటకూర కాడల్లా వీళ్ళే" అని గ్రాడ్యుయేట్లను తిట్టేది. అందుకని. నే చెప్పిన మాట విని. యింజినేరింగ్ చదవండి. అది పిండికి తగ్గ రొట్టె" అన్నావు.

సరే నీ యిష్టంప్రకారమే కానిమ్మని యింజినేరింగుకి అప్లయిచేసా, సీటూవచ్చింది. నాఅదృష్టం నీఅదృష్టం బాగుందనుకున్నాను. కాని నాకేం తెలుసూ కాలేజీలో నా సీనియరొకడు నీస్నేహితుడున్నాడని? ఎలాగో ఒకలాగు అది పూర్తిచేసి అక్కడే లెక్చరరుగా జేరా, తస్సాదియ్యా, వాడూ అక్కడే చేరేడు శనిగాడు, మనమధ్య చిచ్చు పెట్టాడు.

మీయిద్దరికి స్నేహంఉన్నట్లు నాకు చాలారోజులుగా తెలీదు. కాని ఒకరోజు మన పని మనిషివల్ల తెలిసింది, అదీ తెలియకపోను, ఆరోజు నేను తొందరగా వచ్చేశా. నువ్వింట్లో లేవు. పనిమనిషిదగ్గర లక్ష్మి ఆడుకుంటోంది. దాన్నడిగా నువ్వెక్కడికెళ్ళేవని. "ఆశాస్త్రి బాబుగారితో వెళ్ళేరండి" అంది.

'ఎందుకు వెళ్ళేరు'?

"అమ్మగారూ అయ్యగారూ దినమ్మా కారులో ఎల్తారండి" అని చెప్పింది.

ఛీ....పూర్వులు చెప్పిన శాస్త్రాలు కూడా తారుమారే. అడది మాంసంముద్ద, మగాడు ఆమాంసాన్ని తన్నుక

పోయే గద్ద, అని కాని ఆడది సాలీడు, మగాడు ఆ సాలీడుని పొందగోరే ఈగలాగ నాశనం అయిపోతాడు- అలాగే అయింది నాపరిస్థితి.

నువ్వొచ్చేక గట్టిగా అడుగుదాం అనుకున్నా. కాని నీ మీదుండే మమత నన్నా ప్రయత్నంనించి విరమింప జేసింది.

ఆరోజు, సాయంత్రం.... అదే నువ్వు దేశాంతరం పట్టినరోజు, సాయంత్రం యింటికివచ్చా. సంశయంగానే ఉంది నువ్వుంటావో ఉండవోనని. కారణం ఆశాస్త్రిగాడు ఉద్యోగానికి ఆఉదయమే రాజీనామా యిచ్చేశాడు. అయినా నువ్వెక్కడున్నావో అని యిల్లంతా వెతికేను... లేవు... ఎందుకుంటావ్? నీప్రియుడితో షికారెళ్ళేవేమో నని రాత్రి పదింటిదాకా చూచాను. కాని ఏంలాభం? పోనీ సగం చదివిన పుస్తకమేనా పూర్తి చేసేద్దాం అని. అది డిసీప్డ్ "అన్న పుస్తకం దీశా, ఆందులో కథలాగే ఉంది నాకథకూడా అనుకుంటూ. అందులోనించి ఓతెల్లకాగితం తొంగిచూస్తోంది నాకేసి. అది తీసి చదివాను. అందులో నువ్వు ఏం రాయలేదు. పారిపోయేవారంతా యేంచేసేరో, నువ్వూ అదే చేశావు. అయితే ఇకమీదనుంచి మీకూ నాకూ యేంసంబంధం లేదు. పాప నాకూతురు కాదు" అని రాశావ్. ఎంతపని చేశావు? నవమాసాలూ మోసి కని ఓ. సం॥దాకా పెంచావ్...నువ్వు మనిషివి కావు, రాక్షసివి.... నువ్వు. నాకూ నీకూ సంబంధంలేదు అన్నదానికి నేను విచారించలేదు. నాలాంటి వాడు యీ ప్రపంచంలో ఎంత మంది లేరు? వారిలో నేనొకణ్ణి అనుకున్నా. అందుకే పెద్దలు సజాతివివాహం చేసుకోమన్నారు. జాతి మార్పుంటే జీవితంలోనూ మార్పేఉంటుంది. నువ్వుతురక (కసాయి) దానివి...నేను. బ్రాహ్మణ్ని .. మన కెలా పొత్తుకుదురుతుంది- పీర్లపండక్కీ సంక్రాంతికీ సామ్యం తెచ్చినట్టే". అందుకే కన్నకూతుర్ని నాకూతురు. కాద న్నావ్: నేనందుకే బాధపడుతున్నా...నన్నుగురించికాదు.

* *

ఆరోజునుంచి. ఎక్కడ చూచినా ఏపనిలోఉన్నా నిన్ను గురించే ధాస... యిలా రెండునెల్లు గడిచింది. ఓనాడు పేపర్లో నీఫోటో చూశాను." అనాధస్త్రీ హత్య" అని పైన వ్రాసిఉంది, నీఫొటోకింద "ఈమె ఎవరో గుర్తు తెలియదు. బేసిన్‌బ్రిడ్జి స్టేషన్‌కీ మదరాసుసెంట్రలుకీ మధ్య రైలు క్రింద పడి ప్రాణాలు పోగొట్టుకుంది. గుర్తు తెలియనందున పోలీసులే అంత్యక్రియలు జరిపేరు "అని.

నిలుపునా నీరయేను. నాపరిస్థితి యిలా తయార యింది" అని. "హూమ్...అని యేడుపు లంకించు కున్నాడు ఆ పిచ్చాడు."

"నాన్నా... నాన్నమ్మ భోజనానికి పిలుస్తోంది రా" అని అతనిచెయ్యి పట్టుకొని ఓయేడేళ్ళ అమ్మాయి యింటి లోకి దారితీసింది. యింతగా ఏడుస్తున్నవాడూ పిల్లిలా ఆమె ననుసరించేడు.

"ఒక పరాయిజాతి స్త్రీని ప్రేమించి పెళ్ళిచేసు కొన్నాడు. అది చెప్పకుండా పారిపోయింది. ఒకడితో. అతను ఆమెను లక్ష్యపెట్టక అన్యాయం చేసి పోయేడు. ఆమె ఆత్మహత్య చేసుకుంది. ఆసంగతి తెలి సిన 'రోజునుంచి యితను యిలా తయారయేడు. అప్పు డప్పుడు యిలాగే తనకథ తను తనప్రియురాలితో మాట్లాడుతున్నట్లు చెప్తాడు." అని మేమడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆపక్కింటి ఆసామీ చెప్పేడు. యింటి త్రోవలో పట్టేం మేము. త్రోవలో శర్మ 'ప్చ్....' పాపం...అన్నాడు.

పిచ్చాడు.... ...... అప్రయత్నంగా నేను.

---

"పురుషుఁ డెంతస్వతంత్రుఁడై పరుగులిడిన
కాంత చేదోడుగాకున్న ఖ్యాతిగలదె?" ॥ (పూలదండ)

"వేదశాస్త్రవిచారాది విధులచేత
బుద్ధిమంతులు కాలమ్ము పుచ్చుచుంద్రు
వ్యసనములఁ గలహాల నిద్రలను నేపుడు
మూర్ఖజనములు కాలమ్ము పుచ్చుచుంద్రు" ॥ (ఆర్యోక్తి)

"చదువులేక, గ్రుడ్డిబ్రతుకీడ్చు మానిసి;
ఎందులేక, రుజలఁగుందు పేద;
కూడులేక రాలు వాఁడున్న గడ్డను
శాంతిలేదు జీవకాంతి రాదు" ॥ (అభినవతిక్కన)

# ఆంధ్రమహిళా సభా నర్సింగ్‌హోమ్ వార్షిక నివేదిక

1959-60 సం॥ కూడ ఆంధ్ర మహిళా సభ నర్సింగ్ హోమ్, పూర్వంవలెనే పనిచేసింది. లేబర్‌వార్డు, మెటర్నిటీవార్డు. మెడికల్‌వార్డు, సెప్టిక్‌వార్డు, పిల్లల వార్డు, అవుట్ పేషంటుల డిపార్టుమెంటు, అన్ని ప్రజల నుండి వచ్చే విరాళాలతోను, ఆర్థికంగా ఇవ్వగల రోగుల నుండి వచ్చిన డబ్బుతోను నడుపబడినాయి.

నెలకు రు. 50 లు గాని, అంతకు తక్కువగాని ఆదాయం వచ్చే రోగులకు ఉచితంగా వైద్య సౌకర్యాలు కల్పించబడినాయి. అలాంటి బీదవారికి వారివారి వ్యాధు లనుబట్టి, వారం రోజులు, అంతకుపైగాకూడా ఆహార పదార్థాలు ఉచితంగా ఇవ్వబడినాయి.

ప్రస్తుతం మన నర్సింగ్‌హోమ్‌లో 80 మంచాలున్నాయి. అందులో 60 పురిటికి, 8 వైద్యమునకు, 12 పిల్లలకు ప్రత్యేకించబడినాయి.

| Statistics లెఖ్ఖలు | బయటనుండి వచ్చి మందు తీసుకెళ్లే రోగులు | నర్సింగ్ హోములో ఉండి చికిత్సపొందువారు, పురిటి కేసులు | యితర కేసులు |
|---|---|---|---|
| 1959 | 57,810 | 1,879 | 3,837 |
| 1960 నవంబరు ఆఖరువరకు | 38,342 | 1,642 | 3,097 |

Ante natal clinic, పళ్లవ్యాధుల చికిత్సాలయం, కుటుంబనియంత్రణ సలహా కేంద్రం పూర్వంవలె పని చేసినాయి.

Ante natal clinic- బుధవారం—శనివారం — పళ్ల వ్యాధుల చికిత్సాలయం ; బుధవారం — కుటుంబ నియంత్రణ సలహా కేంద్రం -- సోమవార - గురువారాల్లో ప్రతివారం పనిచేశాయి.

డాక్టర్ K. S. సంజీవి, డాక్టర్ నాగస్వామి, డాక్టర్ P. N. V. గిరి, నర్సింగ్ హోముకు వచ్చి ఉచితంగా సేవచేస్తున్నారు. వారి సహాయ సానుభూతులకు మన మెంతో ఋణపడి ఉన్నామని చెప్పవచ్చు.

మద్రాస్ ప్రభుత్వం యిచ్చిన 1,00,000 రూపాయలు ఆపరేషన్ థియేటర్, సర్జికల్‌బ్లాకు, కట్టడాలకు ఉపయోగించబడినది. పై భవనానికి 1959 జులై 23 వ తేదీన, ఉపాధ్యక్షులు—డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారు ప్రారంభోత్సవం జరిపారు, దానికి కావలసిన యంత్ర సామగ్రి, కేంద్ర ప్రభుత్వపు ఆరోగ్యశాఖవారిచ్చిన 54,000 రూపాయలతో కొనబడినది.

కమ్యూనిటీ డెవలెప్‌మెంట్ ప్రోగ్రామ్ క్రింద ఆక్సిలరీ నర్సు, మంత్రసాని, - శిక్షణ, నిర్వహించటానికిగాను 3-వ పంచవర్ష ప్రణాళికలో, కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. 1960-61 సం॥ నకు 66,400 రూపాయలు కేంద్ర ప్రభుత్వం మంజూరుచేసినది. 1953 అగస్టునుండి 1960 నవంబరు వరకు 175 మంది విద్యార్థినులకు మన నర్సింగ్ హోములో శిక్షణ ఇవ్వబడింది. ప్రస్తుతం 60మంది విద్యార్థినులు శిక్షణపొందుతున్నారు. 1958-59 1959-60 సం॥లో వచ్చిన గ్రాంటులు, శిక్షణకయిన ఖర్చులు ఈ క్రింద పేర్కొనబడినవి.

| | వచ్చిన గ్రాంటులు | ఖర్చులు Rs. | N.P. |
|---|---|---|---|
| 1958-59 | 61,000 | 61,170 | 75 |
| 1959-60 | 63,600 | 65,77 | 83 |

వచ్చిన గ్రాంటుకన్నా 2958-59 లో ఎక్కువ అయిన మొత్తం 170-75 నయాపైసలు, 1959-60 లో ఎక్కువ అయిన మొత్తం 2,179-83 నయాపైసలు. నర్సింగ్ హోమ్‌నుండి ఖర్చుపెట్టబడింది.

'కుటుంబ నియంత్రణ' స్కీమ్ క్రింద, కుటుంబ నియంత్రణ సేవికలకు, శిక్షణ ఇచ్చుటకు, కేంద్ర ప్రభుత్వపు ఆరోగ్యశాఖ, మన నర్సింగ్ హోమును, ఒక కేంద్రంగా, గుర్తించినది. ఈ శిక్షణ ఒక సంవత్సరము మాత్రమే. కడచిన సంవత్సరం, మద్రాసు, ఆంధ్రప్రదేశ్, మైసూరు, కేరళ, పుదుచేరినుండి వచ్చిన 50 మంది విద్యార్థినులకు శిక్షణ ఇవ్వబడింది. ఈ క్రింద పేర్కొనబడిన గ్రాంటులు ఈ కేంద్రమునకు ఇవ్వబడినవి.

| వచ్చిన గ్రాంటుల వివరాలు | | గ్రాంటుల మొత్తాలు |
|---|---|---|
| Non Recurring | | |
| 1. భవన నిర్మాణానికి | .... | 35,000 |
| 2. యంత్ర సామగ్రికి | .... | 15,000 |
| Recurring | | |
| 1. జీతాలు స్టైఫండులకు | .... | 55,000 |
| మొత్తము | .... | 1,05,000 |

ఖర్చుపెట్టిన మొత్తం .... 1,06,939-86 న.పైసాలు

నర్సింగ్ హోమ్ డబ్బునుండి, ఖర్చుపెట్టబడిన ఎక్కువ మొత్తం ... 1,939-86

కుటుంబ నియంత్రణ సేవికల రెండవ జట్టు కర్చులు

బస్సు కొనటానికి ఇచ్చిన గ్రాంటు ... 19,000
జీతాలకు స్టైపండులకు యిచ్చిన గ్రాంటు.... 59,000

1959 జూలై 17 వ తారీకున శ్రీ V. T. కృష్ణమాచారి గారు, కుటుంబ నియంత్రణ శిక్షణ కేంద్రాన్ని, తెరిచారు, డాక్టర్ కృష్ణారావుగారు ప్రారంభోత్సవం జరిపారు. ఆ నాటి సమావేశానికి, లేడీ ధనవంతి రామారావుగారు అధ్యక్షత వహించారు.

మొదటి జట్టు 50 మందిలో 18 మంది మద్రాస్ రాష్ట్రమునుండి, 14 గురు ఆంధ్ర ప్రదేశ్‌నుండి, 12 గురు కేరళనుండి, 6 గురు మైసూర్‌నుండి, 1 పుదుచేరినుండి, వచ్చినారు. వారందరు పరీక్షలలో ఉత్తీర్ణులై, తమ తమ రాష్ట్రాలలో కుటుంబ నియంత్రణా సేవికలుగా పని చేస్తూన్నారు. రెండవ జట్టు 50 మందికి 1960 జూలైనుండి తరగతులు ప్రారంభించబడినాయి.

| | | |
|---|---|---|
| మద్రాసునుండి | .... | 25 |
| ఆంధ్ర ప్రదేశ్‌నుండి | .... | 11 |
| కేరళనుండి | ... | 10 |
| మైసూరునుండి | ... | 4 |

కుటుంబ నియంత్రణ సలహా కేంద్రం — ఈ కేంద్రం పోయిన సంవత్సరము వలెనే పనిచేస్తూఉన్నది. మైలాపూర్ — మందవల్లి — అడయార్ వాటి చుట్టు ప్రక్కలఉన్న పేదవారికి సహాయపడుతూంది. ఈ క్రింద పేర్కొన్న అంకెలద్వారా కుటుంబ నియంత్రణ సలహా కేంద్రం, ఎలా ప్రజలలో పలుకుబడి సంపాదించు కున్నదో, ఎలా ప్రజలు కుటుంబ నియంత్రణపై ఆసక్తి చూపుతున్నారో తెలుస్తుంది.

| | |
|---|---|
| కేంద్రంనుండి సహాయం పొందిన రోగుల సంఖ్య | 1959 - 1960 నవం॥వరకు |
| | 4,836 - 7,248 |

కామన్ హాలు బిల్డింగ్ నిర్మాణానికి - 16,626-33 నయా పైసలు ఖర్చుపెట్టబడింది. దాని ఖర్చుకుగాను, కేంద్ర సాంఘిక సేవాసమితి 15,000 రూపాయలిచ్చినారు. మిగిలినది నర్సింగ్ హోం డబ్బునుండి ఖర్చుపెట్టబడి నది. 1959 జనవరి 14 వ తేదీన కేంద్ర ప్రభుత్వ విద్యా శాఖా మంత్రి శ్రీ. శ్రీమాలిగారిచే భవన ప్రారంభోత్స వము చేయబడినది.

ఆంధ్ర మహిళాసభ — వికలాంగులైన పిల్లలకు సేవ చేయుటకై మరొక కార్యక్రమమును చేపట్టినది. ఆంధ్ర మహిళాసభ ట్రస్టీలలో ఒకరు రు. 1,00,000 లు ఇవ్వ టంతో ఈ కార్యక్రమం ఒకరూపం దాల్చినది. దానికి 'మ్యాచింగ్ గ్రాంటు'గా భవననిర్మాణానికి, కేంద్ర విద్యా శాఖ రు. 132,142 లు మంజూరుచేసినది. ఈ కేంద్రం లో పరికరాలు మొదలగు ఇతర సామానుల ఖర్చులకు 1960-61 కి రు. 23,550 మ్యాచింగ్ గ్రాంటుగాను, రు. 8,550 సిబ్బంది ఖర్చులకుగాను కేంద్ర విద్యాశాఖవారు మంజూరుచేసినారు. కేంద్రసాంఘిక సేవాసమితి వారు మ్యాచింగ్ గ్రాంటుగా. 10,000 ఇచ్చినారు, ఈ కేంద్రానికి 1960 జనవరి 19 వ తారీఖున శ్రీమతి ఇందిరాగాంధి గారు ప్రారంభోత్సవం జరిపారు. పిల్లలను 1960 ఏప్రిల్ నుండి చేర్చుకొన మొదలుబెట్టినాము. 5 నుండి 11 సంవ త్సరముల లోపు కుల, మత, భాషా భేదములులేకుండ 26 మందిని జేర్చుకున్నాము. వికలాంగులైన ఆ పిల్లలలో 15 మందిని, కేంద్ర సాంఘిక సేవాసమితి వారు ఇచ్చిన మ్యాచింగ్ గ్రాంటుతో, పోషణ జరప బడుచున్నది,

వికలాంగుల కేంద్రంలో ఈక్రింది వారు పనిచేయు చున్నారు.

1. సూపర్‌వైజర్
2. హౌస్ మదర్
3. మాంటుసోరీ సెకండరీగ్రేడు టీచర్
4. హైయ్యర్‌గ్రేడు టీచర్స్ ఇద్దరు
   1. తెనుగుకి 1. అరవముకి
5. ఆక్యుపేషనల్ థిరపిస్టు
6. ఫిజియోథిరపిస్టు
7. టైపిస్టు
8 మిడ్‌వైఫ్
9. అటెండెంటు

ఈకేంద్రం తర్వాత, సెకండరీ స్కూలు, ఒక వర్కు షాపుతో కలిపి వికలాంగులైన పిల్లలకొరకు నడుప దలచింది. వికలాంగుల కేంద్ర కమిటీకి చైర్‌మన్. అయిన డాక్టర్. A. లక్ష్మణస్వామి మొదలియార్‌గారి సలహాల తోను, ఈవ్యాధుల నివారణలో ప్రవీణతపొందిన డాక్టర్. M. నటరాజన్‌గారి సలహాలతోను నర్సింగ్‌హోం మెడికల్ సూపరింటెండెంటు డాక్టర్ M. పవనాబాయి గారి సలహాలతోను, పిల్లలకు వైద్యం చేయబడు చున్నది. గవర్నమెంటు జనరల్ హాస్పిటల్‌లో ఈ వికలాంగులైన వారికి సర్జనుగా పనిచేస్తున్న డాక్టర్. M. నటరాజన్‌గారు నర్సింగ్‌హోంకు వచ్చి ఆరోగ్య

శాఖ. 17-3-60 వ తేదీ G. O. N. S. NO, 862 ద్వారా ఉచితంగా సేవ చేయటానికి అవకాశం కల్పించిన మద్రాస్ ప్రభుత్వానికి మనకేంద్రం ఎంతో ఋణపడి ఉందనుటలో అతిశయోక్తి ఏమిలేదు. డాక్టర్ నటరాజన్ గారు. ఎంతో ఆసక్తితో ఎన్నోమారులు వచ్చి డాక్టర్లకు, ఫిజియోథెరపిస్టులకు ధిరపిష్టులకు. సలహాలిస్తున్నందుకు పిల్లలకు వైద్యం చేస్తున్నందుకు మనం ధన్యవాదాలు అర్పించాలి. ఆయన సహాయమును, ఏనాటికి మర్చిపోలేము-

విద్యాశాఖ— ప్రస్తుతం ఈకేంద్రములో మాంటుసరీ తరగతిగాక 5 వ తరగతి వరకు, చదువుకొనటానికి అవకాశాలు కల్గించబడినాయి. స్కూలు 3 భాగాలుగా విభజింపబడినది. 1 మాంటుసరి 2 తమిళ్ 3 తెనుగు భాగాలు. తమిళ్ సెక్షన్‌లో 12 మంది తెనుగు భాగంలో 5గురు. మాంటుసరీలో 9 మంది ఉన్నారు. మొత్తం 26 మంది పిల్లలలో యిద్దరు కేంద్రానికి బయటనుండి వచ్చి విద్యనేర్చుకొని వెళ్ళుతున్నారు.

విందులు వినోదాలు — అడయార్‌లో ఉన్న అరండల్ కేంద్రంలోని పిల్లల ఉత్సవములో పాల్గొనటానికి, మన వికలాంగుల కేంద్రములో ఉన్న పిల్లలకు అవకాశం ఇవ్వబడింది. మన పిల్లలు ఆ ఉత్సవములో పాల్గొని, ఆటలు ఆడి పాటలుపాడినందులకు బహుమతులు కూడా యిచ్చారు.

గవర్నరుగారు రాజభవనంలో జరిగిన పిల్లల దీపావళీ ఉత్సవాలకు మన కేంద్రంలో ఉన్న పిల్లలను కూడా ఆహ్వానించారు. పిల్లలు ఎంతో సంతోషపడ్డారు కూడాను.

1960 ఆగస్టు 22 వ తారీకున ఆక్యుపేషనల్‌థిరపిస్టు 1960 సెప్టెంబరు 15– వ– తారీకున ఫిజియోథిరపిస్టు, డ్యూటీలలో, చేరినారు. వారు యీ కొద్ది కాలంలోను చేసినపని యీక్రింద పేర్కొనబడింది.

ఆక్యుపేషనల్ థిరపిస్టు శాఖవారి లెక్కలు— (1960 అక్టోబరు 1 వ తా॥నుండి)

అక్టోబరు — వైద్యం చేయబడిన పిల్లలు
మొత్తం ... 4

(సెరిబ్రల్ పాలసీ, యాన్‌టారియార్ – పోలియో - మయోలిటస్. .... 3)

పిల్లలను పరీక్షచేసిన (Attendance) .... 74

సరాసరి ,, రోజుకు .... 3.3

నవంబరు — వైద్య సహాయం పొందిన పిల్లలు - 6

(సెరిబ్రల్‌పాలసీ 1 యాన్‌టారియర్ - పోలియో-మయోలిటస్ .... 5)

పిల్లలను, పరీక్షచేసిన (Attendance)
109 ... (26 రోజులకు)

సరాసరి-ఒక రోజుకు, 4.1

డిసెంబర్ — 21–12–60వరకు వైద్యసహాయం పొందిన పిల్లలు (బయటనుండి వచ్చే ఒక పిల్లవానితో సహా) ... 19.

(సెరిబ్రల్‌పాలసీ - 4 యాన్‌టీరియర్ - పోలియో-మయోలిటస్ .... 13)

(కంజనిటల్ డిఫామిటీ) (Congenital Deformity) .... 2)

పరీక్ష - చేసిన మొత్తం పిల్లలు .... 216
... (18 రోజులకు)

సరాసరి హాజరు ఒక రోజుకు .... 12

ఫిజియోథిరపిస్టు శాఖ లెక్కలు

అక్టోబరు — వైద్యముచేయటానికి హాజరైన సార్లు .... 50

వైద్య సహాయం పొందిన పిల్లలు ... 5
(ముగ్గురు పోలియోకేసెస్ వారు ఇద్దరు Spastic Paralyses వ్యాధివారు)

నవంబర్ — వైద్యసహాయం పొందిన పిల్లలు రోజుకు .... 6

(ముగ్గురు పోలియో వ్యాధి 3 Spastic Paralyses వ్యాధివారు)

వైద్యసహాయంకొరకు బయటనుండి వచ్చి సహాయాన్ని పొందుతున్న పిల్లలు—
పోలియోకేసు .... 1

వైద్యంచేయటానికి హాజరైన సార్లు ...129

డిసెంబర్ — రోజూ వైద్యసహాయం పొందే పిల్లలు .... 10

(అందులో, 7—పోలియోవ్యాధివారు ఒకటి Post Incephalitic Paralyses వ్యాధి కేస్)

ట్రస్టు బోర్డు మెంబర్లు అయిన శ్రీ V. హనుమంత రావుగారు వడ్డీలేకుండా అప్పుగా ఇచ్చిన మొత్తాలు:

నర్సింగ్ హోమ్ .... రూ. 13,500
వికలాంగుల కేంద్రానికి .... రూ. 5,000

వచ్చిన గ్రాంటుప్స అప్పటికి చాలనందున, నర్సింగ్ హోము కార్యక్రమం నిర్విఘ్నంగా సాగటానికి వడ్డీ లేకుండా అప్పులు తీసుకొనటమైనది. ఇందుకు ఆంధ్ర మహిళాసభ ట్రస్టుబోర్డు కార్యదర్శిగారి అనుమతి పొందబడినది.

సభలు, సమావేశాలు — 1959 లో నాలుసార్లు 1960 లో ఒకసారి నర్సింగ్ హోము ఎక్జిక్యూటివు కమిటీ సమావేశాలు జరిగాయి. (2) కుటుంబ నియంత్రణ స్పెషల్ కమిటి 3 సార్లు సమావేశ మియింది, (3) వికలాంగుల కేంద్ర సలహా సంఘం యిప్పటికి 6 సార్లు సమావేశమయింది.

వికలాంగుల కేంద్రానికి వచ్చిన విరాళాలు
1960–61

1. సుందర మోటార్ ప్రైవేట్ లిమిటెడ్ మద్రాసు .... 5,000
2. సతీ విలాస్ ఆస్ సర్వీసు పొరయూరు .... 1,000
3. శ్రీరామ విలాస్ బస్ సర్వీసు (కుంభకోణం) .... 1,000
4. రామన్ & రామన్ (P) లిమిటెడ్ (కుంభకోణం) .... 1,008
5. శ్రీ మహాలింగం (పొల్లాచి) .... 1,000
6. శ్రీనివాస టింబర్ డిపో (మద్రాస్) .... 60
7. వెంకటేశ్వరనాయుడు & సన్సు .... 120
8. సైపుద్దీన్ అండ్ కో, (మద్రాస్) .... 145
9. ఎల్లప్పన్ మేస్త్రి, నుంగంబాకమ్, (మద్రాసు) .. 224
10. హానరరీ సెక్రటరీ గిల్డ్ ఆఫ్ సర్వీస్ .... 151
11. శ్రీమతి క్లబ్‌వాలా జాదవ్ .... 101
12. ఉప్పటూరి ఆల్వార్‌చెట్టి ధర్మశాల (1960 మార్చినుండి 1960 నవంబరు వరకు ప్రతినెల 15 రు. చొప్పున .... 135
13. పిల్లల తల్లిదండ్రులనుండి (1960 నవంబరు వరకు) .... 640

1960 నవంబరువరకు

నర్సింగ్ హోముకు వచ్చిన ఇతర విరాళాలు

1959-60 ఇండియా సిమెంట్సు వారు బెడ్ కలెక్షన్స్‌కు .... రు. 1,000
ప్యారీ అండ్ కో. మద్రాసు .... ,, 240
శ్రీమతి ఐడాచేంబర్స్ .... ,, 750
శ్రీమతి యమ్. చంద్రమ్మ, బెంగుళూరు ... రు. 500
1960-61 ఆంధ్రా సిమెంటు కంపెనీ, విజయవాడ .... రు. 250
ఆర్-ఆర్-పిక్చర్సు. టి. నగర్ .... ,, 150

ఇతర ధర్మాలు: ఫ్రేమ్ సోఫాసెట్ కుషన్లు, పూల మొక్కలు మొదలగునవి. శ్రీమతి హనుమంతరావు — కొయ్యబాతు ఒకటి పి. యమ్. పి. కార్నర్ షాపు మైలాపూరు, మద్రాస్ — 24 టవల్స్, M. R. పార్థసారథి నాయుడు అండ్ సన్సువారు ధర్మంగా ఇచ్చినారు.

అనేకులు దాతలు, సహాయసానుభూతులు చూపు తున్నప్పటికి, ఆంధ్ర మహిళా సభ నర్సింగుహోం, మూడు సంవత్సరముల నుండి, యీక్రింద పేర్కొన బడిన విధముగా, తరుగు బడ్జట్టుతో నడుపబడుచున్నదని తెల్పుటకు విచారిస్తున్నాము.

| | | |
|---|---|---|
| 1957–1958 | .... రూ. | 69,15:66 |
| 1958–1959 | .... ,, | 15,874:08 |
| 1959–1960 | .... ,, | 19,559:19 |

యీలోటు బడ్జెట్టును సరిచేసుకొనటానికి, మద్రాసు ప్రభుత్వాన్ని గ్రాంటు కోరినాము. కాని, అనేక సంవత్స రాల నుండి, మన నర్సింగుహోము మద్రాసు వాసులకు, ప్రత్యేకంగా పేదవారికి, ఎంతో సేవచేస్తూ వచ్చినప్పటికి, మన కోరికను మద్రాసు ప్రభుత్వం నిరాకరించినది. మన నర్సింగుహోమే అచ్చట లేకపోయినా, అలాంటి సేవ చేయక పోయినా, ఆ ప్రజల వైద్య సౌకర్యాలకొరకు, మద్రాసు ప్రభుత్వం ఎంతో ఖర్చుపెట్టవల్సి యుండెడిది. మద్రాసు ప్రభుత్వం ఏలాంటి సహాయం చేయకపోయి నప్పటికి, ప్రజలను దృష్టిలో పెట్టుకొని, యితోధికంగా, వైద్య సౌకర్యాలు కల్గిస్తూ, యింతకాలం మనం నర్సింగు హోంను, అనేక సాధక, బాధకాలకు ఓర్చి నడుపు కొంటూవచ్చాము. కాని యీనాడు మనం యింతకాలం నుండి, ఏపనైతే చేయకూడదని,త్రోసుకుంటూ వచ్చామో, ఆ పనే చేయవల్సివచ్చింది. ప్రజలకు ఉచితవైద్య సహా యం చేయటం విరమించవల్సివచ్చినది. ఆంధ్ర మహిళా సభవంటి వాలంటరీ ఆర్గనైజేషన్, ఏదైన, ప్రభుత్వపు ఆర్థిక సహాయం లేకుండా నడపబడటం చాల కష్టమైన విషయం.

నర్సింగుహోము ఆర్థికపరిస్థితి బాగుపడటానికి అడ్‌హక్ కమిటీ మెంబర్లు, శ్రీ బి. వి. డి. నారాయణ రావుగారు, శ్రీ వి. హనుమంతరావుగారు, శ్రీమతి వి. లక్ష్మీపార్వతిగారు, డాక్టరు యమ్. పవనాబాయిగారు, ఆ సమావేశమునకు ప్రత్యేకంగా ఆహ్వానింపబడిన ఆడిటరు- యస్. సూర్యనారాయణరావుగారు కలిసి 13-11-60 న, యీ క్రింది సూచనలు చేసినారు.

(A) మెడికల్ వార్డును మూసివేసి, దానిని రూ. 50-100 మధ్య నెలసరి రాబడి కల్గి డబ్బు యివ్వ కల్గిన రోగులు ఉండుటకు అనువుగా దానిని మార్చటం.

(B) పిల్లల వార్డును మూసివేసి, దానిని జనరల్ మెటర్నిటీ వార్డుగా మార్చటం.

(C) రోగులకు ఉచితంగా ఆహారం యివ్వటం మాని వేయటం, అవసరమైన రోగులకు మాత్రము, ఇండియన్ రెడ్‌క్రాసు సొసయిటీవారు, గిల్డు ఆప్ సర్వీసువారు, పాలపొడి యిచ్చినంత కాలం, పాలు సరఫరా చేయటం,

(D) మెడికల్ సూపరింటెండెంటు సలహా యిచ్చి నట్లుగా, రోగుల అడ్మిషనప్పుడు డబ్బు వసూలు చేయటం—మొదలగు సూచనలు చేయబడినవి.

వ్యవస్థాపకురాలు, ట్రస్టుబోర్డు సెక్రటరీగారిని సంప్ర దించి, వారి సలహాలను కూడ, పై విషయములపై తీసు కొన బడినవి. మద్రాసు ప్రభుత్వం సహాయం లేనందున నర్సింగుహోము ఆర్థిక పరిస్థితి బాగుపడటానికి, మరొక మార్గం లేనందున అడహక్ కమిటీ సూచనలు వారు చాల విచారంతో అంగీకరించినారు. పైన పేర్కొన బడిన సూచనలు 1961, జనవరి 1 వ తా॥ నుండి అమలుపర్చటానికి నిర్ణయమైనది. దీనివల్ల బీదసాదలైన చాలమంది రోగులు వైద్యసహాయము లేక బాధపడ వలసివస్తుందని గుర్తించాము. మద్రాసు ప్రభుత్వం సహా యము లేకపోవుట వల్లను, నర్సింగుహోము ఆర్థిక పరి స్థితి బాగుపడటానికి అంతకన్నా మరొక మార్గము లేక పోవుట వల్లను, పై సూచనలు ఎంతో బాధతో అమలు జరుప నిశ్చయించాము.

# వీడ్కోలు

రాబోవు 1961 మార్చిలో జరుగు బెనారెస్, ఆంధ్ర, మద్రాసు విశ్వకళాశాలల మెట్రిక్కుపరీక్షలకు— మహిళా సభా విద్యా సంస్థలనుండి వెడుతున్న పైతరగతుల విద్యా ర్థినులకు వీడ్కోలు ఇవ్వటానికి క్రింది తరగతులవారు సమావేశం అయిన సందర్భాన్ని పురస్కరించుకొని స్వల్పాహారపు విందు ఏర్పాటు చేశారు. ఆ విందు కాగానే, క్రిందితరగతుల బాలికలు ఆటపాటలతో కూడిన పెక్కు వినోదప్రదర్శనాలు చేయటంమాత్రమే కాక, తమతోడి సోదరీమణులయిన విద్యార్థినీరత్నములకు ఉత్సాహం కలిగిస్తూ, పరీక్షలలో వారికి జయం కోరారు. తమ్ము ఈవిధంగా సత్కరించినందుకు ఆ పైతరగతుల వారు ఉచితరీతిని కృతజ్ఞత తెలుపుతూ మాట్లాడారు. సభా సంయుక్త కార్యదర్శిని అయిన - శ్రీమతి టి. జి. హేమావతిగారు పరీక్షలకు వెళ్ళేవారికి గెలుపు కోరుతూ, ఆనాటి సమావేశకారకులైన క్రింది తరగతుల విద్యార్థినులను అభినందించారు.

---


"అన్యదేశంబునందు విద్యయ ధనంబు,
మానస వికల్పమందు సన్మతియ ధనము,
ప్రాజ్యపరలోకమందు ధర్మంబ ధనము,
అన్నిటను శీలమే ధనంబగు నరునకు" ||

(సుభాషిత రత్నమాల)

# అమృతాంజనము

## అన్ని నొప్పులకు దివ్యామృతము

1893 నుంచి లక్షలాది ప్రజలు అమృతాంజనం వాడి, ఎంత అమోఘమైన శక్తి కలదో తెలుసుకుంటున్నారు. అమృతాంజనంలో వాడే ఔషధాలన్నీ అతి శీఘ్రంగా బాధను పశమింప చేయుటయేగాక చాలా హాయిని కూడా కలిగిస్తాయి. హాని కలిగించే పదార్థాలేమీ లేవు కూడా. దగ్గు, జలుబు మొదలైనవి కూడా శీఘ్రంగా ఉపశమిస్తవి. అమృతాంజనం దగ్గర ఉంచే మీ రెటువంటి బాధనైనా జయించవచ్చు.




అమృతాంజన్ లిమిటెడ్,
మద్రాసు-4
బొంబాయి-1,
కలకత్తా-7

# మల్లమ్మదేవి హాస్టలు నివేదిక

మా మల్లమ్మదేవి హాస్టలుకి 21 వ - వార్షికోత్సవము నిరుడు శ్రీ అమ్మమ్మగారి అధ్యక్షతను జరుపుకున్నాం. ఈ సంవత్సరం 22 వ - వార్షికోత్సవము మన సభ ఫౌన్డర్ శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఇక్కడ వున్నప్పుడు జరుపుకొనుటకు చాలా సంతోషంగా వుంది. హైదరాబాదు సభ సెక్రెటరీలు, శ్రీమతి - సుగుణమణిగారు- లీలాబాయి గారు కూడా రావడం తటస్థపడింది.

మల్లమ్మదేవి హాస్టలు యథాప్రకారంగాను నిరాటంకంగాను జరిగిపోతూనే వున్నది. హాస్టలు ప్రతీ సంవత్సరం 50 మందికి తక్కువ కాకుండానే నడుస్తోంది, ఈ సంవత్సరం మా హాస్టలు జనసంఖ్య : 51 మంది. స్టాఫ్ - 5 గురు, బయట ఆఫీసులలో పనిచేయువారు 5 గురు, ప్రైవేటుగ, మెట్రిక్, పి. యు. సి చదువుకీ విద్యార్థినులు 3 గ్గురు వున్నారు.

హాస్టలులో వుంటూవున్న విద్యార్థినులు :

| | | | |
|---|---|---|---|
| బెనారస్ మెట్రిక్ : | సీనియరు విద్యార్థినులు | 7 | గురు |
| ,, | జూనియరు విద్యార్థినులు | 4 | గురు |
| ,, | సబు జూనియరులు | 1 | రు |
| ఆంధ్రా మెట్రిక్ : | సీనియరు విద్యార్థినులు | 5 | గురు |
| ,, | జూనియరులు విద్యార్థినులు | 9 | గురు |
| ,, | సబు జూనియరు విద్యార్థినులు | 4 | గురు |
| ప్రెపరేటరీ క్లాసు విద్యార్థినులు | | 5 | గురు |
| మద్రాసు మెట్రిక్ : | సీనియరు విద్యార్థినులు | 2 | గురు |
| ,, | సబు జూనియరులు | 1 | రు |
| | మొత్తం | 38 | గురు. |

వీరిలో కండెన్సుడ్ కోర్సు :- విద్యార్థినులు 10 వున్నారు. హాస్టలువాసులు అంతాకూడా పండుగలు, ఫన్‌క్షనులలోను సభాకార్యక్రమాలలోను ఉత్సాహంగా పాల్గొని జయప్రదంగా జరిపించుకుంటూ వుంటారు.

వినాయకచవితి, వరలక్ష్మీ పూజ, స్వతంత్ర దినోత్సవము, దసరా, దీపావళీ మొదలగు పండుగలు అన్నీ యథావిధిగ జరుగుతూనేఉన్నాయి. ఈ సంవత్సరం, దసరాలు మామూలుగ జరిగేటంత ఎక్కువగ జరుపుకోలేకపోయాం. సరస్వతీపూజ బొమ్మలకొలువు పేరంటములు మాత్రం బాగానే జరిగాయి. కట్టింగు, ఎంబ్రాయిడరీ సెక్షనులలో తయారైన దుస్తులు, వీవింగు సెక్షనులో తయారైన చీరలు వగైరాలు ఎగ్జిబిషన్ పెట్టాం.

గిల్డ్ ఆఫ్ సర్వీసువారివలన, పాలపౌడరు ప్రతీరోజు ఉదయం 7 గంటలకు సభ ఆవరణంలోను, అర్బన్ వెల్‌ఫేర్ ప్రాజెక్టు ఎక్స్టెన్‌షన్ సెంటరు నారాయణస్వామి గార్డెనులోను ఇవ్వబడుచున్నది. ఈ సంవత్సరం మాకు గోధుమలుకూడా సప్లైచేశారు. వారమునకు ఒకసారి గంజిగ తయారుచేయించి బీదలకు పోయిస్తున్నాం. జనవరి 60 నుండి మార్చి నెలాఖరువరకు 20,380 మందికి, ఏప్రిల్ నెలనుండి డిసెంబరు నెలాఖరువరకు 29,387 మందికి మొత్తం ఈ సంవత్సరం 49,767 మందికి పాలపంపకం జరిగింది.

మా హాస్టలులో వుండువారందరూ ఆరోగ్యంగానే వుంటున్నారు. మాకు నర్సింగుహోం వుండుటచేత, ఎప్పుడు, ఎవరు అనారోగ్యంగా వున్నా పగలు, రాత్రి, అర్థరాత్రి అయినా సరే, ధైర్యంగా తీసుకువెళ్లి జాయిన్ చేయించి వస్తున్నాం. 1, 2 రోజులలో ఆరోగ్యవంతులై వస్తున్నారు. డా॥ అవధానులుగారు కూడా మా ఆరోగ్యాలకు కారకులు ; మా డా॥ అవధానులుగారికి మా నర్సింగుహోం డాక్టర్లకు మేము ఎల్లప్పుడు కృతజ్ఞులము.

మన ఫౌన్డరు కృషిఫలితమైన సంస్థలు : నర్సింగుహోం వుంది. విద్యార్థినులు, సభ సభ్యురాండ్రు వినోద కాలక్షేపమునకు వనితా బాలవిహార్, (ఆటస్థలం) వుంది. ప్రెస్సు, శిశువిహార్ వున్నాయి. హైదరాబాదులో మనకింకో ఆంధ్ర మహిళాసభ వుంది. మన సంస్థలన్నీ కూడా అందరి సహకారం, ఆశీర్వచనాలతో దినా, దినాభివద్ధి కావాలని మా కోరిక.

---

'కంటికి కన్ను పంటికి పన్ను' అని అంటారు. కాని, నేను మీకు బోధించేవిషయం ఏమంటే; మిమ్మల్ని మార్కొనే వానిని గూడా మీరు ఎదిరించరాదు, ఎవ్వడైనా, మీకుడిచెంపమీద కొడితే. ఎడమచెంపకూడా వానికి ఇయ్యాలి. న్యాయస్థానంలో దావాతెచ్చి, నీఅంగినికూడా ఎవడు సంగ్రహింపచూస్తాడో, వాడికి నీపైగుడ్డకూడా ఇయ్యాలి.

(ఏసుక్రీస్తు)

# ఆంధ్ర మహిళా సభా సమావేశాలు

కడచిన 1960సం॥రం డిసంబరు 31-వ - తారీఖున ఆంధ్రమహిళాసభయొక్క సర్వసాధారణ సభాసమావేశం జరిగింది. దాదాపు 240మంది సభ్యులు హాజరయిరి. సభకు శ్రీమతి లక్ష్మివెంకాయమ్మగారు అగ్రాసనాధిపత్యం వహించిరి. సంయుక్త కార్యదర్శినులు, మద్రాసు హైదరాబాదుసభలకు సంబంధించిన పెక్కుసంస్థల కార్య నివేదికలను సభకు సమర్పించిరి. 1960సం॥రం నవం బరువరకు ఆదాయవ్యయాలను 1958సం॥ నవంబరువరకు ఆదాయవ్యయాలను 1958-'59సం॥ ఆడిట్ జమాఖర్చు లను వివరించి సభయొక్క ఆమోదాన్ని పొందారు. సభ్యులు 1961 సం॥రానికి యావజ్జీవసభ్యురాండ్రకు సామాన్య సభ్యురాండ్రకు ప్రాతినిధ్యం వహించటానికి శ్రీమతి బి. కృష్ణవేణమ్మగారిని ట్రస్టుబోర్డు కొకసభ్యు రాలినిగా ఎన్నుకొన్నారు. 1961సం॥ర కార్యనిర్వాహక వర్గానికి క్రిందివారు సభ్యురాండ్రుగా ఎన్నుకోబడ్డారు :

శ్రీమతి బి. తిమ్మాబాయమ్మ—సభా మహిళావిద్యాలయం ;
విశ్రాంతిగృహం.

శ్రీమతి ఎ. పర్వతవర్ధని—నాగేశ్వర శిశువిహారం ;
వనితా బాలవిహారం.

శ్రీమతి టి. జి. హైమావతి—ముద్రణాలయము ; చేనేత ;
వగైరా.

శ్రీమతి వి. లక్ష్మీపార్వతి—నర్సింగుహోమ్.

,, కే. సుగుణమణి, శ్రీమతి లీలాగౌరీబాజీ,
హైద్రాబాదు మహిళాసభ-ప్రాతీయ చేతిపనులు
వగైరా.

తరువాత, ఆంధ్ర మహిళాసభ ట్రస్టుబోర్డు సభ్యులు సమావేశం అయి సాధారణసభలో సూచింపబడినవాటిని అంగీకరించారు. అనంతరం సభా రజతోత్సవం 1962 డిసంబరులో జరపటానికి తీర్మానించారు. ఈసభల్లో క్రిందివారుగూడా పాల్గొన్నారు : మీర్జాపూరు మహారాణి, శ్రీమతి దుర్గాబాయి దేశముఖ్, (వ్యవస్థాపకురాలు), శ్రీమతి ఏ. సి. కృష్ణారావు, కుమారీ శ్రీ జమునాబాయి, శ్రీ వి. హనుమంతరావు, డాక్టరు ఏ. వి. అవధాని, శ్రీ బి. వి. డి. నారాయణరావు.

## విశ్రాంతి గృహ వార్షికోత్సవం


ఆంధ్రమహిళాసభ వసతిగృహ (మల్లమదేవి మహిళా మందిర) వార్షికోత్సవం వనితా బాలవిహార రంగస్థలంలో 1960 డిసంబరు 31-వ తారీఖున జరిగింది. క్రీడాంగణం లోని బహిరంగప్రదేశంలో నాటకరంగం ఆకర్షణీయం గాను, అందంగాను సభవారు నిర్మించారు. విద్యార్థినులు, అన్ని శాఖలలోను తరిబీతు పొందుతున్నవారు, బహుళ సంఖ్యాకులు సభను అలంకరించారు. అల్పాహారాల స్వీకారానంతరం—విశ్రాంతిగృహంలో ఉండే కన్యలు, యువతులు "తెల్లవారింది" అనే నాటకాన్ని, వినోదం ఇచ్చే కొన్ని ఆటపాటలను ప్రదర్శించి ప్రేక్షకులకి ఆనందం కలిగించారు. అవన్నీ ప్రేక్షకుల ప్రశంసలకు పాత్రం అయినాయి. విశ్రాంతిగృహ సంరక్షకురాలు (Warden) అయిన శ్రీమతి వెంకూబాయమ్మ ఆ సమ యంలో తన నివేదికను సమర్పించింది.

శ్రీమతి దుర్గాబాయి దేశముఖుగారు, విశ్రాంతిగృహ నివాసుల క్రమశిక్షణను చూచి చాలా ప్రశంసించారు. వెంకూబాయమ్మ సంరక్షకురాలుగా శ్రద్ధాసక్తులతో గృహాన్ని నడుపుతూన్నపద్ధతికి హర్షిస్తూ, దక్షిణ భారతమందం తటా, స్త్రీలకై నడుపబడుతూవుండే యీవిశ్రాంతిగృహం యొక్క కీర్తిప్రతిష్ఠలకు ముఖ్యంగా, ఆమె నిరంతర కృషే కారణమని ఉద్ఘాటించారు. అంతేకాకుండా, భావి జీవితమార్గానికి ముఖ్యకారణంగా నిల్చి, తమకు, విద్యను, చక్కనితరిబీతును, ఆశ్రయాన్ని యిస్తూన్న వసతిగృహాన్ని వారు విడిచిపోయినా, మరువక మాతృ వతుగా భావించి అత్యంత గౌరవం చూపాలి."

## ఆంధ్రమహిళాసభకు శ్రీ స్పర్జిన్‌గారి రాక

లండనునగరంలోని న్యాయాధికారుల సమితియందొక సభ్యురాలును, సుప్రసిద్ధ సంఘసేవకురాలును, అయిన శ్రీమతి యస్. సి. స్పర్జిన్, జే. పి. గారు ఇటీవల భారత దేశానికి వచ్చారు. ఆమెగారు, మదరాసులోని న్యాయ స్థానాలు, పిల్లలన్యాయసభలు, కొన్ని సంక్షేమసంస్థలు, చెఱసాలలూ మున్నగువాటిని సందర్శించారు. ఆతరు ణంలో—ఆంధ్రమహిళాసభను దానికి సంబంధించిన సంస్థలనుగూడా చూడడం తటస్థించింది. అప్పట్లో మహిళాసభచే నడుపబడుచున్న బిడ్డల కాశ్రయంఇచ్చి వారి అభ్యుదయానికై పనిచేస్తున్న మందిరాన్ని (Nursing Home)ను, ముద్రణాలయాన్ని పరికించి వాటిలో జరిగే కార్యాలు తనమనస్సున కెక్కగా మిక్కిలి హర్షించారు. ప్రేక్షకుల అభిప్రాయాలు తెలిపే గ్రంథంలో ఆమెగారు ఇలా వ్రాశారు :

"సజీవంగా, చైతన్యంతో ప్రకాశించే సభకు సంబం ధించిన విద్యాలయాన్ని చూచి ఒడలు పులకరించింది.



ఎడమ దిక్కు నుండి, వరుసగా : శ్రీమతులు—ఏ. పర్వతవర్ధని, వి. లక్ష్మీపార్వతి, బి. తిమ్మాబాయి,
టి. జి. హైమావతి—ఆం. మ. సభా సంయుక్త కార్యదర్శినులు,

ఇక్కడ విద్యాభ్యాసం చేసేబాలికలు, స్త్రీజనానికి అనేక విధాలుగా సేవచేయటం ఆనందదాయకం",

స్లేర్ స్పర్జిన్, జే., పి.
న్యాయాధికార సమితి, లండన్ (ఇంగ్లండు).

## ఈశ్వరీప్రసాద్ దత్తాత్రేయ అంగవైకల్య చికిత్సాకేంద్రం

(ఆం. మ. స. — నర్సింగు శాల)

ఈకేంద్రానికి 1960 సం॥ జనవరి 19-వ తారీఖున శ్రీమతి ఇందిరాగాంధిచే ప్రారంభోత్సవం జరిగింది. 1960 సం॥ జూన్ 15 న, ఈ కేంద్రంలో పిల్లలను చేర్చటం మొదలుపెట్టారు. ప్రకృతం ఇక్కడ 5 నుండి 11 ఏండ్ల యీడుగల పసివారు 24 మంది (బాలురు 15 గురు—బాలికలు 6 గురు) 19 మంది అరవలు; ఐదుగు రాంధ్రులు. ఒకపిల్లవాడు మహమ్మదీయుడు; ఇద్దరు బాలికలు క్రైస్తవులు. తక్కినవారు భారతీయులు.

వీరికి విద్యాబోధనకై, ఒక ఆంధ్రోపాధ్యాయుడు, ఒక అరవగురువు, ఒక మాంటిస్సోరి బోధకుడు నియమించబడ్డారు. ఏడుగురుపిల్లలు మాంటిస్సోరీ తరగతిలోను, ఐదుగురు తెలుగుతరగతుల్లోను చదువుతున్నారు. వీరిలో ముగ్గురు మొదటితరగతిలోను ఇద్దరు ఐదవ తరగతిలోను విద్యాభ్యాసం చేస్తున్నారు.

పన్నెండుగురు అరవ తరగతుల్లో చదువుతున్నారు. వీరిలో ఒక్కరు మొదటితరగతిలోను, ముగ్గురు రెండవ తరగతిలోను, ఇద్దరు మూడవతరగతిలోను, మరి ఇద్దరు నాలుగవ తరగతిలోను, ఇంకొక యిద్దరు ఐదవతరగతిలోను ఉన్నారు.

ఇందులో స్థావరంగా సభాశ్రయస్థానంలోనే ఉండి చికిత్సపొందే 24 మంది పిల్లలతోబాటు బయటివారుకూడా ముగ్గురురోగులు ఉన్నారు. ఈపిల్లలు తృప్తికరంగా ఆరోగ్యవంతులవుతూ, విద్యల్లో అభివృద్ధికి వస్తున్నారు, వాళ్ళు ప్రత్యేకంగా పద్యాలు పాటలు పాడటానికి ఉత్సాహం చూపుతూంటారు. అంతేగాక, బల్లలపైన పరిచే అల్లికబట్టలపని, ఉడుపులు తయారుచేయటం, పూసలతో సంచులు కూర్చటం, తీగలతో సంచులు అల్లటం మొదలయిన చేతిపనులు కూడా చేస్తారు, వాళ్ళ తరగతిగదుల్లో వాటిల్లో కొన్నింటిని చూడవచ్చు.

అంగవైకల్యాలకు శస్త్రచికిత్స చేయటంలో నిపుణులు అయిన— డాక్టరు— యం. నటరాజన్‌గారు అంగవైకల్యశాఖా పర్యవేక్షణ, తమ తీరికసమయాల్లో చేయటానికి ప్రభుత్వం అనుమతించినందున, వారు శ్రద్ధ వహించి వికలాంగులను పరీక్షించి తగినసలహాలు ఇస్తున్నారు. వారి అభిప్రాయాన్ని అనుసరించి ముగ్గురు పిల్లలు ప్రభుత్వంవారి జనరల్ ఆస్పత్రికి పంపబడ్డారు. అందులో ఒకరు శస్త్రచికిత్సపొంది తిరిగి కేంద్రానికి 5-1-1961 న, పంపబడ్డారు. తక్కినవారిద్దరు ఆస్పత్రిలోనే ఇంకా చికిత్స పొందుతున్నారు.

## సాంఘిక కార్యక్రమాలు

పిల్లల్లో కొందరు, అడయారులోని అరండేలు అభ్యాస (తరబీతు) కేంద్రంలోని వస్తుప్రదర్శనాల్లో పాల్గొన్నారు. సంగీతకళా ప్రావీణ్యానికి వాళ్ళకి బహుమతులు గూడా వచ్చాయి.

గౌరవనీయులు అయిన మద్రాసు గవర్నరుగారు కేంద్రంలోని పసిపిల్లల విషయంలో చాలా ముచ్చటపడి రాజభవనంలో వాళ్ళని అల్పాహారవిందుకు ఆహ్వానించారు. దాన్ని అనుసరించి వాళ్ళు అందు అమితోత్సాహంతో పాల్గొన్నారు.

పొంగల్ (సంక్రాంతి) పండుగనాడు మద్రాసు ఛాంపియన్ మోటార్స్- లిమిటెడ్ కంపెనీ యజమాను లయిన శ్రీ కే. మేఘనాధన్‌గారు, మన శిశుకేంద్రంలోని వాళ్ళలో ఒక్కొక్కరికి- రెండు జతల ఉడుపులు బహూకరించారు. మన కేంద్రసంస్థ ఉపయోగార్థం- సి. హెచ్. సత్యనారాయణగారు, 13-1 1961 న, ఒక బుష్‌రేడియోను ఉచితంగా ఇచ్చారు. 9 11—1960 న, కార్యదర్శినిగారు భరించిన వ్యయంతో కేంద్రం ఆవరణంలో అల్పాహార పానీయాలు సమకూర్చబడ్డవి.

### సభకు ఈక్రింది విరాళాలు చేకూరినవి:-

### కేంద్రానికి వచ్చిన ప్రేక్షకులు

| | | |
|---|---|---|
| గౌరవకార్యదర్శిని- సేవాసంఘం | .... | రూ. 151 |
| శ్రీమతి క్లబ్‌వాలా జాదవ్ | ... | ,, 101 |
| శ్రీ శ్రీమతులు కృష్ణమూర్తి దంపతులు | | ,, 100 |
| వైస్. అడ్మిరల్ కటారి | .... | ,, 200 |

అంగవైకల్యాల్ని యాంత్రికంగా పోగొట్టటానికి తగినసాధనాలు మన దేశంలో దొరికే అవకాశాలు లేవు. విదేశాలనించి దిగుమతి కావాలి. అందుకు కొంతకాలం పట్టవచ్చు

'ఫిసియో తెరా ఫీ'కి సంబంధించిన సాధనాలలో కొన్ని అంగవైకల్యాలకు అత్యంతావసరం. అట్టివాటిని తయారుచేసేవారు మనదేశంలోకూడా ఉన్నారు. అందులో ఒకడు ఆసాధనాల్ని ఉపయోగించే పద్ధతిలో తయారు చేయగల అతను, అప్పుడప్పుడు మనకేంద్రానికి వచ్చి చూచి పోతుంటాడు.

# సరోజినీదేవి

(వెనుకటి సంచిక తరువాయి)

ఆమె యనంతర మామెకుమార్తె
పద్మజానాయుని, పశ్చిమ వంగ
రాష్ట్రంబునకు గవర్నరుపదమందు
నియమించి రలకేంద్రనేతలు ప్రీతి.
ఆయమయేగాక యనుగుసంతాన ॥

సమితి, లీలామణి, జయసూర్యమూర్తి
ఆనరోజిని బిడ్డ లసమానగుణులు
పతులెడ సుతులెడ పరమప్రియంబు
తనరెడునది, సరోజిని నిరంతరము
ఆయమ వ్రాసిన గేయవాఙ్మయము ॥

వినుతిగన్నవి; యందు వినిపింతు గొన్ని,
ఆనందమిచ్చు నయ్యవి మనస్సునకు.
గనుక వినుండి శ్రద్ధను మీరలెల్ల
చిట్టితల్లుల్లార ! చిన్నారులార !
పంచవన్నెల చిల్క పసికందులార ! ॥

* * *

గాజులసెట్టి :—

కడియములు దేవళాల యంగళ్ళవాడ
అమ్మకొనువార మివి కొను డమ్మలార !
మోజుగలవివి నాడెంపుతేజు గలవి
ఇంద్రచాపముల్లైద కింపునింపు॥ ౧

రంగురంగుల మేలి హొరంగు గలిగి
జీవితపుచిహ్నముల ప్రకాశింపజేయు
అందమునుగూర్చు, నతుల కానందమిచ్చు
పెల్లుగా మోదమిడి చిట్టితల్లులకివి. ॥ ౨

హైదరాబాదు బజారులు :—

ఏమి అమ్మెదరయ్య మీరిచట, చెపుడి,
విలువగల వస్తువులు బైటబెట్టినారె?
సరిగ చుంగుల యెఱ్ఱని చాయ గలుగు
జిలుగు తలపాగ లేమైన వెలయునొక్కొ ॥ ౩

క్రొత్త మేలిగులాబిరంగుల చెలంగు
పరికిణీగుడ్డ లేవైన దొరకునొక్కొ?
చదరపుంజట్రమున నీలిచాయ యంచు
లందములు చిందు నద్దము లబ్బునొక్కొ?॥ ౪
క్రూరముగ ముందునకు దూసికొనుచు, చొచ్చి,
తీవ్రముగ బోవు మించులతీవెలట్లు
తనరెడు కటారి, పనివానితనము జాటు
పిడులు గలవేవి యయిన లభించునొక్కొ ॥ ౫

తనకుమార్తె- పద్మజా :—

"ప్రియకుమారి ! పద్మజ ! నీదుపేరిలోనె
అమితమంజులతా మధురిమలు గలుగు
నంచు నానందమందెద, వంతెకాదు,
సిరులరాణివి నీవు లక్ష్మివిగదమ్మ !" ॥ ౬

చిరునగవుమోము గల్గు తామరలలోని
అమితపరిమళమును గొల్లలాడి, యాడి
చల్లగా మెల్లగా వీచు పిల్లగాలి
పద్మజా- నీకు పరవశత్వమ్ము గూర్చు॥ ౭

(చెల్లాయీలు, ! తమ్ముళ్లూ ! మీరింకా కొంచెం పెద్ద వాళ్ళయినపుడు- శ్రీ సరోజినీదేవిగారు రాసిన ఇంగ్లీషు పద్యాలన్నీ చదువుదురుగాని. ఇక చాలిస్తా. ఏం.)

"కౌశిక"

# ఆశ్రయము

(గృహిణీ, పిచ్చుక అనువాదము)

విద్వాన్- శ్రీ కనమలూరు శివరామయ్య

గృహిణి : పిచ్చుకమ్మ ! పిచ్చుకమ్మ !
పెద్దపిచ్చుకమ్మా!
ఎచ్చటికి గంతులేసి
ఎగిరి పోతావమ్మా !
వచ్చి యుండరాదె, మాపెద్దమేడలో
ముచ్చటించరాదె నీవెల్లవేళలో.

పిచ్చుక : అందమైన పెద్దమేడ
హాయిగాను గట్టి

బందుగులను చేరబిలిచి
పాచిబువ్వ బెట్టి,

అందు కాపురంబుసేయ ఆశఉన్నది.
చందమామనంత మనసు చాల ఉన్నది.

గృ. ఇల్లు గట్టు కష్టమేల?
ఇట్టు చూడుమమ్మా
చల్లనైన చూరులోన
చక్కని మేడున్నది.

మెల్లగాను కాపురంబు సేయవచ్చును,
పిల్లాది బందుగులను పిలువవచ్చును.

పి. బువ్వకొఱకు తిరుగుచున్న
ప్రొద్దు చాలదమ్మా!
నవ్వివోరె కులమువారు
బువ్వ పెట్టకున్న?

నవ్వులాట వచ్చుపనిని నేను చేయను
బువ్వకొఱకు కష్టాలను పొందజాలను

గృ. వరికంకులు కోసితెచ్చి
వరుసలుగా తీరుగా
కొరతలేక నీయింటను
కూర్చి యుండగలముగా!

బురుబురుమని యెగురుచూ, భుజింప వచ్చునూ
పరుగులిడక నెమ్మదిగా బ్రతుకవచ్చును.

పి. నేనుచేయు పిల్లలన్ని
నిక్కము బంగారులు
మానక నీబిడ్డలేమొ
వాని గొట్ట జూతురు!

లేనిపోని కష్టాలను పొందజాలను
హానివచ్చుచోట ఒక్కఅడుగు బెట్టను.

గృ. బుద్ధికలుగువారు మా
ముద్దుబిడ్డలమ్మా
ముద్దుచూపి నీపిల్లల
వద్ద నుందురమ్మా!

ఒద్దికగా మనబిడ్డలు కూడిఆడగా,
పెద్దలైన మనకెంతొ హాయి గల్గుగా?

పి. అట్టులైన మాయింటను
బెట్టి కాపురమ్ము
గుట్టుగాను గడుపుచుందు
నాదుజీవితమ్ము.

చిట్టిపాప లాడుచుండ చేరిచూతును,
అట్టునిట్టు లెగురులాడి హాయిగొందును!

---

# సౌందర్యం

రచన : "బాలశ్రీ"

దూరతీరాల కనుపించువారిఁజూచి
మమతమదిలోన నిల్పితి - మరులుకొంటి
కనులబడు నందమును గాంచి గాఢవాంఛ
నొందితనుకొంటి - యెంతొయానందమంది,

ముఖమునన్ జిరునగవులు ముద్దుగొల్పు
వారిఁజూచుచు సౌందర్యవారి యనుచు
యెదఁదఁ దలపోసి నాఁడ - నాయెడలుగాంచి
దుఃఖమొందుమ సౌందర్యదూరు డనుచు

హృదయ మొక్కటి మానవు వదలెనేని
ఎట్టి సౌందర్యమున్నను నేమిఫలము?
అందమును జూచికొని లోన నజ్ఞుఁడగును
మందుఁడనియెరిగితిని, నేఁటిఁగితి సుజ్ఞతందు

బాహ్యసౌందర్య మున్నచో వారిగుండె
కుటిలరూపమ్ముఁ గీలించు నటయటంచుఁ
దెలిసికొంటిని జీవిత తీర్థయాత్ర—
నగ్నసత్యము నరపినే నవ్వుకొంటి.

# వింత వివాహం

(అను ఆంగ్లకథకు స్వేచ్ఛానువాదం)

## రచన: శ్రీ తేతలి రాజారావు

ఆమె లోకైకసుందరి. రంభాదిఅప్సరః స్త్రీలందరూ ఆమె కాలికొనగోటికైనా సరిరారు. ఆమె చిరునవ్వు ఒకనవవసంతోదయం. నడకహంసల కోగుణపాఠం. పలుకులు చిలుకల సిగ్గుపరుస్తవి. గాత్రం కోయిలలకి శిక్షణనిస్తుంది. ఆమె సౌందర్యవర్ణనోపక్రమణం ఆదిశేషునకైనను అతిసాహస'మని ఆస్థాన గాయకుడు ఒక యపురూప సౌందర్యవతి యందచందముల గానముచేస్తూ ఉంటాడు. సుల్తాన్ అహమదుషా ఉలిక్కిపడి 'ఏమిటి నువ్వంటూవున్నది. అట్టి సౌందర్యవతి నిజముగ యీ వసుంధరాస్థలాన నున్నదా?' అని గర్జించాడు. 'చిత్తం! ప్రభూ! ఆ యువతి నేటికి పదునెనిమిది సంవత్సరముల యెలప్రాయపుజవ్వని. పురుహూత మహారాజ తనయ ఆమె. ఆమెకు స్వయంవరం త్వరలోనే కానున్న"దని వినయముతో జవాబిచ్చాడు ఆస్థానగాయకుడు. "సరి, ఆనారీరత్నము సుల్తాను అహమ్మదుషా జనానా నలంకరించాలి. వేగులను రేపే పంపిస్తాను నీవు, చెప్పిన విషయాన్ని దృఢపరచడానికి". అని దర్బారు చాలించాడు సుల్తాను.

అవి అహమ్మదుషా, అఖండ విజయంతో హిందూస్థానంపై దాడివెడలుతూన్న రోజులు. శౌర్యపరాక్రమాలకి, సాహసానికి ఆటపట్టయిన ఒక్కరాజపుత్ర సంస్థానం, సుల్తానుకరవాలానికి ముందు, దాసోహమని బానిసత్వాన్ని సుల్తాను సార్వభౌమత్వాన్ని స్వీకరిస్తూవుంది. అహమ్మదుషా కఠోరశాసనం భారతావనిపై పైశాచికతాండవం చేస్తూవున్నది. ఎందరో రసపుత్రవీరులు తమయమూల్య ప్రాణాల్ని బలిపెట్టి మాతృదేశగౌరవాన్ని కాపాడాలని విఫలప్రయత్నులయ్యారు. కొందరు సర్వనాశనానికివెరచి, తమ తనయుల, సహోదరీమణుల మానధనాన్నిపణంగా పెట్టి సుల్తానుకు సామంతులై అతని అనుగ్రహ పాత్రులయ్యారు. మరి కొందరు అతన్నెదిరించి అపరాక్రమాగ్నికి శలభప్రాయులైనారు.

సుల్తాను. ఆశాపూరిత దృష్టి ఏసంస్థానంపై పడుతుందో, అతనిలోలుపత్వానికి ఏ రాజస్థాన కోశాగారం గురి కాబోతుందో, అతని కామతృష్ణకి యేయువతీలలామ మానప్రాణాలు బలికాబోతున్నవో అని హిందూస్థానం అహర్నిశాలు గడగడ వణకుతూంది. దేవాలయాధికారులు, మతాచార్యులూ తమ ధర్మ సంరక్షణ యెట్లా అని తపిస్తూ, అహోరాత్రాలు పరాత్పరుణ్ణి ప్రార్థిస్తున్నారు.

పురుహూత మహారాజా నాటి రసపుత్ర వీరుల కోతల మాణిక్యం. రాజకుమారి లాలాదేవియతని యేకైకపుత్రిక. పురుహూత సింగు ఆమెనే కుమారునిగ భావించి పెంచుకున్నా డతిగారాబంగా. ఆ నాటిరసపుత్ర వీరులంతా ఆమె సౌందర్యానికి, ఆమె కటాక్షవీక్షణానికి, ఆమె రుచిర మందహాసానికి తమ సర్వస్వము కానుకగా సమర్పించ సిద్ధముగా నున్నారు. ఆ జగన్మోహన సుందరికి స్వయంవరపుయేర్పాట్లు చేయిస్తూవున్నాడు మహారాజు పురుహూత సింగు.

ఆహోర సంస్థానం ప్రాచీనకాలంనుంచి బలపరాక్రమాల కాటపట్టు, స్వాతంత్ర్యపిపాసకది మూలస్థానం, మహమ్మదుషా యధికారమింకా అక్కడికి ప్రాకలేదు. ఒక్కదెబ్బకు రెండు పిట్టలనుకున్నాడు- సుల్తాను. లాలాదేవి అతని వివాహమాడితే ఆహోరసంస్థానం సామంత రాజ్యమవుతుంది. పురుహూతుని సాయంతో తక్కిన రసపుత్ర రాజ్యాల నవలీలగా జయించవచ్చు ననుకొన్నాడు.

అమూల్యమైన కానుకలతో సుల్తాను రాయబారి పురుహూతుని దర్బారు చేరాడు. గౌరవ సత్కారాలతో సుల్తాను కోరిక రాయబారి తెలియచేశాడు. అవమానంతో రసపుత్రవీరులనేత్రాలు రక్తారుణితాలయ్యాయి. సీత్కారంచేస్తూ, కరవాలాల్ని వెలికితీసారు రసపుత్ర వీరులు. కాని పురుహూత మహారాజు మంచి సమయజ్ఞుడు. బహిరంగంగా సుల్తాన్నెదిరించడం కొరివితో తల గోకుకొన్నట్లుగా సర్వనాశనం తెచ్చుకోవడమేఅని గ్రహించాడు. రసపుత్రులనువారించి, రాయబారిని యధోచితంగా సత్కరించి, ఆలోచించి బదులు పంపిస్తానని జవాబుచెప్పి రాయబారిని పంపించాడు. రాయబారి నిష్క్రమించినవెంటనే సుల్తాను యిచ్చి పంపిన యమూల్యరత్నాలు, ధనం సహాయంతో దుర్గపునర్నిర్మాణానికి, సైన్య సమీకరణానికి పూనుకొన్నాడు.

రోజులు గడచినవి. మాసములు గడుస్తూవున్నవి. ఆహోరసంస్థానం నుంచి సమాచారంరాలేదు. సుల్తాను కామజ్వరపీడితుడై నిద్రాహారాలకు దూరమై తపిస్తూ వున్నాడు. తన యాజ్ఞ లెక్కచేయలేదే యీ రాజపుత్రులు

అని అవమానం ఒకవైపు దహిస్తూంది. సమాచారం తెలుసుకోవడానికి పంపిన వేగులు పురుహూతుని యుద్ధ ప్రయత్నాలను గురించి తెలుపగానే ఆతని క్రోధావికంతు లేకపోయింది. మహాసామ్రాట్టు తాను ; ఒక స్వల్పాతి స్వల్పమైనది, అహోరు అది తన్ను ఎదిరించపోవడము సహించలేకపోయాడు. వెంటనే పదివేల సైన్యంతో స్వయముగా బయల్దేరాడు; వివాహానికైనా సరే- యుద్ధానికైనా సరే! అనుకుంటూ.

రెండు మదగజాలపై బంగారపుటంబారీలు యెత్తబడినవి. ఒకదానిలో సుల్తాను సుఖాసీనుడైనాడు. రెండవది లాలాదేవికని నిర్దేశింపబడినది. ఇలా అట్టహాసంతో అహోరుదుర్గంచేరి దుర్గప్రవేశమిమ్మని కబురంపాడు. బదులుగా ఒక నిశితబాణం సుల్తాను కిరీటానికి గుచ్చుకుంది. ఆ బాణానికి, ఒక చిన్నలేఖ కట్టబడివుంది. తలచుకుంటే యీ బాణం నీప్రాణం తీసియుండగలదు. కావున ప్రాణాలు దక్కించుకోవాలంటే వచ్చినదారిన తిరిగిపో అని దాని సారాంశం. సుల్తాను మండిపడ్డాడు. ఈ రసపుత్రమశకాలు యీ మహమ్మదీయ సామ్రాట్టునెదిరించడమా! తన యినుపపదాల క్రింద అణచి లాలాదేవిని పరిణయమాడకపోతే తన ప్రతిష్ఠ యేమవుతుంది? వెంటనే కోటముట్టడికి యనుజ్ఞనిచ్చాడు.

మదపుటేనుగులు సింహద్వారాన్ని బ్రద్దలు కొట్టడానికి కుంభస్థలాలతో ఢీకొంటున్నాయి. శతఘ్నులు కోటగోడల్ని పడగొట్టడానికి ప్రేలుతున్నాయి. ప్రాణాలకు తెగించిన తురుష్క వీరులు కోటగోడల నెగబాకుతున్నారు, ఉడుముల త్రాళ్ళనిచ్చెనల సహాయంతో. కోట బురుజులమీదనుంచి ప్రాకారపు గోడలమీదనుంచి సలసల కాగుతున్న సీసాన్ని, తైలాల్ని గ్రుమ్మరిస్తున్నారు, గోడలపైకెగబాకుతున్న శత్రుయోధులపైకి బల్లెములు, యీటెలు, బాణాలు తగిలి వేలకొలది మహమ్మదీయ వీరులు సమరభూమికి బలిఅయినారు. పెద్ద పెద్ద శిలాఖండాలు దొర్లిపడి వచ్చి సింహద్వారాన్ని బ్రద్దలు కొట్టడానికి వచ్చిన మత్తేభాల కుంభస్థలాల్ని బ్రద్దలు కొడుతున్నాయి.

ముట్టడి, ప్రతిఘటన జోరుగానే సాగుతున్నది. అనుకున్నంత సులువుగా, దుర్గం స్వాధీనం కాకపోయేసరికి తురుష్క సామ్రాట్టు, తాత్కాలికంగా ముట్టడినాపుచేసి కోటలోపలికి ఆహారపదార్థాల సరఫరా నటకాయించాడు. కోటలోని ఆహారసామాగ్రి తగ్గుతూవచ్చింది. సరఫరా నిల్చిపోవడంతో ముట్టడిని విజయవంతంగా నెదుర్కొని దుర్గాన్ని కాపాడుకోగలమన్న ఆ రసపుత్రులకు క్షీణించింది, అనుకున్న సమయానికి ఆశించిన సహాయం పురుహూతమహారాజుకి సమకూరలేదు.

అకస్మాత్తుగా అహోరదుర్గద్వారాలు తెరుచుకున్నాయి. పీతాంబరధారులు, కవచశిరస్త్రాణోపేతులు, వివిధ శస్త్రాస్త్రభూషితులు అయిన రసపుత్రయోధులొక వేయిమంది పురుహూత సింహుని నాయకత్వాన, కోట వెలుపలికి వచ్చి మహమ్మదీయసైన్యాంపై విరుచుకపడ్డారు. వీరగంధాల్ని, యోధతిలకాల్ని ధరించి, 'జయ హరహర మహాదేవ' అని గంభీరనాదంచేస్తూ రసపుత్ర యోధులొక్కొక్కరు, తమనిశితకరవాలాలకెదురు పడ్డ మహమ్మదీయవీరుల ననేకమందిని బలిచేస్తున్నారు. రసపుత్ర పరాక్రమాగ్నికి తట్టుకోలేక, ప్రమత్తులు, నిర్వీణులూ అయిన తురుష్కవీరులు శలభాలరీతి నాశనమవుతూవున్నారు. మహమ్మదీయ స్కంధావారమల్లకల్లోలమయింది, సుల్తాను తన యంబారిమీదినుండి, సేనను ప్రోత్సహిస్తూ వున్నాడు. మెరుపులాగ, నలుగురు రసపుత్రవీరులు సుల్తాను అధిష్టించిన మత్తేభాన్నెదుర్కొని దాన్ని ఖండించారు. ఘీంకరిస్తూ, ఆపట్టపు టేనుగు అంబారీతో సహా నేలకూలింది. రసపుత్రవీరుల నాలుగు ఖడ్గాలు సుల్తాను వక్షస్తలాన్ని అదిమిపెట్టివున్నాయి. ఈ ఆకస్మిక సంఘటనకు సుల్తాను మరణం తథ్యం- కాని విధి విపరీతమయింది, రసపుత్రవీరులను దూరం నుంచి చూసిన సుల్తాను అంగరక్షకులు అదే సమయానికి వచ్చి వారిని ఎదుర్కొన్నారు. సుల్తాను మృత్యుముఖం నుంచి తప్పించుకున్నాడు. వెంటనే ఖడ్గాన్ని తీసుకుని యుద్ధమారంభించాడు. రసపుత్రవీరులు తమ హస్తచాలననైపుణ్యముతో పరాక్రమాన్ని జోడించి ఒక్కొక్కడు పలువుర మహమ్మదీయుల శిరస్సుల్ని త్రెళ్ళవేశారు, ఇంతలో మహమ్మదీయ సైన్యం తెప్పరిల్లింది, ఆవేశంతో మితిమీరిన ఉత్సాహంతో తురుష్కులు రసపుత్రుల్ని చుట్టుముట్టారు. ఒక్కొక్కరుగా రసపుత్రవీరులంతా నేలకొరిగారు, విజయలక్ష్మి మహమ్మదీయులనే వరించింది- సమరభూమిలో పురుహూత మహారాజు వీరస్వర్గమలంకరించాడు, కాని సుల్తానుకు దుర్గం సులభంగా వశంకాలేదు, వెయ్యి మంది సైనికులతో పురుహూతుడు సుల్తాను సైన్యంలోని అధికభాగాన్ని పరలోకానికి పంపించాడు, సంభ్రమాశ్చర్యాలతో రసపుత్ర వీరుల పరాక్రమానికి సలాముచేశాడు సుల్తాను.

కోట స్వాధీనమయింది, కాని ఏముంది కోటలో?

జోహారు వ్రతమాచరించిన స్త్రీల బూడిదప్రోవులు తప్ప మహమ్మదీయ సైనికులు తమ యిచ్చవచ్చినట్లు ఖజానాను దోచుకున్నారు, దేవాలయాలను ధ్వంసంచేశారు. నిర్మానుష్యమైన యిండ్లకు నిప్పంటించారు, పైశాచిక తాండవంచేశారు, కాని వారికి ఒక్క ప్రాణిగూడా, ఆ కోటలో గాని, నగరంలోగాని, ఎదురుపడలేదు, లాలాదేవి జాడ కానరాలేదు, తన ప్రయత్నమంతా వృథా అయినదేయని సుల్తాను వాపోయాడు, చివరకు వేగుల ద్వారా ప్రక్కనేవున్న రసపుత్ర సంస్థానంలో లాలాదేవి వున్నదని తెలిసింది, సుల్తాను రసపుత్రవీరులకు కబురంపాడు, 'లాలానైనా పంపవలసింది; లేదా సర్వనాశనానికైనా సిద్ధంకావలసింద'ని.

రసపుత్రవీరులంతా సభచేశారు, తమ ధనమాన ప్రాణాలర్పించైనా లాలాను సుల్తానునుండి రక్షించి తమ గౌరవాన్ని కాపాడుకోవాలని నిశ్చయించారు, కాని లాలాదేవి 'సుల్తాను నన్ను వివాహమాడాలని నిశ్చయించాడు, అతన్ని నిరోధించడానికి మనకు బలంచాలదు, నాకోసం మీరంతా సర్వనాశనం కావడం నాకిష్టం లేదు, కావున సుల్తానుకు నన్నప్పగించండి, దీనికి ఫలితాన్ని అనుభవించకపోడు' అని చెప్పింది, రసపుత్రుల కిది ఎంత మాత్రము నచ్చలేదు. కాని లాలా తన పట్టు విడువలేదు, చివరికి లాలా, రాయబారిచేత యిలా కబురంపింది, 'లాలాదేవి సుల్తానువారి పరాక్రమాన్ని చూసి మోహించింది, తన్ను పరిణయమాడడానికి సుల్తానువారు మూడు షరతులకంగీకరించాలి. మొదటిది సుల్తానువారు రసపుత్రులతోడి విరోధాన్ని మరచిపోవాలి, రెండవది యింతవరకు సుల్తానువా రాక్రమించిన హిందూరాజ్యాలను ఆయా వంశీయులకు తిరిగి యిచ్చివేయాలి. మూడవది సుల్తానువారు నన్ను హిందూ సాంప్రదాయానుసారంగా వివాహమాడాలి.

సుల్తాను ఎగిరి గంతువేశాడు. ఇంతవరకు తానాక్రమించిన హిందూరాజ్యాలని వారివారికి యిచ్చివేస్తున్నట్లు, రసపుత్రులపై యుద్ధాన్ని విరమించుకుంటున్నట్లు వెంటనే ఫర్మానా వెలువడింది, హైందవ సాంప్రదాయానుసారం లాలాదేవి తగు పరివారంతో సుల్తాను నగరానికి వివాహానికి తరలివెళ్లింది,

వివాహం వైభవోపేతంగా జరిగింది. హైందవ సాంప్రదాయానుసారం సుల్తాను తిలకాన్నిధరించి, తులసి తీగాన్ని పుచ్చుకొని అగ్నిసాక్షిగ లాలాదేవిని వివాహమాడాడు. ఇది కొందరు మతావేశపరులైన తురుష్కులకు క్రోధకారణం అవమానకారణంకూడ అయింది.

వివాహానంతరం జరుగవలసిన వేడుకలు ఉత్సవాలు జరుగుతున్నాయి. లాలాదేవి కోరికప్రకారం రసపుత్రులిచ్చిన సుల్తాను పీతాంబరాలు, తులసిమాలలు ధరించారు. లాలాదేవి తన యాసనంమీదినుండి లేచి సుల్తాను చేతిని పట్టుకుని "జహాపనా' అంతఃపుర ప్రాంగణం బయట మన వధూవరులు ప్రజలకు దర్శనమివ్వాలి ప్రజలు చాలా వుత్కంఠతో వేచియున్నారు" అని కోరింది, 'సరే కానిమ్మ'ని సుల్తాను తన దేవితో అంతఃపురప్రాంగణానికి వచ్చాడు.

మధ్యాహ్న మార్తాండుడు తీక్షణంగా ప్రజ్వలిస్తున్నాడు. సుల్తాను లాలాముఖాన్ని చూస్తూ పరవశమౌతున్నాడు, మధ్యాహ్నపు ఎండవల్ల కలిగిన చిరుచెమట బిందువులు లాలాదేవిముఖానికి నూతనశోభ నిస్తున్నాయి, లాలాదేవి యా చిరుచెమట తుడుచుకుంటూ 'స్వామీ, నాగసర్పం పడగపైనున్న మాణిక్యాన్ని ధరించటానికి కాశపడేవాడు, ఆ నాగుబాము కాటుకుకూడా సిద్ధపడియుండాలి, ఏమంటారు?" అని అడిగింది. మోహావేశవివశుడైన సుల్తానుకామాటలు చెవికెక్కలేదు.

ఇంతలో సుల్తాను ధరించిన, పీతాంబరాలకు, పుష్పమాలలకు నిప్పంటుకున్నాయి, మంటలకు తాళలేక సుల్తాను యిటునటు పరుగెత్తసాగాడు, లాలాదేవి పూసిన రసాయనిక విషాలు, మధ్యాహ్నపు మార్తాండుని తీక్షణ కిరణాలు సోకి ప్రజ్వరిల్లసాగినాయి, విషాలు దేహానికెక్కసాగినాయి, కొద్దిక్షణాల్లో సుల్తాను బొగ్గులా మాడి మృతుడయినాడు, లాలాదేవి తన విజయానికి తోడ్పడిన పరాత్పరుదికికృతజ్ఞత చెప్పుకుంటూకోట కందకంలోదూకి ప్రాణత్యాగం చేసింది, వివాహానికి వచ్చిన రసపుత్రవీరులు ప్రమత్తులయిన మహమ్మదీయ సైనికుల్ని బంధించి కోట స్వాధీనంచేసుకున్నారు.

లాలాదేవి సమయజ్ఞత, సాహసంవల్ల హిందూస్థానాని కొక పీడ వదలింది.

---

అలివంకవారు ఆత్మబంధువులు;
తల్లివంకవారు దాయాదులు.

ముద్దుచేసిన కుక్క మూతినాకు;
చనువిచ్చినను ఆలు చంకకెక్కు.

# వార్తావళి

అమెరికా డెమొక్రాటిక్ పక్షంతరఫున సంయుక్త రాష్ట్రాల 35-వ అధ్యక్షుడుగా అధిక సంఖ్యాకులచేఎన్నుకోబడిన శ్రీ జాన్, యఫ్. కెన్నెడీ ఈ నెల 20వ తారీఖు, శుక్రవారంనాడు పదవీస్వీకారం చేశాడు. ఇంతవరకు ఆ పదవిలో శ్రీ డ్వైట్ డేవిడ్ ఐసన్ హోవరు ఎనిమిదేండ్లు అధినేతగా ఉండి ప్రభుత్వభవనాన్ని ఈదినం వదలిపెట్టాడు. అమెరికా ముఖ్యన్యాయాధిపతి కెన్నెడీగుండా ప్రమాణస్వీకారం చేయించి, ప్రముఖుల సమక్షంలో అధ్యక్షపదవిలో నెలకొలిపాడు. ఆసమయంలో శ్రీ ఐసన్ హోవరు (మాజీఅధ్యక్షుడు) కూడా ఆసమావేశంలో పాల్గొన్నాడు. అధ్యక్షులలో 43 ఏండ్ల యీడుగల యువకుడు; ముందుండిన అధ్యక్షులకంటే ఇతడే చిన్నవాడు. పదవినందినవెంటనే: "తీవ్రతగలప్రభుత్వం, బీదరికం, అనారోగ్యం—ఈలాటి వాటితో చాలాకాలంగా మసకమసకగా, మేఘాచ్ఛాదితం అయివున్న పోరాటాన్ని కొనసాగించటానికి నాపదవీకాలంలో పూనుకొంటాను. సంఘంలో బలాన్ని త్యాగాన్ని రేకెత్తిస్తాను. మనపై ఏలాటి భారంపడినా, మనము ఏలాటి దారుణ పరిస్థితులను ఎదుర్కోవలసివచ్చినా, మనకేజాతిగాని కీడెంచినా, మేలెంచినా—స్వాతంత్ర్యాన్ని పునరుద్ధరించగల మిత్రులనూ, శత్రులనుగూడా, బలపరచడానికే ప్రయత్నిస్తానని దృఢంగా చెబుతున్నాను. అన్ని జాతులు దీన్ని విశ్వసించుగాక!"—ఉత్సాహవంతుడైన యీరోమన్ కాథలిక్కు తాను పలికిన మేరకు అక్షరాలా దేశాభ్యుదయానికి పాటుపడగలడు.

## ఇంగ్లండు

కాంటర్బరీ (క్రైస్తవమతాధికారి) ఆర్చిబిషపు డాక్టరు జాఫ్రేఫిషరు (Dr. Geoffrey fisher) వయోధిక్యత కారణంగా విశ్రాంతిపొందుతున్నాడని—అధికారికంగా వెల్లడింపబడింది.

## కాంగో

లుముంబా పాల్గొనకుండా కాంగోలో సమాధానం కుదురదని, 20-1-1961న సమావేశంఅయిన సలహా సంఘం చేసిన సిఫార్సు తప్పక పాటించవలెనని—ఆఫ్రికా—ఆసియా (Afro-Asian) లలోని ప్రముఖదేశాలు నొక్కి చెబుతున్నాయి. ఈ ఆఫ్రికా—ఆసియాల సమైక్య ప్రాతినిధ్యం వహించిన ముప్పయిరెండు జాతుల సభ్యులు స్టాన్లీవిల్లే (Stanleyville) లో కాంగోయొక్క పరిపాలనా సందర్భంగా 'సరాసరి (ముఖాముఖి) ఎప్పటికప్పుడు సమక్షంలో రాజకీయ వ్యవహారాలు నడపటానికి కైరో (Cairo) లో ఒకస్థాయీ (ఉప) సంఘాన్ని నియమించాల్నని నిశ్చయించింది.

## నేపాల్

మహారాజు తన మంత్రివర్గాన్ని బర్తరఫుచేసి, పరిపాలనను తన చెప్పుచేతల్లో మెలిగేవారి వరంచేస్తూ, వారినే మంత్రులుగా ఏర్పరచుకొన్నాడు. ఇందుకు కారణం సందిగ్ధంగా ఉన్నది. మొత్తంమీద—నిరంకుశంగా తాను పూర్వ రాజరికాలను తలపిస్తున్నట్లు తోస్తున్నది.

## న్యూఢిల్లీ

రాజకీయంగా ఈ నెలలో కొందరు విదేశీయులు న్యూఢిల్లీ వచ్చారు. 19-న, నేపాల్ విదేశాంగ మంత్రి—శ్రీ డాక్టరు తులసీగిరి వచ్చాడు. 22-న తారీఖున శ్రీ సిక్కింరాజాగారు ప్రభుత్వాతిథిగా న్యూఢిల్లీకి వచ్చి, అధ్యక్షప్రధానులను సందర్శించారు. ఆసమయంలో చిత్రకళాప్రియుడగు ఆరాజుగారు, తాను చిత్రించిన చిత్రాలను వారికి సమర్పించారు.

కామన్ వెల్తురాజ్యాలకు అధినేత్రి అయిన బ్రిటిషు మహారాణి శ్రీ రెండవ యెలిజబెత్తు తనభర్త 'శ్రీ డ్యూకు ఆఫ్ ఎడింబరోతో సకుటుంబంగా, తగిన సిబ్బంది అనుసరింపగా భారతదేశాన్ని చూడటానికి వచ్చింది. ఆమె రాకకు మూడు నెలలుగా ముఖ్యనగరమయిన న్యూఢిల్లీలోను ఇతర ముఖ్య ప్రాంతాలలోను ప్రభుత్వంవారు తగిన బందోబస్తులు, సరంజామాలు చేయించారు. ఆమెగారు అమితోత్సాహంతో న్యూఢిల్లీకి 21 వ-తారీఖున విజయంచేశారు. ఆతరుణంలో అలవాటును అనుసరించి 21 ఫిరంగులు పేల్చారు. సైనికవందనాదికాలు జరిగాయి. అధ్యక్షులు శ్రీ ప్రసాదు, ప్రధాని శ్రీ నెహ్రూ తక్కిన అధికారవర్గం ఆమెగారికి ఘనంగా స్వాగతం ఇచ్చారు. వాయువిమానస్థానంనుంచీ రాష్ట్రపతిభవనంవరకు కొన్ని మైళ్ళపర్యంతం దార్లో ఇరుప్రక్కల ప్రజాసందోహం మహారాణి సందర్శనార్థం ఉత్సాహంతో కిటకిటలాడుతూ నిలబడ్డది.

రాజదంపతులు, రాజఘాటులో గాంధిగారి సమాధిమీద భక్తిపూర్వకంగా పుష్పమాల సమర్పించారు. తరువాత జయపూరుకు వెళ్లి — సమస్త రాజలాంఛనాలతో హౌదాను అలంకరించి ఏనుగునెక్కి ఊరేగినారు. అక్కడికి కారణ్యాలకు పరివారంతోకూడా వెళ్లినారు. శ్రీ డ్యూక్ ఆఫ్ ఎడింబరోగారు ఒక 9 అడుగుల పెద్ద పులిని వేటాడి చంపారు. గ్రామీణుల జీవయాత్రలను అచారవ్యవహారాలను ప్రత్యక్షంగా కొన్నిగ్రామాలను పర్యటించి తెలుసుకున్నారు. సరిగా 26-వ తారీఖున జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవాల్లో పాల్గొనటానికి ఢిల్లీకి వచ్చిచేరి శ్రీ ప్రసాదుగారితో రాజలాంఛనాలు ఒప్పుచుండగా సైనికవందనాదికాలు, త్రివర్ణపతాకాలు ఎగురవేయటాలు, విందులకు వెళ్లటాలు వగైరా పరమానందంతో పాలుగొన్నారు.

## ఆంధ్రప్రదేశ్

సచివవర్గం, యునైటెడు ఫ్రంటు వర్గం మధ్యగల వైమనస్యాలు, విభేదాలు "ఎక్కడున్నావే గొంగళీ అంటే, వేసినచోటనే ఉన్నా" ననే ధోరణిలోనే ఉంది. ఇంతకూ ఫ్రంటువర్గాన్ని అగ్రనాయకులు ఏమాత్రం గుర్తించనట్లే కనబడుతూంది. శ్రీ సంజీవయ్యగారు తనను ఇచ్చ వచ్చినవారితో మంత్రిమండలిని పెంచటానికి వారు అనుమతించారు. కాని యింతవరకు, అది జరుగలేదు. ఇది యిలా వుండగా ప్రధాని శ్రీ నెహ్రూగారు ఫిబ్రవరి 4-వ తారీఖున హైద్రాబాదు వస్తారని తెలుస్తున్నది. అప్పుడు ఆయన ఇరుపక్షాలకు సమరసం కుదురుస్తారని తెలుస్తున్నది. అంతే కాక "కృష్ణా—గోదావరీ నదీ జలాల విషయంలో 1951 సం॥న చేసికొన్న ఒడంబడిక ప్రకారం జరుపుతా"మని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిశ్చయించుకుంది. దానికి భిన్నంగా జరుగరాదని వాళ్ల అభిప్రాయం. ప్రధాని యీ విషయాన్నిగూర్చికూడ వాళ్లతో సంప్రదించగలడని తెలుస్తున్నది.

---

# స్వర్గస్థులు

## శ్రీ - శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి

ఆంధ్ర ప్రభుత్వం ఆస్థానకవి – శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు రాజమహేంద్రవరంలో 29–12–60 వ- తారీఖునాడు ఉదయం 4–30. గంటలకు 95 ఏట మరణించారు. ఆయన గొప్ప సంస్కృతాంధ్ర విద్వాంసుడు, భాషాతత్వవిదుడు. ఆయన పాండితీప్రతిభకు- మహామహోపాధ్యాయ, కళాప్రపూర్ణ, బిరుదములేకాక, పద్మవిభూషణ బిరుదముగూడా భారత ప్రభుత్వం ఇచ్చింది. వీరు మహాభారత, రామాయణ, భాగవతాదులు గూడా అనువదించారు. దాదాపు 225 గ్రంథాలను రచించి కవిసార్వభౌములనిపించుకొన్నారు. పెక్కు ప్రదేశాల్లో అష్టశతావధానాలుచేశారు. చిన్నప్పుడు (16ఏండ్ల ప్రాయమప్పుడే) ఆయన్ను కవితాకన్య వరించింది. ఆయన మహాప్రస్థానంవల్ల సాహిత్యాంబర వీథి నుండి ఒక ధ్రువతార జారిపోయింది. ఆయన ఆత్మకు శాశ్వత శాంతి చేకూరుగాక !

## శ్రీ సర్. యం. వెంకట సుబ్బారావు

ఉన్నత న్యాయస్థానంలో న్యాయాధిపతిగాను, రెండు పర్యాయములు ప్రధాన న్యాయాధిపతిగాను పనిచేసి, విశ్రాంతిపొందిన శ్రీ యం. వెంకట సుబ్బరావుగారు 30-12-60 తారీఖున స్వగృహమందు (త్యాగరాయనగరంలో) తమ 82-వ- యేట మరణించారు.

శ్రీ వెంకట సుబ్బారావుగారును, వారిసతీతిలకమును-బీదలు, దిక్కులేనివారు అయిన స్త్రీల అభివృద్ధికొఱకు "మద్రాసు సేవాసదన"మను సంస్థను స్థాపించి నడుపు చున్నారు. బాలభటోద్యమమునకు శ్రీ సుబ్బారావుగారు పెక్కేండ్లు రాష్ట్రీయ కమీషనరుగా ఉండినారు. ఈయన రామదేవభక్తిపరాయణుడు; త్యాగరాజనగరాన వీరు ఒక భజనమందిరమును నిర్మించిరి. వీరి మృతి విని. ప్రధాన న్యాయమూర్తి శ్రీ పి. వి. రాజమన్నారుగారు "సుబ్బారావుగారు మంచి పలుకుబడిగల గొప్పన్యాయమూర్తి. సంఘసంస్కర్త. భార్యయు తానును ప్రజాసేవకయి నెలకొల్పిన 'సేవాసదనము' వారి కీర్తికి శాశ్వత చిహ్నము. వారి న్యాయశాస్త్రపాండిత్యము అపారము"- అని పేర్కొన్నారు.

# గ్రంథ సమీక్ష

[సమీక్షకు రెండేసి ప్రతులు పంపాలి]

1. సుభాషితరత్నమాల : కర్త : శ్రీ వై. వే. రామ బ్రహ్మశాస్త్రి. మూల్యం 50. న. పై. — 28 పుటల పద్యకావ్యం. ప్రతులకు :— శ్రీ బి. వి. ఆర్. శాస్త్రి : M. Sc., 13-1-95, సీతారాంభాగు, హైదరాబాదు.

ఈగ్రంథంలోని ప్రథమభాగంలో 73, ద్వితీయ భాగంలో 34 కందపద్యాలున్నాయ్. మొదటివి, సంస్కృత శ్లోకాల కనువాదాలు, రెండవవి స్వతంత్రాలు. కాని పాఠకులకు ఆరెంటితేడా ఏమాత్రం కనిపించదు. మృదు మధుర శబ్దాలతో చక్కని ధారాశుద్ధి కలిగిన యిందలి పద్యాలలోని నీతులు సులభంగా పిల్లలకు కంఠస్థములు చేసుకోవటానికి అనువుగా ఉన్నాయి. సుభాషిత త్రిశతిలో వృత్తాలు ఏనుగువారిపలె పెద్దపద్యాలలో కాక, కందాల లోనే భావపుష్టి చెడనీక వ్రాయటం ఎంతైనా మెచ్చదగింది. ఒకటి రెండు మచ్చుకు :—

"విద్యా నామ నరస్య రూపమధికమ్" అనే శ్లోకాను వాదం :—

"పురుషులకు విద్య రూపము
పరదేశమునందు మంచి బంధుపు, గురువున్
కరము యశోభోగకరము
వరసద్విద్యలును లేనివారును నరులే?"

స్వతంత్రం :—

పెద్దలు చెప్పిన మాటలు,
ముద్దుగ వినకుండ తిరుగు మూఢునికంటెన్
మొద్దయినా, గ్రద్దయినా
ఎద్దయినా, ఏదియయిన యెక్కువయె గదా।

చౌడప్ప "పెద్దనవలె కృతిచెప్పిన
పెద్దనవలె, అల్పకవిని పెద్దనవలెనా?
ఎద్దనవలె, మొద్దనవలె, గ్రద్దనవలె"

అను పద్య శబ్దానుకరణం
మొత్తానికి ముచ్చటకూర్చే కవిత.

2 దక్షిణానిలము (గేయకావ్యం) కర్త : శ్రీ ఎమ్మనూరు చినవెంకటరెడ్డి, వెల : రూపాయి: 34 పుటలు— ప్రతులకు:- విద్యోదయా పబ్లికేషన్స్, కడప.

ఈకవి హృదయము నిత్యజీవితంలో కడగండ్ల పాలయి దైన్యావస్థ ననుభవించే పాటక జనులన్నా, రైతులన్నా, శ్రామికులన్నా ఆర్ద్రమయి, కరుణరసాన్ని ఒలికిస్తూ అతవి కలాన్ని చకచకా నడిపిస్తుంది. సున్నితమయిన కవితావీధిలోని యేమూరుమూలకో ఈడ్చుకొని వెడుతుంది. "అలా ఆలపించే మొరలు వారివా?— నిజంగా ఆ అమాయకజీవులవా" అనిపిస్తుంది. తుదవెళ్ళ వారి పద్య గేయాల అంతస్సారం అదే. అలాంటి కవితలో శ్రీ రెడ్డిగారు సిద్ధహస్తులు, కాని వారు కవితకయి సిద్ధపడరు, కవితే వారిని సంసిద్ధతతో కూచోమంటుంది- దక్షిణానిల వేగం సహజం అయితే కావచ్చుగాని, ఝణఝణధ్వనులు చేస్తూ ఉవ్వెత్తుగా కదంతొక్కుతూ పరుగెత్తే పంచకల్యాణి స్వభావం మాత్రం ఈ కావ్యాన్ని చదివే వాళ్ళకి ఆశ్చర్య దాయకం అని చెప్పకచెబుతుంది. ఒక్క గీతం వినండి:—

రణిత నూపుర ఝణంఝణతలావర్తింప
చెలువాని జఘనకాంచీ కింకిణులు మ్రోయ
లలిత వలయితపాదలాక్షారసము చింద
ఆలసముగ దక్షిణానిలము మాగడ్డపై,

వీచెనమ్మా యిపుడె॥

★

---

"వండెడువాని, సత్కవిని, వైద్యుని, మంత్రిని, దంత్రవాదినిన్
గొండెము పల్కువాని, రిపుఁ గూడినవాని, ధనేశునిన్, మహీ
మండల మేలువానిఁ, దన మర్మ మెఱింగినవాని, నిష్ఠునిన్,
ఖండితమాడునే, నదియు గండమయా; శరభాంకలింగమా !"

(శరభాంకలింగ శతకం)

# 'ఆంధ్ర మహిళ'

(ఆంధ్ర మహిళాలోకాభ్యుదయ మాసపత్రిక)

వ్యవస్థాపకురాలు :
**శ్రీమతి దుర్గాబాయిదేశ్‌ముఖ్.**

విడి పత్రిక—37 నయాపైసాలు ప్రత్యేక వార్షిక సంచికతో కలిసి
సం॥ చందా - రూ. 6-00.

పంచాయతీ సంస్థలకు. సంక్షేమ సంఘాలకు, పౌరజన గ్రంథాలయాలకు
పాఠశాలా పుస్తక భాండాగారాలకు సగము చందా సం॥ రం॥ కి రూ. 3-00 లు.

## పత్రికా విక్రయసంస్థల యేజంట్లకు

1. 'ఆంధ్ర మహిళ' అరింటికంటె తక్కువ పత్రులకు ఇచ్చే ఆర్డర్లు గమనింపబడవు.
2. పత్రికకు 1 కి 12 న. పైసాలు కమీషను ఇవ్వబడును. పోస్టేజి మేమేభరింతుము.
3. విక్రయంకాని పంచికలు వాపసు తీసికోబడవు.
4. ప్రతినెల "ఆంధ్ర మహిళ" ఎన్నిప్రతులు కావలెనో సూచిస్తూ. అసలుక్రయంలో కమీషను మొత్తం మినహాయించుకొని, తక్కిన మొత్తంతో వచ్చే ఆర్డర్లు అంగీకరింప బడును.
5. ప్రత్యేక వార్షిక సంచిక ప్రతి 1. కి రూ. 2 లు, అయినా, యేజంట్లకు రూ. 1. 50 కే, (అనగా 25. కమీషన్ మినహాయింపుతో) ఇవ్వబడుతుంది.

## ఆంధ్రమహిళ

### ప్రకటన రేట్లు

సామాన్యమైన పుట 1 కి. రూ 60. లు,

అట్టకాగితం 2 వ పుట, 3. వ పుట (ఒకేరంగుతో) రూ 80 లు.

4. వ పుట (ఒకేరంగుతో) రూ 100 లు.

కొయ్య దిమ్మెలుగల బ్లాకులు అంగీకరించ బడును. ప్రకటనలు. బ్లాకులు పత్రిక వెలువడే తారీఖునకు 10 దినములు ముందే మాకు చేరాలి.

మేనేజరు,
ఆంధ్రమహిళ
7 ఎ. రోజరీచర్చిరోడ్డు.
మైలాపూరు—మద్రాసు 4.

Printed at Andhra Mahila Press, 7/A, Rosary Church Road, Published and owned by
Andhra Mahila Sabha, Madras. Editor - Secretary, Andhra Mahila Sabha.